www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 21-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 307

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 11.29 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పునర్వసు మ. 2.19 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా. 11.07-12.53; దుర్ముహూర్తం: మ. 12.06-12.53; అమృతఘడియలు: ఉ. 11.42-1.26; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రంలో ఐదు విద్యాసంస్థలు ప్రారంభం

విశాఖ ఐఐఎం, తిరుపతిలో ఐఐటీ, ఐసర్, ట్రిపుల్ ఐటీ, కర్నూలులో ఐఐఐటీడీఎం

క్యాంపస్‌లను వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ

దేశవ్యాప్తంగా 36 విద్యా సంస్థలు జాతికి అంకితం

వర్చువల్‌గా పాల్గొన్న సీఎం జగన్, అధికారులు

12



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



మోసాల మామ..

దగా 'దీవెన'

ఉత్తుత్తి ప్రేమ!

'విదేశీ విద్య'.. దీవెన కాదు, దగా!

'పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధం' అంటూ తనను తాను పేదల ప్రతినిధిగా ప్రకటించుకునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి... పేద, బలహీన వర్గాల విద్యార్థులకు విదేశీ విద్యను అందించే పథకాన్ని నీరుగార్చారు!

'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు' అని దీర్ఘమైన రాగాలు తీసే జగన్మోహన్ రెడ్డి... సరిగ్గా వారికే విదేశీ విద్య అందకుండా చేశారు.

టీడీపీ సర్కారు 4,923 మంది విద్యార్థులకు రూ.380 కోట్లతో 'విదేశీ చదువులు' చెప్పించింది. వైసీపీ సర్కారు రెండేళ్లలో కేవలం 116 మందిపై రూ.15.69 కోట్లు ఖర్చు పెట్టింది. అయినా సరే... 'గత ప్రభుత్వంకంటే విన్నగా అమలు చేస్తున్నాం' అని అబద్ధాలు చెప్పడం జగన్ సర్కారుకే చెల్లింది.

రెండేళ్లలో 116 మందికే లబ్ధి

పెట్టిన ఖర్చు రూ.15.69 కోట్లు

సమాచార హక్కుతో తేలిన నిజం

కానీ 408 మందికి 107 కోట్లు ఇచ్చినట్లు గొప్పలు

టీడీపీ హయాంలో 4,923 మందికి లబ్ధి

బడుగులకు రూ.380 కోట్లతో విదేశీ చదువులు


ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 'ఉన్నత' అవకాశం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"ప్రపంచ విఖ్యాత విశ్వవిద్యాలయాల్లో పేద పిల్లలకు సీటొస్తే ఫీజులుకట్టే పరిస్థితి ఉండదు. విదేశాల్లో చదువుకునే పేదవిద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.1.25 కోట్ల వరకు ఫీజులు ఇస్తున్నాం. ఈ తరహా సాయం చేస్తున్న రాష్ట్రం దేశంలో ఏదీ లేదు. విప్లవాత్మకమైన అడుగుగా చరిత్రలో ఈ పథకం మిగిలిపోతుంది" 'విదేశీ విద్యాదీవెన' పథకానికి బటన్ నొక్కే సమావేశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నోటి నుంచి వచ్చిన మేడిపండు మాటలివి! అసలు సంగతి ఆరా తీస్తే.. అన్నీ అబద్ధాలే! ఈ విషయం సమాచార హక్కు చట్టం సాక్షిగానే బయటపడింది. టీడీపీ హయాంతో పోల్చితే... విదేశీ విద్యా దీవెన

మిగతా 11వ పేజీలో...



నాడు.. నేడు

• జగన్ హయాంలో

జగన్ హయాంలో 'విదేశీ విద్యా దీవెన' పథకం కింద తొలి విడతలో ఒక్క ఎస్టీకి కూడా సాయం అందలేదు. ఇక... రెండో ఏడాది 13 మంది బీసీలు, 12 మంది ఎస్సీలు మాత్రమే ఎంపికయ్యారు. ఒకే ఒక్క ఎస్టీని అర్హుడిగా ఎంపిక చేశారు.

• టీడీపీ హయాంలో

మొత్తం లబ్ధిదారులు 4,923	
బీసీలు	1,975
ఎస్సీ, ఎస్టీలు	491
మైనారిటీలు	527
ఈబీసీలు	734
కాపులు	1,196

సాయం తక్కువ.. డప్పు ఎక్కువ!

ముస్లింలకు జగన్ మార్క్ మోసం

బాబు హయాంలో దుల్హన్ పథకం కింద 40 వేల మందికి సాయం

5 విడతల్లో వైసీపీ షాదీ తోఫా.. దక్కింది 6,280 మందికి మాత్రమే

గతం కన్నా ఎక్కువ చేశామంటూ ముస్లింలపై సీఎం కపట ప్రేమ

ఎన్నికల ముందు మైనారిటీలను మభ్యపెట్టే యత్నం





'ఈనాడు', 'ఆంధ్రజ్యోతి' పత్రికలను, రామోజీ, రాధాకృష్ణలను దూషిస్తూ ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న వైసీపీ కార్యకర్తలు

కర్నూలు 'ఈనాడు' కార్యాలయంపై

వైసీపీ దాడి

ఆఫీసుపై రాళ్ల వర్షం...పగిలిన అద్దాలు.. తలుపులు బద్దలుకొట్టే యత్నం

రోడ్డుపై వేసి పత్రిక ప్రతులకు నిప్పు.. కాటసాని అనుచరుల బీభత్సం

'వ్యతిరేక వార్తలు రాస్తారా..అంతు చూస్తాం' అంటూ గంటన్నరకుపైగా భయానక వాతావరణం

ఫ్లెక్సీపై 'ఆంధ్రజ్యోతి', ఎండీ రాధాకృష్ణకు వ్యతిరేకంగా రాతలు

11

ఆగని అరాచకాలు

దాడులు దారుణం

విపక్షాలు, సంఘాల మండిపాటు



'ఈనాడు' కార్యాలయంపైకి రాళ్లు విసురుతున్న దృశ్యం

'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడి

చొక్కా చింపి.. కొట్టి..

కర్నూలు జిల్లా మద్దికెరలో వైసీపీ మూకల దాడి

'మాపైనే వార్తలు రాస్తావా..' అంటూ దౌర్జన్యం

దాడులు ఆగేవరకు పోరుబాటే!

కొనసాగిన జర్నలిస్టుల ఆందోళనలు

11

అజ్ఞాతంలోకి వైసీపీ గూండాలు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి జరిగిన

మూడురోజుల తర్వాత మొదటి అరెస్టు

జర్నలిస్టుల ఆందోళనలతో కదిలిన పోలీసులు

దాడి చేసిన వారిలో చాలామంది ఇంకా బయటే

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

2

ఏర్పాట్లపై రాష్ట్రాలవారీగా ఈసీ అధికారుల తుది సమీక్ష

ఏప్రిల్-మేలో లోక్‌సభ ఎన్నికలు

ఏపీ సహా 4 అసెంబ్లీలకూ..

బోర్డు పరీక్షలు ఏటా రెండుసార్లు

2

ఎక్కువ మార్కుల ఎంపికకు చాన్స్

వచ్చే విద్యా సంవత్సరం నుంచే

ఏడాదిలో పది రోజులు 'నో బ్యాగ్స్'

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి




6 పెద్ద ట్రంకు పెట్టెలు తెండి

6, 7 తేదీల్లో జయలలిత ఆభరణాలు తీసుకెళ్లండి

2

తమిళనాడు ప్రభుత్వానికి బెంగళూరు కోర్టు సూచన

ఐజీ స్థాయి పోలీసు అధికారి, మీడియా సమక్షంలో అందజేత



ఆళ్ల పీచేముడ్

వైసీపీని వీడినంత వేగంగానే వెనక్కి

మంగళగిరికి డబ్బులు ఇవ్వడం లేదని

జగన్‌ను తిట్టి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఆళ్ల

3

రెండు నెలలు తిరక్కుండానే యూటర్న్

జగన్‌తోనే పేదలకు అభివృద్ధి అని వ్యాఖ్య

టీడీపీ సీనియర్ నేత.. మర్రెడ్డిపై హత్యాయత్నం!

ఆర్థిక లావాదేవీలపై చర్చకు పిలిచి దాడి

తలకు తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

దాడి చేసింది డాక్టర్ అసిస్టెంటే

దగ్గరుండి ప్రోత్సహించిన జిమ్స్ వైద్యుడు



12



నర్సీపట్నం సభకు హాజరైన మహిళలు.. ప్రసంగిస్తున్న లోకేశ్

రూ.లక్ష కోట్ల ఆస్తి ఉన్న

అతి పేదవాడు!

ఎన్నికలు జగన్ అహంకారానికి, ప్రజల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధం: లోకేశ్

స్కూళ్ల విలీనంతో చదువుకు పేద పిల్లలు దూరం.. ఏపీలోనే అత్యధిక డ్రాపవుట్స్

మేమొచ్చాక జీవో 117ను రద్దు చేస్తాం.. ఉత్తరాంధ్రను భ్రష్టుపట్టించారు 12

ఒక్క పరిశ్రమనూ తీసుకురాలేదు.. ఉన్నవి కూడా 'గుడ్డు మంత్రి' దెబ్బకు పరార్

మేమొస్తే పథకాలు రద్దు చేస్తామన్న ప్రచారాన్ని నమ్మొద్దు: శంఖారావంలో వినతి

చిన్నారులపై ప్రయోగాలకు అనుమతించలేం: హైకోర్టు

ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను ఎలా అనుమతిస్తారు?

ప్రభుత్వ నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని వ్యాఖ్య

డీఎస్సీ నోటిఫికేషన్‌పై స్టే ఇచ్చేందుకు సిద్ధపడిన ధర్మాసనం



12

వివరాల సమర్పణకు సమయం కోరిన ఏజీ.. విచారణ నేటికి వాయిదా

ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థే విజేత

చండీగఢ్ మేయర్ కుల్‌దీప్ కుమార్

సుప్రీం కోర్టు సంచలన తీర్పు

రిటర్నింగ్ అధికారి మాసిహ్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశం

కోర్టు గదిలో ఓట్ల లెక్కింపు.. దేశ చరిత్రలోనే తొలిసారి



ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సుప్రీం: ఆప్

బీజేపీ నిర్వాకం బట్టబయలు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఆప్-కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కుల్‌దీప్ కుమార్‌ను 'చట్టపరంగా విజేత' అని సుప్రీంకోర్టు ప్రకటించింది. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన బీజేపీ నేత అనిల్ మాసిహ్ ఈ ఎన్నికల్లో తీవ్రమైన అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అతనిపై విచారణకు ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని తాము కొట్టివేయడంలేదని, కుల్‌దీప్ కుమార్‌కు అనుకూలంగా వచ్చిన ఓట్లలో ఎనిమిది ఓట్లను చెల్లకుండా చేస్తూ ఓట్ల లెక్కింపులో పాల్పడిన అక్రమాన్ని సరిచేయడం వరకే పరిమితమయ్యామని ధర్మాసనం స్పష్టం చేసింది. అనిల్ మాసిహ్

మిగతా 2వ పేజీలో...



మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

- ఏర్పాట్లపై రాష్ట్రాలవారీగా తుది సమీక్ష జరుపుతున్న ఈసీ అధికారులు
- అందుబాటులో ఉండే భద్రతా బలగాలపై ఆరా.. ఏప్రిల్-మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి 9 తర్వాత విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులు రాష్ట్రాల వారీగా పర్యటిస్తూ, ఎన్నికల సన్నద్ధతపై తుది సమీక్ష జరుపుతున్నారు. అందుబాటులో ఉండే భద్రతాబలగాల సంఖ్యపై కూడా సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మార్చి 9 తర్వాత ఈసీ.. ఎన్నికల తేదీలను ప్రకటించవచ్చని ఓ ఇంగ్లిష్ న్యూస్ చానల్ వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్, మే నెలల్లో జరగనున్నాయి. దాంతోపాటు ఏపీ సహా 4రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటిలో జమ్ము కశ్మీర్ కూడా ఉంటుందా? లేదా? అన్నదానిపై ఇంకా ఈసీ నిర్ణయం తీసుకోలేదు. ఈసీ అధికారులు మార్చి 12-13 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితుల ను అంచనా వేయనున్నట్లు సమాచారం. 2019లో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకూ ఏడు దశల్లో జరిగాయి. ఫలితాలు మే 23న వెలువడ్డాయి. ఈసారీ దాదాపు అదే షెడ్యూల్ ఉండే అవకాశం ఉంది.

ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలు


'ఎక్కువ మార్కుల'ను ఎంచుకునే అవకాశం

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి
- కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

రాయ్‌పూర్, ఫిబ్రవరి 20: విద్యార్థులపై భారం తగ్గించేందుకు వచ్చే సంవత్సరం నుంచి రెండుసార్లు బోర్డు పరీక్షలు (10, 12 తరగతులు) నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఎందులో ఎక్కువ మార్కులు వస్తే దానినే ఎంచుకోవచ్చని తెలిపారు. కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగంగా ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలను ప్రతిపాదించిన సంగతిని గుర్తుచేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రధాన్ ప్రారంభించి మాట్లాడారు. ఏడాదిలో 10 రోజులు విద్యార్థులు బ్యాగులు లేకుండా బడికి వచ్చేలా చూడాలని.. ఆ రోజుల్లో కళలు, సంస్కృతి, క్రీడలు, తదితర కార్యకలాపాల్లో పాల్గొనేలా చేయాలని కోరారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు బిడ్ దాఖలు చేస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. పీఎం శ్రీ పథకం కింద రాష్ట్రంలో 211 పాఠశాలలను ఒక్కోదానికి రూ.2 కోట్లు చొప్పున వెచ్చించి హబ్ అండ్ స్పోక్ పద్ధతిలో అప్‌గ్రేడ్ చేయనున్నారు. 'హబ్'గా ఉన్న పాఠశాలను మెంటార్‌గా వ్యవహరిస్తారు. దీని ద్వారా మిగతావాటికి మార్గ నిర్దేశం చేస్తారు. కాగా, కొత్త ఎన్‌ఈపీని నిరుడు ఆగస్టులో కేంద్రం ప్రకటించింది. రెండుసార్లు బోర్డు పరీక్షల నిర్వహణ ద్వారా విద్యార్థులు సన్నద్ధమయ్యేందుకు సమయం దొరుకుతుందని.. మంచి మార్కులు సాధించేందుకు వీలు కలుగుతుందని తెలిపింది.

లోకం తీరు



6 పెద్ద ట్రంకు పెట్టెలు తెండి

- జయలలిత ఆభరణాలు తీసుకెళ్లండి

బెంగళూరు/చెన్నై, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అక్రమ ఆస్తుల కేసులో గతంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన కోట్లాది రూపాయల విలువైన ఆభరణాలను తమిళనాడుకు తరలించేందుకు ముహూర్తం ఖరారయింది. బెంగళూరులోని 36వ సిటీ సివిల్ సెషన్స్ కోర్టు సోమవారం తేదీలను ఖరారు చేసింది. మార్చి 6, 7 తేదీలలో వీటిని బెంగళూరు నుంచి చెన్నైకి తగిన భద్రత నడుమ తీసుకెళ్లాలని, కనీసం ఆరు పెద్ద ట్రంకు పెట్టెలను తీసుకురావాలని తమిళనాడు ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడు ఐజీపీ స్థాయి పోలీసు ఉన్నతాధికారి, మీడియా సమక్షంలో బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను కోర్టు అందజేయనుంది. తమిళనాడు పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు హాజరయ్యే తేదీని కర్ణాటక హోం శాఖ కార్యదర్శికి తెలియజేయాలని కోర్టు సూచించింది. జయలలిత నుంచి గతంలో స్వాధీనం చేసుకున్న 7,040 గ్రాముల బరువైన 468 బంగారు, వజ్రాల ఆభరణాలు, 700 కిలోల వెండి ఆభరణాలతో పాటు ఖరీదైన చీరలు, వాచీలు, పాదరక్షలు, ఇతర వస్తువులను తమిళనాడు ప్రభుత్వానికి కోర్టు అందజేయనుంది. వీటన్నింటిని ఒక మ్యూజియంలో సంరక్షించే బాధ్యతను తమిళనాడు ప్రభుత్వమే చేపట్టాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది.

మరి ఆ 7 కిలోల నగలు

జయ నుంచి స్వాధీనం చేసుకున్న 27 కిలోల నగల్లో 7 కిలోల నగల్ని విక్రయించడానికి మాత్రం న్యాయస్థానం నిరాకరించింది. జయకు ఆమె తల్లి అందజేసిన పారంపర్య నగలు కావడంతో వాటిని విక్రయించరాదని సూచించింది. మిగిలిన నగలను మాత్రమే వేలం వేయాలని పేర్కొంది. దీంతో ఆ 7 కిలోల నగల్ని ఎవరికి అప్పగిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. జయకు వారసత్వంగా వచ్చిన నగలు అయినందున.. ఆమె మేనకోడలు దీపకు ఇచ్చే అవకాశముందని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

భూమనకు భయపడుతున్నారా?

- టీడీఆర్ బాండ్లపై ఎందుకు స్పందించరు?
- తిరుపతి కలెక్టర్‌పై టీడీపీ నేత ఆనం ఫైర్
- ధర్మారెడ్డి వియ్యంకుడికి రూ.53.72 కోట్ల బాండ్
- మరో 300 బాండ్ల జారీకి యత్నాలు
- మేం అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తాం
- భూమన, ఆయన తనయుడు జైలుకెళ్లక తప్పదు
- ఆనం వెంకటరమణారెడ్డి స్పష్టీకరణ

నెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అక్రమాలను ఆధారాలతో బయటపెట్టినా తిరుపతి కలెక్టర్ ఎందుకు విచారణ జరపడం లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే, బ్రోకర్ భూమన కరుణాకర్‌రెడ్డిని చూసి భయపడుతున్నారా అని నిలదీశారు. ఐఏఎస్ అధికారులకే సిగ్గు లేకపోతే ఇక వారి కింది స్థాయి ఉద్యోగులు ఎలా పనిచేస్తారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారమిక్కడ ఎన్టీఆర్ భవన్‌లో ఆనం విలేకరులతో మాట్లాడారు. 'తిరుపతిలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం టీడీఆర్ బాండ్లు ఇచ్చిన ఏరియా 2.89 లక్షల చదరపు గజాలు. ఆ ఏరియాకు సంబంధించి జారీ చేసిన 373 టీడీఆర్ బాండ్లలో సగానికి సగం అవకతవకలు జరిగాయి. దొంగ జీపీఏలతో రిజిస్ట్రేషన్లు చేశారు. వివాదాస్పద భూములకు కూడా టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. రూ.4,052 కోట్ల విలువైన బాండ్లు జారీ చేసి భారీ దోపిడీకి తెరలేపారు. ఇప్పటి వరకు జారీ చేసిన టీడీఆర్ బాండ్లే కాకుండా మరో 300 టీడీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉండగా వాటిని కూడా జారీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కంచి రాము అనే వ్యక్తికి రూ.61.02 కోట్ల విలువైన బాండ్(నంబర్ 0356) ఇచ్చారు. కానీ అసలా భూమి ఆయనది కానేకాదు. ఈ విషయాన్ని తిరుపతి జాయింట్ కలెక్టరే చెప్పారు. డబ్బులిస్తే అధికారులు ఏమైనా చేస్తారా..? వెంకటేశ్వరస్వామి గుడిని కూడా రాసిచ్చేస్తారా..? వెంటనే కలెక్టర్, జేసీ, ఆర్డీవో, తహసీల్దార్ మీద రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించి కంచి రాముకు ఇచ్చిన రూ.61 కోట్లను రికవరీ చేయాలి. డి.మురళి అనే వ్యక్తి 14-02-2020న 793.76 గజాల భూమిని జీపీఏ చేసుకున్నారు. ఈ డాక్యుమెంట్‌కు సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన విలువ చదరపు గజం రూ.10 వేలు. మొత్తం భూమి విలువ రూ.79.38 లక్షలకు వాల్యుయేషన్ చేసి జీపీఏ తీసుకున్నారు. 04-02-2021న అంటే ఏడాది తర్వాత అదే అధికారులు మురళి జీపీఏ తీసుకున్న భూమికి గజం రూ.1.60 లక్షల వాల్యుయేషన్ కట్టారు. దీని ఆధారంగా ఆయనకు రూ.12.69 కోట్ల విలువైన బాండ్(నంబర్ 00062) జారీ చేశారు. కె.వెంకటరమణారెడ్డికి రూ.53.72 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్(నంబర్ 00320) ఇచ్చారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి విలువ కట్టారు. ఈ వెంకటరమణారెడ్డి టీటీడీ ఈవో ధర్మారెడ్డికి వియ్యంకుడు. టీడీఆర్ బాండ్ల స్కామ్, ఓటర్ల లిస్టు స్కామ్ చేసింది ఒకటే బ్యాచ్. టీడీపీ అధికారంలోకి రాగానే టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణ జరిపిస్తాం. భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయుడు అభినయ్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం' అంటూ ఆనం స్పష్టం చేశారు.

విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు 10% రిజర్వేషన్లు

- బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన మహారాష్ట్ర అసెంబ్లీ

ముంబై, ఫిబ్రవరి 20: విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మహారాష్ట్ర శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో మరాఠా కోటాకు సంబంధించిన ఈ బిల్లును ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సభలో ప్రవేశపెట్టారు. ఇది చట్టరూపం దాల్చి అమలులోకి వచ్చిన పదేళ్ల తర్వాత దానిపై సమీక్ష చేపట్టవచ్చని బిల్లులో ప్రతిపాదించారు. రాష్ట్ర జనాభాలో 28శాతం మంది మరాఠాలు ఉన్నారని షిండే తెలిపారు.

హైతీ అధ్యక్షుడి హత్యలో భార్య హస్తం!

- విచారణ నివేదికలో సంచలన విషయాలు

పోర్ట్-ఎ-ప్రిన్స్, ఫిబ్రవరి 20: 2021లో జరిగిన హైతీ అధ్యక్షుడు జొవెనెల్ మోయిస్ హత్య కేసు విచారణ నివేదికలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ హత్యలో ఆయన భార్య మార్టిన్ మోయిస్ హస్తం ఉన్నట్లు అందులో వెల్లడయింది. ఈ కేసుపై విచారణ జరుపుతున్న జడ్జి సోమవారం తుది నివేదికను విడుదల చేశారు. దాదాపు 50 మంది అనుమానితులపై అభియోగాలు మోపుతూ 122 పేజీల నివేదిక ఇచ్చారు. ఈ హత్యలో మార్టిన్‌తో పాటు మాజీ ప్రధాన మంత్రి క్లాడె జోసెఫ్, హైతీ నేషనల్ పోలీస్ మాజీ చీఫ్ లియోన్ చార్లెస్ పాత్ర కూడా ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. 2021 జూలై 7న.. హైతీ అధ్యక్షుడిగా ఉన్న జొవెనెల్ మోయిస్(53) రాజధాని పోర్ట్-ఎ-ప్రిన్స్‌కు సమీపంలోని తన ప్రైవేట్ నివాసంలో హత్యకు గురయ్యారు.

బీజేపీకి వంద సీట్లు కూడా రావు: ఖర్గే

బెంగళూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 100 సీట్లు కూడా రావని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. కర్ణాటకలోని బీదర్‌లో మంగళవారం జరిగిన భారీ బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ఈ సారి బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయేకు 400 సీట్లు వస్తాయని మీడియాలో రంగురంగుల కథనాలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. న్యాయం కోరుతున్న రైతులను ఉగ్రవాదులుగా చూపుతూ, ఉక్కుపాదం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా ఇంజనీర్లకు 'కల్పనా ఫెలోషిప్'

- అంతరిక్ష రంగంలో రాణించాలని కోరుకునే మగువలకు స్కైరూట్ సంస్థ సువర్ణావకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: అంతరిక్ష రంగంలో రాణించాలని కలలు కంటున్న మహిళా ఇంజనీర్ల కోసం హైదరాబాద్‌కు చెందిన స్కై రూట్ సంస్థ సువర్ణావకాశాన్ని కల్పించింది. అర్హత గల వారికి ఒక ఏడాది పాటు తమ సంస్థలో వేతనంతో కూడిన కల్పనా ఫెలోషిప్‌ను అందించడంతో పాటు, దాన్ని విజయవంతంగా పూర్తిచేసిన వారికి తమ సంస్థలోనే ఉద్యోగం ఇస్తామని ప్రకటించింది. అంతరిక్ష రంగంలోకి రావాలని కోరుకునే మహిళలకు మరింత ప్రోత్సాహాన్ని కల్పించేందుకే తాము ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ సీఈవో పవన్ చందనా చెప్పారు. అంతరిక్ష రంగంలో చరిత్ర సృష్టించిన భారత సంతతికి చెందిన కల్పనా చావ్లా జ్ఞాపకార్థం ఈ కార్యక్రమానికి ఆమె పేరు పెట్టినట్లు తెలిపారు. అర్హులైన వారు తమ సంస్థ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సంస్థ సహ వ్యవస్థాపకులు భారత్ ఢాకా చెప్పారు. ఇంజనీరింగ్ ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు కూడా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని ఆయన చెప్పారు.

రాయలసీమలో పెరిగిన ఎండ

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగింది. మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అత్యధికంగా అనంతపురంలో 38.2 డిగ్రీలు నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 23 నుంచి కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

స్విస్‌ను మరిపించేలా కశ్మీరు!

గొప్ప పర్యాటక ప్రాంతంగా మలుస్తాం.. 370 అధికరణ రద్దుతోనే సాధ్యపడుతోంది: మోదీ

- రూ.32 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- వివిధ రైల్వే పథకాలు జాతికి అంకితం
- మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా హర్షం



జమ్మూ కశ్మీర్‌లో తొలి ఎలక్ట్రిక్ రైలును ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

జమ్ము, ఫిబ్రవరి 20: జమ్మూకశ్మీరు సమగ్రాభివృద్ధికి 370 అధికరణ రద్దు కీలకంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్విట్జర్లాండ్‌ను మరిపించేలా కశ్మీరును పర్యాటక కేంద్రంగా మలుస్తామని ప్రకటించారు. పర్యాటకులు స్విస్‌ను సందర్శించడమే మరిచేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆయన మంగళవారమిక్కడ మౌలానా ఆజాద్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో.. జమ్మూకశ్మీరులో రూ.32 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు/శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీవర్షం నడుమే ప్రసంగించారు. ఇక్కడ జి-20 సదస్సు నిర్వహించడం వల్ల కశ్మీరు అందాలు, సంస్కృతి ప్రపంచం దృష్టిని ఆకర్షించాయని.. అరబ్ దేశాల నుంచి పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో నవశకం మొదలైందన్నారు. జమ్మూకశ్మీరు కుటుంబ పాలన నుంచి విముక్తి పొందిందని, కేంద్రం నేరుగా కశ్మీరీలతో మమేకం అవుతోందని తెలిపారు. ఒకప్పుడు హింస, వేర్పాటువాదం, తుపాకులు, బాంబుల మోతతో విలవిలలాడిన జమ్మూకశ్మీరు.. తన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో ఇప్పుడు సరికొత్తగా సామరస్యం, ప్రగతి దిశగా కదులుతోందని చెప్పారు. ప్రగతిశీలక జమ్మూకశ్మీరును అందిస్తామని ప్రమాణం చేశామని.. దానిని చేసి చూపుతామని.. వచ్చే కొన్నేళ్లలో యువత కలలు నెరవేరుస్తామని తెలిపారు. జమ్మూకశ్మీరు రాష్ట్రంగా ఉన్నప్పుడు 370 అధికరణ దాని అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. ఆ గోడను తన ప్రభుత్వం బద్దలు కొట్టిందని చెప్పారు. ఈ అధికరణ రద్దుకు గుర్తుగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని 370 సీట్లలో గెలిపించాలని కోరారు. 370 అధికరణపై బాలీవుడ్‌లో ఓ సినిమా నిర్మితమవుతోందని కూడా ప్రస్తావించారు. ఈ సినిమా గురించి సోమవారమే తనకు తెలిసిందని.. అదెలా ఉంటుందో తనకు తెలియదని.. అయితే వాస్తవ సమాచారాన్ని ప్రేక్షకులకు అందజేస్తుందని భావిస్తున్నానని తెలిపారు.

కోటి లక్షాధికారిణులు..

జమ్ము సభకు ముందు ప్రధాని కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ పథకాల లబ్ధిదారులతో సంభాషించారు. ప్రధానంగా కతువా జిల్లా బసోలీకి చెందిన స్వయం సహాయ సంఘం (ఎస్‌హెచ్‌జీ) అధిపతి కీర్తితో మాట్లాడారు. రుణసాయం పథకంతో గ్రామీణ మహిళల జీవితాలు ఎలా మారుతున్నాయో ఆమెతో చెప్పించారు. ఆమె ఆధ్వర్యంలోని సంఘం మూడు ఆవులు కొని.. రుణం చెల్లించింది. ఇతర మహిళల సాయంతో ఇప్పుడు పెద్ద గోశాలను నిర్మించారు. ఈ మార్పు ఘనత ప్రధానిదేనని చెప్పారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కూడా మాట్లాడారు. దీన్‌దయాళ్ అంత్యోదయ స్కీం లబ్ధిదారైన షహీన్ పోస్టుగ్రాడ్యుయేట్ కూడా. ఇప్పుడామె ఔత్సాహిక పారిశ్రామికవేత్త. పౌల్ట్రీ ఫాం సహా వివిధ యూనిట్ల ఏర్పాటుతో కశ్మీరు గ్రామీణ ప్రాంతాలు ఏ విధంగా పరివర్తన చెందుతున్నాయో ఆమె వివరించారు.

మోదీకి యామీ గౌతమ్ ధన్యవాదాలు

370 అధికరణపై సినిమా గురించి ప్రస్తావించినందుకు ప్రధాని మోదీకి నటి యామీ గౌతమ్ 'ఎక్స్'లో ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన అంచనాలకు మించి తాము నటిస్తామన్న ఆశాభావం వ్యక్తంచేశారు. మోదీ ప్రసంగ వీడియోను కూడా షేర్ చేశారు. ఈ నెల 23న ఆ సినిమా విడుదల కానుంది.

దేశంలోనే అతిపొడవైన రైలు సొరంగం

ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు మార్గంలో దేశంలోనే అతిపొడవైన రవాణా టన్నెల్‌కు మోదీ శ్రీకారం చుట్టారు. ఖారీ-సుంబర్ సెక్షన్ నడుమ 12.77 కిలోమీటర్ల పొడవున ఈ టన్నెల్ ఉంది, దీనిని టీ-50గా పిలుస్తారు. బనిహాల్-ఖారీ-సుంబర్-సంగల్‌దాన్ కొత్త రైల్వే లైన్‌ను(48.1 కిలోమీటర్లు), శ్రీనగర్ నుంచి సంగల్‌దాన్ వరకు, సంగల్‌దాన్ నుంచి శ్రీనగర్ వరకు నడిచే రెండు విద్యుత్ రైళ్లను కూడా ప్రధాని ప్రా రంభించారు. బారాముల్లా-బనిహాల్ మధ్య మొత్తం 8 విద్యుత్ రైళ్లు నడవనున్నాయి. జమ్మూకశ్మీరులో పెద్దఎత్తున రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించడంపై మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేశారు. రైలే శాఖ, ప్రధాని మోదీ చేపట్టిన అతి గొప్ప చర్యగా అభివర్ణించారు.

అణు విద్యుత్తులో ప్రైవేటు పెట్టుబడులు

రిలయన్స్, టాటా సహా ఐదు సంస్థలతో ఏడాదిగా చర్చలు జరుపుతున్న కేంద్రం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కర్బన ఉద్గారాల బెడద లేకుండా కరెంటును ఉత్పత్తిని పెంచడం కోసం.. అణు ఇంధన రంగంలో 2600 కోట్ల డాలర్ల ప్రైవేటు పెట్టుబడులను కేంద్రం ఆహ్వానిస్తోంది. 2600 కోట్ల డాలర్లంటే దాదాపుగా రూ.2.1 లక్షల కోట్లు. ఈమేరకు కేంద్రప్రభుత్వానికి చెందిన అణు ఇంధన విభాగం, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్).. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా పవర్, అదానీ పవర్, వేదాంత లిమిటెడ్ సహా ఐదు సంస్థల తో ఏడాదిగా చర్చలు జరుపుతున్నట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక్కో కంపెనీ నుంచి రూ.44 వేల కోట్ల పెట్టుబడులను కేంద్రం ఆశిస్తోంది. దేశంలో తయారవుతున్న విద్యుత్తులో.. కర్బన ఉద్గారాలను విడుదల చేయని అణు విద్యుత్తు వాటా కేవలం 2 శాతమే. శిలాజేతర ఇంధనాలతో తయారవుతున్న స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 42%. ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టించగలిగితే.. శిలాజేతర ఇంధనాలతో తయారవుతున్న విద్యుత్తు 2030 నాటికి మరో 8% మేర పెరిగి 50 శాతానికి చేరుతుందని అంచనా. ఈ రూ.2.1 లక్షల కోట్ల ప్రైవేటు పెట్టుబడితో 2040 నాటికి దేశ అణువిద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 11 వేల మెగావాట్లకు పెంచుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మన దేశంలో 7500 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అణు విద్యుత్ కేంద్రాలున్నాయి. వీటిని ఎన్‌పీసీఐఎల్ నిర్వహిస్తోంది. మరో 1300 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి అవసరమైన పెట్టుబడులు పెట్టడానికి ఎన్‌పీసీఐఎల్ సిద్ధంగా ఉంది. అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు మాత్రం ఎన్‌పీసీఐఎల్‌వేనని ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థే విజేత

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశ పూర్వకంగానే ఆ ఎనిమిది బ్యాలెట్ పత్రాలను చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించారని పేర్కొంది. జనవరి 30న జరిగిన మేయర్ ఎన్నికల ఫలితాలను రద్దు చేసింది. అనిల్ మాసిహ్ 'ఎక్స్' గుర్తులు వేసి చెల్లవని ప్రకటించిన 8 ఓట్లు ఆప్ అభ్యర్థికే దక్కుతాయని తేల్చిచెప్పింది.



అనిల్ మాసిహ్‌పై క్రిమినల్ చర్యలు..

కోర్టుకు తప్పుడు వాంగ్మూలం ఇచ్చినందుకు సీఆర్‌పీసీలోని సెక్షన్ 340 కింద అనిల్ మాసిహ్‌పై క్రిమినల్ చర్యలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. మేయర్ ఎన్నికల్లో ఎనిమిది ఓట్లను రిటర్నింగ్ అధికారి చెల్లనివిగా పేర్కొంటూ బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను విజేతగా ప్రకటించిన విషయం తెలిసిందే. మనోజ్ సోంకర్‌కు 16 ఓట్లు, ఆప్-కాంగ్రెస్ అభ్యర్థి కుల్‌దీప్ కుమార్‌కు 12 ఓట్లు వచ్చినట్టు అనిల్ మాసిహ్ ప్రకటించారు. కౌంటింగ్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి సందేహాస్పదంగా ప్రవర్తిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమ్ ఆద్మీ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో బ్యాలెట్ పత్రాలను, కౌంటింగ్ రోజు నమోదైన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన ధర్మాసనం కుల్‌దీప్‌ను విజేతగా ప్రకటించింది. అనిల్ మాసిహ్ 8 మంది ఓట్లపై 'ఎక్స్' అని రాసి వాటిని పక్కన పెట్టిన తీరు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా నమోదైంది. తప్పు చేసినట్టు నిరూపణ అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంద ని విచారణ సందర్భంగానే అనేకసార్లు అనిల్ మాసి హ్‌ను సుప్రీం హెచ్చరించింది. అతని చర్యలు ప్రజాస్వామ్యానికే మచ్చగా కోర్టు తొలుత అభివర్ణించింది. ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలు చేయడం భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి.

చిన్న చుక్కలున్నాయ్: రోహత్గీ

బ్యాలెట్ పత్రాలను కౌన్సిలర్లే నిర్వీర్యం చేసుకొన్నారని, అందుకే తాను వాటిపై 'ఎక్స్' మార్కు రాసి చెల్లనివిగా లెక్కించానని అనిల్ మాసిహ్ సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. మంగళవారం ఆ పత్రాలను తెప్పించి పరిశీలించిన ధర్మాసనం.. ఆ ఓట్లు ఏ విధంగా చెల్లలేదో వివరించాలని అనిల్ మాసిహ్‌ను నిలదీసింది. అయితే, వాటిపై చిన్న చిన్న చుక్కలు ఉన్నాయని అనిల్ మాసిహ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదించారు. అందుకే అవి చెల్లని ఓట్లుగా ఆయన అంచనాకు వచ్చారని తెలిపారు. ఈ వాదనతో సుప్రీంకోర్టు సంతృప్తి చెందలేదు. 'ఆ ఎనిమిది ఓట్లు కుల్‌దీప్ కుమార్‌కు అనుకూలంగా వచ్చాయి' అని ధర్మాసనం పేర్కొంది.

రీపోలింగ్ జరిపితే..

బీజేపీ అభ్యర్థి సోంకర్‌కు 16, ఆప్-కాంగ్రెస్ అభ్యర్థి కుల్‌దీప్‌కు 12 ఓట్లు వచ్చినట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించిన విషయం తెలిసిందే. కుల్‌దీప్‌కు అనుకూలంగా వచ్చిన మరో ఎనిమిది ఓట్లను చెల్లనివిగా ప్రకటించారు. చండీగఢ్ మున్సిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలోనే ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు బీజేపీలో చేరిపోయారు. అలాగే, స్థానిక ఎంపీ(బీజేపీ)కీ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు హక్కు ఉంది. దీంతో బీజేపీ బలం 19కి పెరగగా, ఆప్-కాంగ్రెస్ బలం 17కు పడిపోయింది. సోంకర్ కోరినట్టు రీ-పోలింగ్‌కు కోర్టు ఆదేశించి ఉంటే గనుక బీజేపీకి స్పష్టంగా మేలు జరిగేది. అయితే, మళ్లీ తాజాగా ఎన్నికల నిర్వహణకు ఆదేశించాలని బీజేపీ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

సీసీటీవీలు ఉంటేనే ఇలా చేశారంటే..


సుప్రీంకోర్టు తీర్పుతో బీజేపీ నిర్వాకం బట్టబయలైందని ఆమ్ ఆద్మీ పార్టీ వ్యాఖ్యానించింది. ఇంత చిన్న ఎన్నికల్లో కూడా బీజేపీ, కేంద్ర ప్రభుత్వం బాహాటంగానే అక్రమాలకు పాల్పడటం చాలా ఆందోళన కలిగించే అంశమని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఉన్నచోటే పరిస్థితి ఇలా ఉంటే, ఇక అవి లేనిచోట కేంద్రం ఇంకా ఏమేం చేస్తోందో అన్నారు. ఈ క్లిష్ట కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలంటూ ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సుప్రీంకోర్టు నిర్ణయం ఎంతగానో దోహదం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 'ఎన్నికల ప్రక్రియ మొత్తం ఒక ప్రహసనం. ఈ చరిత్రాత్మక తీర్పుతో అదంతా బట్టబయలైంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు చరిత్రలోనే తొలిసారి..

ఎన్నికల చివరి దశను కోర్టుగదిలో ఆదేశించడం, ఓట్ల లెక్కింపును సుప్రీం ధర్మాసనం స్వయంగా వీక్షించడం సుప్రీంకోర్టు చరిత్రలోనే ఇది తొలిసారి. ఇటువంటి కుయుక్తుల వల్ల ప్రజాస్వామ్యం నిర్వీర్యం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని న్యాయమూర్తులు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

రాజ్యసభకు సోనియా ఏకగ్రీవం

నడ్డాతో పాటు, మరో 39 మంది కూడా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డాతో పాటు 41 మంది అభ్యర్థులు మంగళవారం రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికయిన ఇతర ప్రముఖుల్లో ఇటీవలే బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ఎల్.మురుగన్ తదితరులు ఉన్నారు. అత్యధికంగా బీజేపీ 20 సీట్లను దక్కించుకోగా, కాంగ్రెస్ ఆరు, తృణమూల్ కాంగ్రెస్ నాలుగు, వైసీపీ మూడు, ఆర్జేడీ రెండు, బీజేడీ రెండు, ఎన్‌సీపీ, శివసేన, బీఆర్ఎస్, జేడీ(యూ)లు ఒక్కొక్క స్థానంలో విజయం సాధించాయి. మొత్తం 56 స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడింది. 50 మంది సభ్యులు ఏప్రిల్ రెండో తేదీన, మరో ఆరుగురు మూడో తేదీన ప దవీ విరమణ చేయనుండడంతో ఈ ఎన్నికలు జరపాల్సి వచ్చింది. 41 సీట్లు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 15 స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్ నుంచి కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెతోపాటు బీజేపీకి చెందిన చున్నిలాల్ గరాసియా, మదన్ రాథోడ్‌కూడా పెద్దల సభకు ఎన్నికయ్యారు. గుజరాత్ నుంచి జె.పి.నడ్డాతో పాటు, ప్రముఖ వజ్రాల వ్యాపారి గోవింద్‌భాయ్ ధోలకియ, మరో ఇద్దరు ఎగువ సభలో ప్రవేశించనున్నారు. మహారాష్ట్ర నుంచి ఆరుగురు ఎన్నికయ్యారు. రాజ్యసభకు వెళ్లనున్న ప్రముఖుల్లో ప్రముఖ జర్నలిస్టు సాగరిక ఘోష్ ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్ తరఫున పశ్చిమ బెంగాల్ నుంచి ఆమె గెలుపొందారు. కేంద్రమంత్రి మురుగన్ మధ్యప్రదేశ్ నుంచి మరో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఒడిశా నుంచి ఎగువ సభలో అడుగుపెట్టనున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి నలుగురు తృణమూల్, ఒక బీజేపీ సభ్యుడు; మధ్యప్రదేశ్ నుంచి నలుగురు బీజేపీ, ఒక కాంగ్రెస్ సభ్యుడు; ఒడిశా నుంచి ఇద్దరు బీజేడీ, ఒక బీజేపీ సభ్యుడు ఏకగ్రీవంగా గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారు. ఉత్తరాఖండ్‌లోని, ఛత్తీస్‌గఢ్, హరియాణాల్లోని ఒక్కొక్క స్థానాన్ని బీజేపీ తన ఖాతాలో వేసుకుంది.

రూ.1100 కోట్ల విలువైన 'మెఫెడ్రోన్' డ్రగ్స్ స్వాధీనం

పుణె, ఫిబ్రవరి 20: మహారాష్ట్రలోని పుణెలో 600 కిలోల మెఫెడ్రోన్ డ్రగ్స్‌ను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.1,100 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని, వారిమీద 'నార్కోటిక్ డ్రగ్స్' చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని పుణె పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్ వెల్లడించారు. "ఆదివారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశాం. వారిని కొరియర్ బాయ్స్‌గా గుర్తించాం. మొదట రూ. 3.85 కోట్ల విలువైన 1.75 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నాం. విచారణలో మరో 55 కిలోల డ్రగ్స్‌ను పట్టుకున్నాం. అనంతరం జరిగిన దర్యాప్తులో భాగంగా కుర్కుంబ్ ఎంఐడీసీ ప్రాంతంలో దాదాపు 550 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నాం." అని అమితేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇతర ఏజెన్సీలతో కలిసి కేసును విచారిస్తున్నామని ఆయన తెలిపారు.

శశిథరూర్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు ఫ్రాన్స్ తమ దేశపు అత్యున్నత పౌర పురస్కారం అయిన 'షెవలియె డి లా లిజియన్ ద హానర్'ను మంగళవారం బహూకరించింది. భారత్- ఫ్రాన్స్ దేశాల మధ్య స్నేహ బంధం బలోపేతమవడానికి థరూర్ చేసిన కృషికి గాను, అలాగే ఆయన రచనలు, ప్రసంగాలను గౌరవిస్తూ ఈ అవార్డును ఇస్తున్నట్లు ఫ్రెంచ్ సెనేట్ అధ్యక్షుడు గెరార్డ్ లార్చర్ ప్రకటించారు. వాస్తవంగా ఈ అవార్డును శశిథరూర్‌కు ఆగస్టు 2022లోనే ప్రకటించినప్పటికీ ఏడాదిన్నర తర్వాత ఫ్రాన్స్ ఆయనకు అందజేసింది. తనకు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం దక్కడంపై శశిథరూర్ హర్షం వ్యక్తం చేశారు.


అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవ దృశ్యం

కనుల పండువగా అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని రథోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 20: అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం మంగళవారం మధ్యాహ్నం లక్షలాదిమంది భక్త జన సందోహాల మధ్య కనుల పండువగా జరిగింది. ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ రథానికి తొలిపూజ చేశారు. అనంతరం కొబ్బరికాయ, గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవమూర్తులను రథంపై కొలువుతీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. గోవింద, నరసింహ నామస్మరణలతో భక్తులు రథాన్ని లాగారు.


చెట్లతాండ్రలో భక్తులు కట్టిన అరటిగెలలు

ఘనంగా అరటిగెలల ఉత్సవం

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 20: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలోని లక్ష్మీనరసింహ ఆలయంలో మంగళవారం అరటిగెలల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం వేకువజాము నుంచే ఆలయం వద్ద భక్తులు బారులుదీరారు. ఈ ఆలయంలో అరటిగెలలు కడితే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో సుమారు 5వేలకు పైగా అరటిగెలలను భక్తులు సమర్పించారు. అరటిగెలలు కట్టేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'నల్లిక్రిక్' జాప్యంపై నిర్మల ఆగ్రహం

- పనులు ఎందుకు చేయలేదంటూ కేంద్ర మంత్రి ఆరా
- ఆర్థిక మంత్రి బుగ్గన, చీఫ్ విప్ ముదునూరిలకు చురకలు


పీఎంలంక సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

నరసాపురం, ఫిబ్రవరి 20: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన దత్తత గ్రామం పీఎంలంక(పెదమైనవాని లంక)లో పేదలకు ఇళ్ల నిర్మాణం, మత్స్యకారులకు ఉపాధి కల్పించే నల్లిక్రిక్ కాలువ తవ్వకం పనులు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు పనులు చేపట్టలేదంటూ రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజులను నిలదీశారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పీఎంలంకకు మంగళవారం ఆమె విచ్చేశారు. ఎనిమిదేళ్ల క్రితం ఈ గ్రామాన్ని ఆమె దత్తత తీసుకుని పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలోని డిజిటల్ భవనంలో శిక్షణ పొందిన నిరుద్యోగులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఓ మత్స్యకారుడు నల్లిక్రిక్ పనులు నిలిపివేశారంటూ కేంద్రమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీరియస్ అయిన ఆమె ఈ పని రాష్ట్ర పరిధిలో ఉందా? కేంద్ర పరిధిలోనిదా? అంటూ పక్కనున్న మంత్రి బుగ్గనను ఆరా తీశారు. దీంతో తడబడిన బుగ్గన, ముదునూరి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. పనులు తిరిగి ప్రారంభించేందుకు రీ ఎస్టిమేషన్ వేయిస్తున్నామని ఆ తర్వాత ముదునూరి సమాధానం ఇవ్వగా, పనులు ప్రారంభానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందంటూ నిర్మల నిలదీశారు. తాను అమరావతి వెళ్లి పరిశీలిస్తామని బుగ్గన చెప్పడంతో ఆమె శాంతించారు. గ్రామంలో చాలా మందికి ఇళ్లు లేవని, వారందరికీ సొంత గృహాలు నిర్మించాలని సర్పంచి కొల్లాటి కనకదుర్గ కేంద్ర మంత్రిని కోరారు. దీంతో మరోసారి సీరియస్ అయిన నిర్మల 'ఇప్పటి వరకు మీరంతా మూడు పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారు. వారిని ఇళ్ల విషయంలో ఎందుకు నిలదీయడం లేదు' అంటూ ప్రశ్నించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని పిలిపించి వచ్చే నెల 5వ తేదీలోపు అర్హులైన లబ్ధిదారుల జాబితా తనకు కావాలని ఆదేశించారు.

ప్రభుత్వ పెద్దలకే 'కానుక'

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'విద్యా కానుక' పథకం అవినీతిమయంగా మారిందనే వాదన వినిపిస్తోంది. ఈ పథకానికి సంబంధించి నామినేషన్ పద్ధతిపై కాంట్రాక్టును కట్టబెడుతుండడం వెనుక ప్రభుత్వ పెద్దల పాత్ర స్పష్టమైంది. సర్కారు ఆదేశాల మేరకే టెండర్లు నిర్వహించకూడదని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినట్లు తెలిసింది.

- ఒక్క కారణం చూపకుండా నేరుగా కాంట్రాక్టు
- టెండర్లు ఎందుకు పిలవలేదనేది 'రహస్యం'
- ఎవరొచ్చినా కాంట్రాక్టు ఇచ్చేలా విధానం
- 4 నెలలు జాప్యంచేసి ఇప్పుడు నామినేషన్
- పాత బకాయిలు చెల్లించలేకే ఇలా చేస్తున్నారా?
- ఇప్పుడు పిలిచిన వారూ బకాయి సొమ్ముకు పట్టు
- అక్రమాలకు కేంద్రంగా విద్యా కానుక వ్యవహారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అమలు చేస్తున్న 'విద్యాకానుక' పథకం టెండర్ల వ్యవహారం అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందనే వాదన వినిపిస్తోంది. ఎలాంటి టెండర్లు లేకుండా రూ.వెయ్యి కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును నామినేషన్ ద్వారా అప్పగించడం వెనుక 'ఏదో' జరిగిందని తెలుస్తోంది. వాస్తవానికి ఈ పథకానికి సబంధించి ఏటా సెప్టెంబరులో టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తారు. అయితే.. గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించాల్సిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే జాప్యం చేసింది. అంతేకాదు.. టెండర్లు లేకుండానే కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి విద్యాకానుక కిట్లు కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. పోనీ, ఇలా చేయడానికి ఏదైనా కారణం చూపించిందా? అంటే అదీ లేదు. 'టెండర్లు ఎందుకు నిర్వహించడం లేదు?' అనే విషయంలో ఉత్తర్వుల్లో కూడా వివరణ ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాల వల్లే ఈ మేరకు ఏకపక్ష ఉత్తర్వులు జారీ అయినట్లు అర్థమవుతోంది. మొత్తం రూ.1042 కోట్ల కాంట్రాక్టులో రూ.253 కోట్ల విలువైన పాఠ్యపుస్తకాలు, సుమారు రూ.60 కోట్లు కుట్టుకూలీ నగదు మినహాయించి రూ.720 కోట్ల విలువైన కానుకలు కొనేందుకు నేరుగా కాంట్రాక్టర్లకు అప్పగించాలని నిర్ణయించింది. ఎన్నికలకు ముందు ఇంత పెద్ద కాంట్రాక్టు అప్పనంగా కట్టబెట్టడం వెనుక ఎవరున్నారనేది అనుమానాస్పదంగా మారింది. భారీ కాంట్రాక్టును నచ్చిన వారికి ఇవ్వడం ద్వారా పెద్దఎత్తున కమీషన్లు పొందే ఉద్దేశం ఉందని తెలుస్తోంది. ఎన్నికల్లో ఖర్చులకు ఈ కమీషన్లు ఉపయోగపడతాయని ప్రభుత్వ పెద్దలు యోచిస్తున్నట్లు సమాచారం.

నేరుగా కట్టబెట్టడం వెనుక?

విద్యా కానుక అనేది ఈ ప్రభుత్వంలో కొందరికి సొంత కానుకలా మారింది. ఏటా వందల కోట్లతో విద్యాకానుక వస్తువులను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. పైకి పారదర్శకత అని చెబుతున్నా అంతర్గతంగా అది కనిపించడం లేదు. విద్యార్థులకు ఏటా చిరిగిన బ్యాగులు, బూట్లు ఇవ్వడం ఆనవాయితీగా మారింది. భారీ ఎత్తున ఖర్చుచేస్తున్నప్పుడు నాణ్యతను ఎందుకు పట్టించుకోవడం లేదనేది సందేహం. కాంట్రాక్టును నచ్చినోళ్లకు ఇచ్చి, కావాల్సిన విధంగా కమీషన్లు రాబట్టుకోవడమే అసలు ఉద్దేశం అన్నట్టుగా నాలుగేళ్ల పాటు వ్యవహారం సాగిందనే విమర్శలు ఉన్నాయి. టెండర్ల ప్రక్రియపై ప్రభుత్వం కొత్తగా న్యాయ సమీక్ష విధానం తెచ్చినా, విద్యా కానుక టెండర్లను సమీక్షకు పంపలేదు. ఇప్పుడిక ఏకంగా అసలు టెండర్ల అవసరమే లేకుండా అడ్డగోలు నిర్ణయం తీసుకుంది.

బిల్లులు చెల్లించకే!

ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొనుగోలు చేసిన 39.9 లక్షల కిట్లకు(పాఠ్యపుస్తకాలు మినహాయించి) గతేడాది రూ.720 కోట్లు చెల్లించాలి. దీనిలో ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.120 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చింది. ఇంకా రూ.600 కోట్లు బకాయి పడింది. దీంతో కాంట్రాక్టులెవరూ ముందుకు రావడం లేదని, అందుకే నామినేషన్‌పై కాంట్రాక్టు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే.. బకాయిల్లో 50శాతం ఇప్పుడు చెల్లించాలని కాంట్రాక్టర్లు కండిషన్ పెట్టినట్లు సమాచారం. అలా అయితేనే ఇప్పుడు కాంట్రాక్టు తీసుకుంటామని కాంట్రాక్టర్లు తేల్చేసినట్లు సమాచారం. అయితే దీనిపైనా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు విద్యారంగంపై రూ.70 వేల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం రూ.600 కోట్లు బకాయి విషయాన్ని గోప్యంగా ఉంచింది. కావాలనే బిల్లులు ఇవ్వకుండా జాప్యంచేసి, ఆ తర్వాత నచ్చినవారికి ఇచ్చుకునేలా ప్రభుత్వం ప్లాన్ చేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరొచ్చినా ఓకే!

ఏ ప్రభుత్వంలోనైనా కాంట్రాక్టులు అప్పగించే ముందు టెండర్లు తప్పనిసరి. అందులోనూ భారీ కాంట్రాక్టుల విషయంలో ప్రభుత్వాలు రిస్క్ చేయవు. ఎందుకంటే నామినేషన్ పద్ధతిలో అంటే ఫలానా వారికి ఎందుకిచ్చారనే దానిని సమర్థించుకునే వీలుండదు. కానీ, ఇప్పుడు పాఠశాల విద్యాశాఖ దేశంలో ఎవరొచ్చినా కాంట్రాక్టు ఇచ్చేస్తామని చెబుతోంది. రూ.వందల కోట్ల కాంట్రాక్టు అన్నప్పుడు ఏదో ఒక రోజు బిల్లులు ఇస్తారులే అన్న నమ్మకంతో కాంట్రాక్టర్లు ముందుకొస్తారు. మరి ఇప్పుడు టెండర్లు లేకుండా నామినేషన్ ప్రాతిపదికన ఫలానా కాంట్రాక్టరుకే ఎందుకిచ్చారు? అంటే ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? కమీషన్ ఎక్కువ ఇచ్చేవారికి కాంట్రాక్టు అప్పగిస్తారా? లేదా ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం ఉన్న కంపెనీలకు కట్టబెడతారా? అనేది తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకే

ప్రభుత్వ ఆదేశాల మేరకే కాంట్రాక్టర్లతో చర్చలు ప్రారంభించినట్లు సమగ్రశిక్ష అదనపు ఎస్పీడీ కేవీ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. విద్యా కానుకపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. జాప్యం లేకుండా కిట్లు అందించాలనే ఉద్దేశంతో సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వం నేరుగా కాంట్రాక్టు ఇవ్వాలనే నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం వల్ల పాత ధరలకే కిట్లు లభిస్తాయని, దానివల్ల నిధులు ఆదా అవుతాయని సమర్థించుకున్నారు. ద్రవ్యోల్బణం వల్ల ఏటా 5శాతం ధరలు పెరుగుతాయని, కానీ, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఒక్క రూపాయి అదనపు భారం పడదని పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఎవరికీ వర్క్ ఆర్డర్ ఇవ్వలేదని, దేశంలో ఎవరు ముందుకొచ్చినా అర్హతలను పరిశీలించి కాంట్రాక్టు ఇస్తామన్నారు. 'క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ద్వారా వివిధ స్థాయిల్లో పరిశీలించిన తర్వాతే కిట్లు విద్యార్థులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.


మంటల్లో కాలిన ఆటో


మృతులు వెంకటేశ్వర్లు, వెంకటనాయుడు (ఫైల్)

వెంటాడిన మృత్యువు!

- కారు, ఆటో ఢీ....ముగ్గురు దుర్మరణం
- ఇద్దరు సజీవ దహనం..మరొకరు గాయాలతో
- బస్సులో నిద్రపోయి, గమ్యస్థానం దాటి.. ఆటోలో వెనుకకు వస్తుండగా ప్రమాదం
- ప్రకాశం జిల్లాలో ఘటన
- ప్రమాదంలో మిర్చి విక్రయించిన రూ.6లక్షలు బూడిద


నుజ్జునుజ్జయి కొత్తకారు

బేస్తవారపేట, ఫిబ్రవరి 20: మృత్యువు వెంటాడడం అంటే ఇదేనేమో...బస్సులో ప్రయాణిస్తున్న వారు నిద్రపోయి, దిగాల్సిన చోట కాకుండా మరో చోట దిగి, వెనుకకు ఆటోలో వస్తుండగా, ఆ ఆటోను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై ప్రకాశం జిల్లా బేస్తవారపేట మండలం పూసలపాడు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఆటో, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. వారిలో ఇద్దరు సజీవ దహనమయ్యారు. బేస్తవారపేట మండలం బార్లకుంట గ్రామానికి చెందిన బిర్ల వెంకటనాయుడు(25), చిత్తూరు రాములు(45), చిత్తూరు వెంకటేశ్వర్లు(60) మిర్చిని గుంటూరు యార్డ్‌కు తీసుకెళ్లి, అక్కడ విక్రయించి సోమవారం సాయంత్రం కంభం వచ్చేందుకు బస్సులో బయలుదేరారు. అయితే వారు నిద్రపోవడంతో బస్సు బేస్తవారపేట దాటి కొమరోలుకు వెళ్లింది. అక్కడ దిగి, తిరిగి బేస్తవారపేటకు వచ్చేందుకు ఆటో ఎక్కారు. మార్గమధ్యలో పూసలపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి ఆటో దగ్ధమైంది. బిర్ల వెంకటనాయుడు, చిత్తూరు రాములు గుర్తుపట్టనంతగా కాలిపోయారు. చిత్తూరు వెంకటేశ్వర్లు రోడ్డుపై పడటంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. ఆటో డ్రైవర్ కాశింసా తలకు గాయాలు కాగా, కాలు విరిగింది. అతనిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిత్తూరు రాములు, వెంకటేశ్వర్లు అన్నదమ్ములు. వెంకటేశ్వర్లుకు మిర్చి పండింది. అతనికి చదువు రాకపోవడంతో డబ్బులు లెక్క చూసేందుకు తోడుగా తమ్ముడిని తీసుకెళ్లారు. మూడో వ్యక్తి బిర్ల వెంకటనాయుడు సీఎస్‌పురం సచివాలయంలో సోషల్ వేల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తన తండ్రి పండించిన మిర్చిని అమ్మేందుకు వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. మిర్చి అమ్ముకొని తెచ్చుకున్న నగదు సుమారు రూ.6లక్షలు కాలి బూడిదైంది.

కొత్త కారు కొని తెస్తూ..

గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన గురవయ్య తన తండ్రి ఓబయ్యతో కలసి సోమవారం గుంటూరు వెళ్లారు. షోరూంలో కొత్త కారు కొని గిద్దలూరులో ట్రావెల్స్ నడిపేందుకు వస్తున్నారు. ఇంటికి కారు రాకముందే జరిగిన రోడ్డుప్రమాదంలో అది నుజ్జునుజ్జయింది. బెలూన్లు తెరుచుకోవడంతో తండ్రీకొడుకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

1200 రోజులు ఏం చేశారు?

- 'మార్గదర్శి'పై ఏపీ సర్కారుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్న
- విచారణ ఏప్రిల్ 9కి వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి చిట్ ఫండ్ కేసుపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీ(హెచ్‌యూఎఫ్) పేరుతో డిపాజిట్లు సేకరించడం చట్ట విరుద్ధమని 2007లో అప్పటి ప్రభుత్వం మార్గదర్శిపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో 2018లో హైకోర్టు మార్గదర్శికి క్లీన్ చిట్ ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ 2019లో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ధర్మాసనంలోని న్యాయమూర్తులు మాట్లాడుతూ.. 1200 రోజుల వరకు ఏం చేశారని ప్రశ్నించారు. ఇంత ఆలస్యం వెనుక కారణాలేంటన్నారు. మార్గదర్శి తరఫున అభిషేక్ మను సింఘ్వీ, హరీశ్ సాల్వే, సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి రూ.2 వేల కోట్లు చందాదారుల దగ్గరి నుంచి వసూలు చేసిందని ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది నిరంజన్ రెడ్డి ధర్మాసనానికి తెలిపారు. అయితే, కేసుకు సంబంధించి మార్గదర్శి చందాదారులకు డబ్బులు తిరిగి చెల్లించేశామని ఆ సంస్థ తరఫున సింఘ్వీ అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం 1200 రోజులు ఆలస్యంగా ఎందుకు వచ్చారని నిరంజన్ రెడ్డిని ప్రశ్నించింది. కాగా, హెచ్‌యూఎఫ్ పేరుతో డిపాజిట్లు సేకరించడం చట్ట విరుద్ధమని ఆర్బీఐ తరఫు న్యాయవాది రమేశ్ బాబు తెలిపారు. గతంలో ఈ కేసులో తమను భాగస్వాములను చేయలేదన్నారు. ఇదిలావుంటే, ఈ అంశంపై సమ గ్ర నివేదిక సమర్పించాలని ఆర్బీఐని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సుదీర్ఘ వాదనలు జరగాల్సి ఉందని తెలిపిన ధర్మాసనం, విచారణను ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసిందన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు జీతాలు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు 23 శాతం పెంచుతూ సమగ్రశిక్ష తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. 2019 నుంచి ఒక్కసారి కూడా జీతం పెరగని వారికి ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. సెక్షన్ ఆఫీసర్లు, సిస్టమ్ ఎనలిస్టులు, సైట్ ఇంజనీర్లు (బీటెక్), సైట్ ఇంజనీర్లు (డిప్లొమా), మెసెంజర్స్, ఐఈఆర్‌టీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు, డ్రైవర్లకు జీతం పెంచుతున్నట్లు వివరించింది. ఉదాహరణకు సెక్షన్ ఆఫీసర్ జీతం ప్రస్తుతం రూ.28,940 ఉందని, తాజా పెంపుతో అది రూ.35,596 అవుతుందని తెలిపింది. అతి తక్కువ జీతాలున్న డ్రైవర్లకు కూడా ఇకపై రూ.24,600 వస్తుందని పేర్కొంది. సమగ్రశిక్ష ఉద్యోగులు తమకు జీతాలు పెంచాలంటూ దాదాపు నెల రోజుల పాటు సమ్మె చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా జీతాలు పెంచని వారికి 23 శాతం పెంచుతామని అప్పట్లో విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారు.

నేడు కేఏ పాల్ పిల్ విచారణ

- వాదించేందుకు న్యాయవాదిని నియమించుకోవాలని హైకోర్టుసూచన

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తాను దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై అత్యవసరంగా విచారణ జరపాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టును అభ్యర్థించారు. రాజకీయ కారణాలతో ఆ పిల్ విచారణకు రాకుండా చేశారని మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రాబోతోందని తెలిపారు. పాల్ అభ్యర్థనపై స్పందించిన ధర్మాసనం బుధవారం విచారణ జరుపుతామని తెలిపింది. అయితే, మధ్యాహ్నం భోజన విరామ సమయానికి ముందు కేఏ పాల్ మరోసారి సీజే నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చారు. తన వ్యాజ్యంలో తానే స్వయంగా వాదనలు వినిపించేందుకు రిజిస్ట్రీ అనుమతించడంలేదన్నారు. గతంలో తాను తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టులో వాదనలు వినిపించానని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసులో వాదనలు వినిపించేందుకు న్యాయవాదిని నియమించుకోవాలని సూచించింది.

ఆళ్ల పీచేముడ్


సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన ఆళ్ల రామకృష్ణారెడ్డి. చిత్రంలో మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

- వైసీపీని వీడినంత వేగంగానే వెనక్కి..

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)/మంగళగిరి : మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వైసీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినంత వేగంగానే తిరిగి వైసీపీ గూటికి చేరారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి సీఎం జగన్‌ను కలిసి, ఆయన సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆళ్లను జగన్ హత్తుకుని ప్రేమగా భుజం చరిచారు. అనంతరం ఆళ్ల విలేకరులతో మాట్లాడారు. జగన్ మరో 30 ఏళ్లు సీఎంగా ఉండేలా జనం దీవిస్తే, రాష్ట్రంలో పేదల బతుకులు మారిపోతాయని కితాబిచ్చారు. అయితే.. పార్టీని వీడినప్పుడు .. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి జగన్ సర్కారు నిధులు ఇవ్వలేదని, సొంతంగా రోడ్లను వేయించి ఆర్థికంగా చితికిపోయానని ఆళ్ల విమర్శించిన విషయం తెలిసిందే. అమరావతి రాజధానిని సమర్థించకుండా తప్పుచేశానని కూడా ఆనాడు అన్నారు. మంగళగిరిలోని తన కార్యాలయంలో జగన్ ఫొటోలను తీసేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. షర్మిల వెంటే నడుస్తానని ప్రకటించారు. కానీ రెండు నెలల్లోపే షర్మిలకు, కాంగ్రెస్ పార్టీకి హ్యాండిచ్చారు. మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా గంజి చిరంజీవి నియామకంతో కోపోద్రిక్తుడై ఆళ్ల గత డిసెంబరు 11న వైసీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తన నియోజకవర్గం అభివృద్ధికి ఇస్తానన్న రూ.1200 కోట్లను ఇవ్వకుండా ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారని అప్పట్లో ఆళ్ల ఆరోపించారు. తన ఒత్తిడి తట్టుకోలేక రూ.120 కోట్ల మేర పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, వాటిని పూర్తి చేశామన్నారు. అయితే సదరు పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ చెప్పుకొచ్చారు. ఇవే తన రాజీనామాకు కారణం అన్నట్టు మాట్లాడారు. అయితే, స్పీకరు ఈ రోజు వరకూ ఆయన రాజీనామాపై నిర్ణయం తీసుకోలేదు. ఇంతలోనే ఆళ్ల యూటర్న్ తీసుకున్నారు. పునరాగమనం వెనుక విజయసాయిరెడ్డి వ్యూహం ఉన్నట్టు పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

అంచనాలు తలకిందులు..

మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ తరఫున పోటీలో ఉన్న నారా లోకేశ్‌ను ఎలాగైనా ఓడించాలని ముఖ్యమంత్రి జగన్ చాలా పట్టుదలతో ఉన్నారు. నియోజకవర్గంలో అత్యధికశాతం ఓటర్లు చేనేతవర్గం నుంచి ఉన్నారు. దీంతో బీసీ వర్గానికి చెందిన పద్మశాలీ నేత గంజి చిరంజీవి వైపు జగన్ మొగ్గు చూపారు. సిటింగు ఎమ్మెల్యే ఆళ్లని కాదని చిరంజీవిని ఇన్‌చార్జిగా నియమించారు. చిరంజీవి నియామకంతో చేనేతవర్గం నుంచి పార్టీకి బ్రహ్మాండమైన జోష్ వస్తుందన్న అధిష్ఠానం అంచనాలు కూడా తలకిందులయ్యాయి. గుంటూరు రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి సూచనతో చిరంజీవి స్థానంలో కాండ్రు కమలను ఇన్‌చార్జిగా వైసీపీ అధిష్ఠానం నియమించింది. అలాగే, ఆళ్ల సోదరుడు అయోధ్యరామిరెడ్డి సహకారంతో ఆళ్ల రామకృష్ణారెడ్డితో మంతనాలు సాగించి, తిరిగి పార్టీలోకి రప్పించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును
PUB/0177
ప్రొఫార్మా 10-01
బహిరంగ ప్రకటన
దక్షిణ మధ్య రైల్వేలోని గుర్తించబడినట్టి సెక్షన్‌లోని పూర్తి సెక్షన్‌లోని ఆవరణలు మరియు రైల్వే లైన్లు ఉపయోగించేవారందరికీ ఇందుమూలంగా తెలియజేయడమేది ఏమనగా, [illegible]
సెక్షన్ : విజయవాడ డివిజన్- దిగువ తెలిపిన విధంగా 25 KV AC సింగిల్ ఫేజ్ 50 Hz సరఫరాతో OHE విద్యుదీకరణ:
a) విజయవాడ, డీజిల్ లోకోషెడ్ వద్ద MEMUs నిర్వహణ కొరకు- విజయవాడ (TKM-1.334), డీజిల్ లోకోషెడ్ వద్ద DEMU పిట్ లైన్ నెం.2 మరియు ఓల్డ్ డీజిల్ షెడ్ పిట్ లైన్లు 1&2.
మరియు
b) విజయవాడ, డీజిల్ లోకోషెడ్ ఏరియా వద్ద కోచింగ్ మెయింటెనెన్స్ లైన్లు (TKM-1.665) యొక్క LV-7, 8, 9 పిట్ లైన్లు.
విద్యుదీకరణ తేది: 26.02.2024
A0206 సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/TRD/విజయవాడ



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కుట్రను వమ్ముచేసిన కోర్టు

చండీగఢ్ మేయర్ ఎన్నిక వ్యవహారంలో సుప్రీంకోర్టు చొరవ ప్రశంసనీయమైనది. ఆర్టికల్ 142 ద్వారా తనకు దఖలుపడిన విశేషాధికారాలను సైతం వినియోగించి ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థిని న్యాయస్థానం విజేతగా నిర్ణయించింది. బ్యాలెట్ పత్రాలను భ్రష్టుపట్టించి, ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన రిటర్నింగ్ అధికారిని శిక్షార్హుడుగా ప్రకటించింది. మునిసిపల్ ఎన్నికల స్థాయిలో కూడా అధికారం కోసం కక్కుర్తిపడిన బీజేపీకి సుప్రీంకోర్టు నిర్ణయం పెద్ద ఎదురుదెబ్బ. మంగళవారం తీర్పు ఓ తీవ్రమైన నేరాభియోగం.

జనవరి 30న పోలింగ్ పెద్దగా వ్యవహరించిన బీజేపీ మైనారిటీ విభాగానికి చెందిన నామినేటెడ్ కౌన్సిలర్ అనిల్ మాసి సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కెమెరా కెమెరా అంటూ కౌన్సిలర్లు అరుస్తున్నందునే తాను కెమెరావైపు చూశానని, ఆప్ కౌన్సిలర్లు బ్యాలెట్ పత్రాలు లాక్కొనే ప్రయత్నం చేస్తున్నందున, చెల్లని ఎనిమిది బ్యాలెట్ పేపర్లను వేరుగా గుర్తించడానికే తాను వాటిమీద కొట్టివేత గుర్తువేశానని చెప్పుకొచ్చాడు. అయితే, చెల్లని ఓట్లమీదే తాను రాతకోతలు చేశానన్న అతడి వాదన శుద్ధ అబద్ధమని, ఇతడు పెన్నుపెట్టడానికి ముందు అవి సక్రమంగానే ఉన్నాయని కోర్టు నిర్ధారణకు వచ్చింది. ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించడం, అంతా నిజమే చెబుతానంటూనే అబద్ధాలు చెప్పిన కారణంగా అతడు శిక్షార్హుడని కోర్టు నిర్ధారించింది. దీనితో అనిల్ మాసి ఆధ్వర్యంలో వెల్లడయిన ఫలితాలు రద్దవడంతో పాటు, కోర్టు పర్యవేక్షణలో అతడిమీద దర్యాప్తు కూడా మొదలైంది. స్వతంత్రభారత చరిత్రలో ఒక ఎన్నికల అధికారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి క్రాస్ ఎగ్జామినేషన్ చేయడం ఇదే ప్రథమం.

అనిల్ మాసి తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ మళ్ళీ కొత్తగా ఎన్నికలు జరపాలంటూ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించడం మరో చక్కని నిర్ణయం. తిరిగి పోలింగ్ జరిగినా తమ అభ్యర్థే మేయర్ అయ్యేట్టుగా ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలను ఇప్పటికే బీజేపీ తనవైపు తిప్పుకొని ఉన్నందున, సుప్రీంకోర్టు రీ పోలింగ్‌కు అంగీకరించివుంటే మేయర్ స్థానం మళ్ళీ బీజేపీకే వచ్చివుండేది. అంటే, ఒక అక్రమాన్ని అడ్డుకొని, మరో అక్రమానికి కోర్టే అవకాశం ఇచ్చినట్టు అయ్యేది. తప్పు జరిగింది కౌంటింగ్‌లో కనుక, మొత్తం ఎన్నికల ప్రక్రియను తిరగదోడాల్సిన పనిలేదంటూ సుప్రీంకోర్టు ఆ కుట్రను నిర్వీర్యం చేసింది. మొత్తం ప్రక్రియ చివరి అంకంలో ఒక వ్యక్తి చేసిన కుట్రను సరిదిద్దడానికి తాను నేరుగా జోక్యం చేసుకోవలసి వస్తున్నందంటూ ఆప్ అభ్యర్థి కుమార్‌ను తానే స్వయంగా విజేతను ప్రకటించింది.

ఇండియా కూటమి తన తొలి ఎన్నికల పోరాటంలోనే చిత్తుగా ఓడిపోయింది అంటూ బీజేపీ అధ్యక్షుడు జనవరి 30న చేసిన ట్వీట్ ఇప్పుడు తారుమారైంది. ఆప్–కాంగ్రెస్ కలసికట్టుగా విజయం సాధించాయి. కేసు విచారణ ఆరంభమైనప్పుడే సుప్రీంకోర్టు అనిల్ మాసిని తీవ్రంగా దుయ్యబట్టడం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ కానివ్వనని వ్యాఖ్యానించడంతో ఆ ఫలితాన్ని కోర్టు రద్దుచేయవచ్చునని బీజేపీ ఊహించి ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేసుకుంది. బీజేపీ అభ్యర్థి శంకర్‌తో వెంటనే రాజీనామా చేయించి, ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలను చేర్చుకొని, సొలిసిటర్ జనరల్ ద్వారా రీపోలింగ్ కోసం కోర్టును అభ్యర్థించింది. తన మనిషి తప్పుచేస్తూ సుప్రీంకోర్టుకు దొరికిపోయిన తరువాత కూడా ఆ పార్టీ ఉన్నతంగా వ్యవహరించకుండా, అధికారంకోసం వెంపర్లాడటం వల్ల మరోమారు ఘోరమైన అవమానం ఎదుర్కోవాల్సివచ్చింది. చట్టాలు, శాసనాలు సులభంగా తేల్చలేని సందర్భాల్లో, ఒక వివాదాన్ని పరిష్కరించేందుకు ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు విశేషమైన అధికారాలను ఇస్తున్నది. నిర్దిష్ట పరిధిలేని ఈ అధికారాలతో పరిపూర్ణమైన న్యాయం చేకూర్చే పేరిట కోర్టు ఏకపక్షంగా వ్యవహరించగలదన్న విమర్శలు ఉన్నప్పటికీ సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటివరకూ దీనిని పరిమితంగానే వాడుతూవస్తోంది. నిజానికి ఇంతకంటే కీలకమైన కేసుల్లో కూడా దీని వినియోగాన్ని కోర్టు గతంలో తిరస్కరించింది. ఇప్పుడు కెమెరా కళ్ళకు చిక్కిన నేరాన్ని ఛేదించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించిన సర్వోన్నత న్యాయస్థానం కనిపించని కుట్రలను భగ్నం చేసేందుకు కూడా 142 వాడితే బాగుండునని అనేకుల ఆశ.



జైనమతం, భగవాన్ మహావీర్ జీవితం నుంచి ప్రపంచం ప్రేరణ పొందడానికి సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ వంటి మహానుభావులే కారణం. జైన సామాజిక వర్గంలో ఆయన ఉన్నత స్థానంలో నిలిచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాలేదు. మతాలు, ప్రాంతాలు, సంస్కృతులకు అతీతంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చారు. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారు.


విజ్ఞానజ్యోతి ఆచార్య విద్యాసాగర్ జీ

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ ఆదివారం సమాధిని పొంది మనందరినీ విషాదంలో ముంచెత్తారు. లోతైన జ్ఞానం, ఎల్లలెరుగని దయ, మానవాళిని ఉద్ధరించాలన్న అచంచలమైన నిబద్ధతతో ఆయన జీవితం ఆధ్యాత్మికంగా సుసంపన్నమయింది. అనేక సందర్భాల్లో ఆయన ఆశీస్సులు అందుకున్న గౌరవం నాకు దక్కింది. అందువలన, నాతో సహా లెక్కలేనన్ని ఆత్మలకు మార్గాన్ని ప్రకాశవంతం చేసిన మార్గదర్శక కాంతిని కోల్పోయినట్లుగా నేను తీవ్రమైన లోటును అనుభవిస్తున్నాను. ఆయన అనురాగం, ఆప్యాయత, ఆశీస్సులు కేవలం సుహృద్భావ సంకేతాలు మాత్రమే కాదు, ఆధ్యాత్మిక శక్తిని ప్రసరింపజేసి, ఆయనతో సన్నిహితంగా మెలిగిన అదృష్టవంతులందరినీ శక్తిమంతం చేసి, స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.

జ్ఞానం, కరుణ, సేవ కలిగిన త్రివేణిగా పూజ్య ఆచార్య జీ ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన నిజమైన తపస్వి, ఆయన జీవితం భగవాన్ మహావీర్ ఆదర్శాలకు ప్రతీక. ఆయన జీవితం జైన మతం మూల సూత్రాలకు ఉదాహరణగా నిలిచింది, దాని ఆదర్శాలను తన సొంత ఆచరణలు బోధనల ద్వారా ప్రతిబింబింప చేశారు. సకల జీవరాశులపట్ల ఆయనకున్న శ్రద్ధ జైన మతానికి జీవితం పట్ల ఉన్న అమితమైన గౌరవానికి అద్దం పట్టింది. ఆలోచనలో, మాటలో, చేతల్లో నిజాయితీకి జైన మతం ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తూ ఆయన నిజాయతీతో కూడిన జీవితాన్ని గడిపారు. ఆయన చాలా సరళమైన జీవనశైలిని కూడా అనుసరించారు. జైనమతం, భగవాన్ మహావీర్ జీవితం నుంచి ప్రపంచం ప్రేరణ పొందడానికి ఆయన వంటి మహానుభావులే కారణం. జైన సామాజిక వర్గంలో ఆయన ఉన్నత స్థానంలో నిలిచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాలేదు. మతాలు, ప్రాంతాలు, సంస్కృతులకు అతీతంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చారు. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారు.

విద్య ఆయన హృదయానికి చాలా దగ్గరైన రంగం. విద్యాధర్ (ఆయన చిన్ననాటి పేరు) నుండి విద్యాసాగర్ వరకు ఆయన ప్రయాణం విజ్ఞానాన్ని సంపాదించడం, అందించడంలో లోతైన నిబద్ధతతో కూడుకున్నది. న్యాయమైన, విజ్ఞానవంతమైన సమాజానికి విద్య మూలస్తంభమని ఆయన ప్రగాఢ విశ్వాసం. వ్యక్తులను శక్తివంతం చేయడానికి, లక్ష్యం, సహకారంతో కూడిన జీవితాలను గడపడానికి వీలు కల్పించే సాధనంగా జ్ఞానం లక్ష్యాన్ని అతను సమర్థించాడు.

న్యాయమైన, జ్ఞాన సంపన్నమైన సమాజానికి విద్య మూలస్తంభమని అతని దృఢ విశ్వాసం. వ్యక్తులకు సాధికారత కల్పించి ఒక ప్రయోజనం, సేవాభావంతో జీవితం గడిపేందుకు దోహదపడే సాధనంగా విద్యను ఆయన భావించారు. స్వీయ–అధ్యయనం, స్వీయ–అవగాహన ప్రాముఖ్యతను నిజమైన విజ్ఞానానికి మార్గాలుగా ఆయన బోధనలు నొక్కిచెప్పాయి. జీవితకాల అభ్యాసం, ఆధ్యాత్మిక ఎదుగుదలలో నిమగ్నం కావాలని వారి అనుచరులను ప్రబోధించాయి.



అదే సమయంలో, మన సాంస్కృతిక విలువలతో ముడిపడి ఉన్న విద్యను మన యువత పొందాలని సంత్ శిరోమణి ఆచార్య విద్యాసాగర్ జీ మహరాజ్ జీ ఆకాంక్షించారు. నీటి ఎద్దడి వంటి కీలక సవాళ్లకు పరిష్కారం కనుగొనలేక పోయామని, గతం నుంచి నేర్చుకున్న పాఠాలకు దూరంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన తరచూ చెప్పేవారు. సంపూర్ణ విద్య అనేది నైపుణ్యం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించేదని ఆయన విశ్వసించారు. భారతదేశ భాషా వైవిధ్యం పట్ల ఆయన ఎంతో గర్వపడ్డారు. భారతీయ భాషలను నేర్చుకోవడానికి యువతను ప్రోత్సహించారు.

పూజ్య ఆచార్య జీ స్వయంగా సంస్కృతం, ప్రాకృతం, హిందీలో విస్తృతంగా రచనలు చేశారు. ఒక సాధువుగా ఆయన చేరుకున్న శిఖరాలు, భూమిపై ఆయన ఎంత నిలదొక్కుకున్నారో ఆయన ప్రతిష్ఠాత్మక రచన 'మూక్మతి'లో స్పష్టంగా కనిపిస్తుంది. తన రచనల ద్వారా అణగారిన వర్గాలకు గళం అందించారు.

ఆరోగ్య సంరక్షణ రంగంలో కూడా పూజ్య ఆచార్య జీ చేసిన కృషి చిరస్మరణీయం. ముఖ్యంగా నిరుపేదల నివాస ప్రాంతాల్లో ఆయన అనేక ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ఆయన విధానం సంపూర్ణమైనది, శారీరక శ్రేయస్సును ఆధ్యాత్మిక శ్రేయస్సుతో మిళితం చేస్తుంది, తద్వారా వ్యక్తి మొత్తం అవసరాలను తీర్చింది.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ విద్యాసాగర్ జీ మహరాజ్ జీ జాతి నిర్మాణం పట్ల చూపిన నిబద్ధత గురించి రాబోయే తరాలు విస్తృతంగా అధ్యయనం చేయాలని నేను ప్రత్యేకంగా కోరుతున్నాను. పక్షపాత ఆలోచనలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించాలని ప్రజలను ఆయన ఎల్లప్పుడూ కోరేవారు. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో భాగస్వామ్య వ్యక్తీకరణగా ఓటును భావించిన, బలంగా విశ్వసించిన వారిలో ఆయన ఒకరు. ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన రాజకీయాలను శ్రీ విద్యాసాగర్ జీ సమర్థించారు, విధాన రూపకల్పన ప్రజా సంక్షేమం గురించి ఉండాలి కానీ స్వప్రయోజనాల గురించి కాదు (లోక్‌నీతి లోక్ సంగ్రహ్ గురించి కాని లోభ్ సంగ్రహ్ గురించి) అని చెప్పారు.

తమ పట్ల, తమ కుటుంబాల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల బాధ్యతల విషయంలో తన పౌరుల నిబద్ధత పునాదులపై ఒక బలమైన దేశం నిర్మితమవుతుందని ఆయన విశ్వసించారు. నిజాయితీ, చిత్తశుద్ధి, స్వావలంబన వంటి సుగుణాలను పెంపొందించుకోవాలని ఆయన వ్యక్తులను ప్రోత్సహించారు, ఇది న్యాయమైన, దయగల, అభివృద్ధి చెందుతున్న సమాజ నిర్మాణానికి అవసరమని ఆయన భావించారు. మనం వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నందున విధుల పట్ల ఈ ప్రాధాన్యత చాలా ముఖ్యం.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ క్షీణత విపరీతంగా ఉన్న ఈ కాలంలో, పూజ్య ఆచార్య జీ ప్రకృతికి కలిగే హానిని తగ్గించే జీవన విధానాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి అత్యంత ముఖ్యమైన పాత్రను ఆయన చూశారు, వ్యవసాయాన్ని ఆధునికంగా, సుస్థిరంగా మార్చాలని కూడా ఆయన నొక్కి చెప్పారు. జైలు ఖైదీల సంస్కరణకు ఆయన చేసిన కృషి కూడా చెప్పుకోదగినది.

వేల సంవత్సరాలుగా మన నేల ఇతరులకు వెలుగులు చూపించి మన సమాజాన్ని బాగు చేసిన మహానుభావులను అందించింది. సాధువులు, సంఘ సంస్కర్తల ఈ మహోన్నత వంశంలో పూజ్య ఆచార్య జీ మహోన్నత వ్యక్తిగా నిలుస్తారు. ఆయన ఏం చేసినా వర్తమానం కోసమే కాకుండా భవిష్యత్తు కోసం కూడా చేసేవారు. గత ఏడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని డోంగర్‌గఢ్ లోని చంద్రగిరి జైన మందిరాన్ని సందర్శించే అవకాశం నాకు లభించింది. అప్పటి పూజ్య ఆచార్య జీ సందర్శన నా చివరి సమావేశం అవుతుందని నాకు తెలియదు. ఆ క్షణాలు చాలా ప్రత్యేకమైనవి. ఆయన నాతో చాలాసేపు మాట్లాడి, దేశానికి సేవ చేయడంలో నేను చేసిన కృషిని ఆశీర్వదించారు. మన దేశం తీసుకుంటున్న దిశ, ప్రపంచ వేదికపై భారత్‌కు లభిస్తున్న గౌరవం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తాను చేస్తున్న పని గురించి మాట్లాడేటప్పుడు ఉత్సాహం చూపించారు. అప్పుడు, ఎప్పుడూ, వారి సున్నితమైన చూపులు, నిర్మలమైన చిరునవ్వు శాంతి, సేవా భావనను కలిగించడానికి సరిపోతాయి. ఆయన ఆశీస్సులు మనసుకు ఓదార్పునిచ్చే ఔషధంలా, మనలోని, చుట్టుపక్కల ఉన్న దైవిక ఉనికిని గుర్తు చేస్తాయి.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ లేని లోటును ఆయన గురించి తెలిసినవారు, ఆయన బోధనలు, జీవితం స్పృశించినవారు శూన్యంగా భావిస్తారు. అయితే, ఆయన వల్ల స్ఫూర్తి పొందినవారి హృదయాల్లో ఆయన ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు. శ్రీ విద్యాసాగర్ జీ జ్ఞాపకాలను గౌరవించడంలో, వారు బోధించిన విలువలను ప్రతిబింబించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఈ విధంగా, మనం ఒక గొప్ప ఆత్మకు నివాళులు అర్పించడమే కాకుండా, మన దేశం, ప్రజల కోసం ఆయన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తాము.

• నరేంద్ర మోదీ

నైతిక నిష్ఠ లేని నరేంద్రుడు

ఏ నాయకుడైనా పార్టీని గెలిపించినంత కాలం ఆ పార్టీ కార్యకర్తలందరూ ఆయనను ఆకాశానికి ఎత్తుతూ ప్రశంసల వర్షం కురిపించడం సహజం. ఆ నాయకుడి పొరపాట్లను ప్రస్తావించడం, చేసిన పనులను విమర్శనాత్మకంగా సమీక్షించే సాహసం ఎవరికీ ఉండదు. వందిమాగధ సంస్కృతిని ప్రోత్సహించే విషయంలో భారతీయ జనతా పార్టీ అన్ని పార్టీలను మించిపోయింది. 'మీరు ప్రతిపక్షాలు చేసే విమర్శల జోలికి పోకండి.. మనమేమి చేశామో ప్రజలకు చెప్పండి చాలు.' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన భారతీయ జనతా పార్టీ జాతీయ సదస్సులో నేతలకు ఉద్బోధించారు. బీజేపీ జాతీయ సదస్సులో వక్తలందరూ మోదీని ఆకాశానికెత్తుతూ ప్రసంగాలు చేయడంలో పోటీ పడ్డారు. పేరుకు ప్రవేశపెట్టింది రాజకీయ, ఆర్థిక తీర్మానాలైనప్పటికీ అవి మోదీ అభినందన తీర్మానాలనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి పేరాలో కనీసం రెండుసార్లు మోదీ అన్న పేరు లేకుండా తీర్మానాలను లిఖించలేదు. 'ఈ ఎన్నికల్లో అభ్యర్థి ఎవరు పోటీ చేశారన్న దానితో ప్రమేయం లేదు. అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థి కమలమే.' అని మోదీ అన్నారు. కాని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థి మోదీయే అన్న విషయం పోటీ చేసే వారందరికీ తెలుసు. పార్టీ పేరుతో కాకుండా 'మోదీ గ్యారంటీ' పేరుతో ప్రధానమంత్రే స్వయంగా ప్రచారం చేసుకుంటున్నప్పుడు పార్టీ కన్నా నేతకే ఎక్కువ ప్రాధాన్యముంటుందన్న విషయం స్పష్టమే కదా!

రెండు రోజుల జాతీయ సదస్సులో బీజేపీ నేతలకు స్పష్టమైంది ఒక్కటే. ఒక వైపు రామభజన చేస్తూనే మరో వైపు మోదీ భజన చేస్తే సరిపోతుందని వారికి అర్థమైంది. ఈ రెండే ఎన్నికల్లో గెలిచేందుకు తారక మంత్రమని నేతలంతా వారికి దిశా నిర్దేశం చేశారు. బీజేపీ ఒక్కటే ఎన్నికల్లో 370 సీట్లు గెలవాలని కూడా ప్రధానితో సహా నేతలంతా భారీ లక్ష్యాన్ని విధించారు. కాని 370 సీట్లు సాధించడం అంత కష్టమని వారికి కూడా తెలియనిది కాదు. పుల్వామా, బాలాకోట్ ఘటనల తర్వాత కూడా బీజేపీకి 303 సీట్లు దాటలేదు. మధ్యప్రదేశ్, గుజరాత్, బిహార్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, హర్యానా, హిమాచల్, మహారాష్ట్ర, ఢిల్లీ, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్డీఏకు గతంలో అత్యధిక సీట్లు లభించాయి. ఈ సారి మళ్లీ అన్ని సీట్లు రావడంతో పాటు గతంలో ఓడిపోయిన స్థానాల్లోనూ బీజేపీ గెలవాలంటే దేశ వ్యాప్తంగా మోదీ ప్రభంజనం వీయాలి.

రామమందిరం, మోదీ ఆకర్షణ, వికసిత్ భారత్ వంటి పదాలతోనే ఈ ప్రభంజనం వీస్తుందన్న నమ్మకం బీజేపీ నేతలకే ఉంటే అందుకు సంబంధించిన ప్రచారంతోనే ఊదరగొట్టి మౌనంగా ఉండేవారు. ఒక వేళ మోదీ గాలి అంతగా వీసే అవకాశాలుంటే ఇండియా కూటమి పేరుతో దేశంలో ఇతర పార్టీలన్నీ ఏకం అయినా ఆయనను ఏమీ చేయలేకపోయేవారు. 'మీరంతా ఒకవైపు, నేనొక్కడినీ మరో వైపు' అని మోదీ గతంలో పార్లమెంట్‌లో ఛాతీ కూడా చరుచుకున్నారు. అటువంటప్పుడు ప్రతిపక్షాలను కూడా ఛిన్నాభిన్నం చేసేందుకు, దేశంలో ఉన్న ప్రతి బీజేపీయేతర పార్టీని బలహీనపరిచి సామదానభేద దండోపాయాలతో వారిని వశపరుచుకునేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారు? కేవలం తమ కంటే బాగా దేశాన్ని ఎవరూ అభివృద్ధి చేయలేరని, కాంగ్రెస్ పాలనలో దేశం భ్రష్టుపట్టిందనే ప్రచారాలతోనే ప్రజలను వశపరుచుకోలేమన్న అపనమ్మకం ఉండడమే అందుకు కారణమా?



> రామరాజ్యం అనేది ప్రధానంగా నైతిక విలువలకు సంబంధించిన దృక్కోణం. బీజేపీని బలోపేతం చేసే ప్రయత్నంలో ఆ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు. కార్పొరేట్ల నిధులు పొందేందుకే ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీ నైతికతన్ను ప్రశ్నించింది. చండీగఢ్ మేయర్ ఎన్నికలో రిటర్నింగ్ అధికారి అక్రమాలనూ సుప్రీంకోర్టే బయటపెట్టడం బీజేపీకి మరో విఘాతం. వ్యవస్థల్ని అవినీతి నుంచి ప్రక్షాళన చేస్తామన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన మోదీకి గెలవడమే ప్రధానం కాని ఎలా గెలిచామన్నది ముఖ్యం కాదేమో!

'ప్రతిపక్ష నేతలను భయపెట్టడం ద్వారా మీరు వారిని మీ పార్టీలోకి ఎందుకు లాగుతున్నారు. ఇది మంచిదేనా?' అని ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీని పార్లమెంట్‌లో ప్రశ్నించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. 'మేము ఎవర్నీ మా వైపు లాగడం లేదు, వారే వస్తానంటే మేమేం చేయగలం? మా ప్రభుత్వ పాలన చూసి ఆకర్షితులై మా పార్టీలోకి వస్తున్నారు' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జవాబు చెప్పారు. ఇందులో ఎంత నిజం ఉన్నదో చేరిన వారికి, చేర్చుకున్న వారికే తెలియాలి.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గత ఏడాది జూలైలోనే ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఓబీసీ నేతల్ని బీజేపీలో చేర్చుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా వారణాసిలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి పోటీ చేసిన శాలినీ యాదవ్ కూడా వీరిలో ఉన్నారు. సమాజ్‌వాది, బహుజన సమాజ్, ఆరఎల్‌డి పార్టీల నుంచి వలసలను ప్రోత్సహించడం బీజేపీ నిరంతరం చేస్తూనే ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 సీట్లను సాధించి సమాజ్‌వాది పార్టీ భవిష్యత్తును చెరిపేసేందుకు బీజేపీ కృతనిశ్చయంతో ఉన్నది. అంతేకాదు, దాదాపు అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను వశపరుచుకోవడమో, దెబ్బతీయడమో లక్ష్యంగా బీజేపీ ఎన్నో చర్యలు తీసుకుంది. బిహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు), కర్ణాటకలో జెడి(ఎస్), మహారాష్ట్రలో శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్‌సిపి (అజిత్ పవార్) బీజేపీ ఛత్రఛాయలోకి క్రమంగా వచ్చాయి. అకాలీదళ్, ఆరఎల్‌డి ఆ మార్గంలో ఉన్నాయి. మరికొన్ని పార్టీలకు కూడా ఈ మార్గాన్ని అవలంబించక తప్పని పరిస్థితి బీజేపీ కల్పించింది. ఇక ఇండియా కూటమిలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ, జెఎంఎం, తృణమూల్ కాంగ్రెస్‌లను భయ భ్రాంతులకు గురిచేసేందుకు రక రకాల శక్తులను ప్రయోగిస్తున్నారు.

ఏ విధంగానైనా 2024 ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించేందుకు వీలుగా సాధ్యమైనంత మందిని తమ పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రతిపక్షాల్లోంచి ఎవరు వచ్చినా చేర్చుకునేందుకు బీజేపీ ఏకంగా ఉపాధి మేళాలే ప్రారంభించింది. ఈ ఉపాధి మేళాల్లో పోస్టుల సంఖ్య అపరిమితం. ఇక అపె[illegible]సుకున్న వారి విషయంలో పెండింగ్‌లో ఉన్న ఆర్థిక నేరాలు, క్రిమినల్ కేసులు కూడా బుట్టదాఖలయే అవకాశాలున్నాయి. కేంద్ర సంస్థల దర్యాప్తులు నత్తనడకన సాగుతాయి. ఢిల్లీ పెద్దలు తలుచుకుంటే ఏ కేసులోనైనా ఉపశమనం లభిస్తుంది లేదా కొత్త కేసులు పుట్టుకొస్తాయి. కొందరికి చేరిన వెంటనే పదవులు లభిస్తాయి. జ్యోతిరాదిత్య సింధియాకు కేంద్ర మంత్రి పదవి లభిస్తే, ఒకప్పుడు రాహుల్ గాంధీ కుడిభుజమైన యుపి నేత ఆర్‌పిఎన్ సింగ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, కాంగ్రెస్‌ను వదిలి షిండే శివసేనలో చేరిన మిలింద్ దేవరకు రాజ్యసభ పదవులు వరించాయి. బీజేపీలో ఉన్న వారికంటే కాంగ్రెస్ నుంచో మరో ప్రధాన పార్టీ నుంచో వచ్చిన వారికి మోదీ హయాంలో విలువ ఎక్కువ అనడంలో సందేహం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆపరేషన్ కమల్ ఆకర్షణకు ఎంతమంది లోనవుతారో చెప్పలేం.

బీజేపీ రెండు రోజుల జాతీయ సదస్సులో రామమందిరంపై చేసిన తీర్మానం అత్యంత ముఖ్యమైనది. రామమందిర నిర్మాణానికి పూర్తి ఘనత మోదీకే దక్కిందని ప్రశంసల వర్షం కురిపించిన పార్టీ నేతలు ఆయనను గజమాలలతో సత్కరించారు. ఇక మోదీ హయాంలో రామరాజ్యం ఏర్పడుతుందని, అది వేయేళ్లు కొనసాగుతోందని ప్రత్యేకంగా తీర్మానించారు. అందరికీ భాగస్వామ్యం కల్పించే రామరాజ్యం కావాలని వారు అభిలషించారు. అంటే ఇతర పార్టీలనేతలందర్నీ నయానో భయానో చేర్చుకుని భాగస్వామ్యం కల్పించడమని ఈ తీర్మానం ఉద్దేశమా?

రామరాజ్యం అనేది ప్రధానంగా నైతిక విలువలకు సంబంధించిన దృక్కోణం. కాని బీజేపీని రాజకీయంగా బలోపేతం చేసే అత్యధిక సీట్లు సాధించడమే పరమావధిగా చేసే ప్రయత్నంలో భాగంగా ఈ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు చాలా కాలం నుంచి ఉన్నాయి. బెంగాల్‌లో సువేందు అధికారి నుంచి మహారాష్ట్రలో అశోక్ చవాన్ వరకు వందలాది నేతలు ఆర్థిక నేరాలకు పాల్పడినవారే. ముంబైలో కార్గిల్ యుద్ధ వీరుల కోసం నిర్మించిన ఆదర్శ్ హౌజింగ్ పథకంలోనే భారీ అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణలు అశోక్ చవాన్‌పై ఉన్నాయి. సైనికులు, వారి కుటుంబాలకే కాకుండా అనేక మంది ఇతరులకు, చివరకు తన కుటుంబ సభ్యులకు కూడా ఫ్లాట్లు కేటాయించుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అశోక్ చవాన్‌పై కేసు ఇంకా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. తాము అధికారంలోకి వస్తే అశోక్ చవాన్‌ను జైలుకు పంపిస్తామని నరేంద్రమోదీ పదేళ్ల క్రితమే ప్రకటించారు. కాని పదేళ్ల తర్వాత అదే అశోక్ చవాన్ బీజేపీలో చేరారు. అశోక్ చవాన్ మాత్రమే కాదు, ఎన్‌సిపిని చీల్చిన అజిత్ పవార్‌పై కూడా ఎన్నో కేసులు ఉన్నాయి. బీజేపీలో చేరితే ఎన్ని కేసులున్నా నిర్భయంగా ఉండవచ్చుననే ప్రచారం జరుగుతోంది. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45(ఏ)ను రద్దు చేస్తే సగం మంది బీజేపీ నేతలు ఆ పార్టీలో ఉండరని ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'నన్ను కూడా అవినీతి కేసులో ఇరికించారు కనుక బీజేపీలో చేరతానంటే చేర్చుకుంటారేమో?' అని తృణమూల్ నేత మహువా మొయిత్రా వ్యాఖ్యానించారు.

కార్పొరేట్లకు ప్రయోజనాలు కట్టబెట్టి, వారి నుంచి అక్రమ నిధులను పొందేందుకే ఎన్నికల బాండ్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పే బీజేపీ నైతికతను ప్రశ్నించింది. ఆ తర్వాత చండీగఢ్ మేయర్ ఎన్నిక సందర్భంగా రిటర్నింగ్ అధికారి చేసిన అక్రమాలను సుప్రీంకోర్టే బయటపెట్టడం బీజేపీకి మరో విఘాతం. వ్యవస్థల్ని అవినీతి నుంచి ప్రక్షాళన చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన మోదీకి గెలవడం ప్రధానం. ఎలా గెలిచామన్నది ముఖ్యం కాదేమో!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

అబుధాబిలో ఏడు గోపురాల కోవెల

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ గీతం 'ఈషీ బిలాదీ' (లాంగ్ లివ్ మై కంట్రీ). 'దేశ ధర్మం ఇస్లాం, ఖురాన్ మా మార్గదర్శి' అని ఆ గీతంలోని ద్వితీయచరణం ఉద్ఘాటిస్తుంది. తమ గడ్డపై నివాసముంటున్న హిందువుల ఆధ్యాత్మిక అవసరాన్ని (దైవారాధన మందిరం) యుఎఇ ఆలస్యంగానైనా గుర్తించి, నెరవేర్చింది. పర్షియన్ గల్ఫ్ తీరస్థ దేశాలలో యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ విలక్షణమైనది. అధికారిక మతం ఇస్లాం అయినప్పటికీ మతం అనేది దాదాపుగా వ్యక్తిగత వ్యవహారంగా భావించబడుతుంది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని ఇతర దేశాల తరహా ఇస్లామీకరణ యుఎఇ లో లేదు. ఇస్లామిక్ ధర్మంతో దేశ పాలనను ముడిపెడితే అభివృద్ధికి విఘాతం కలుగుతుందని పాలకులు భావించారు. యుఎఇ రాజధాని అయిన అబుధాబిలో ఆరు దశాబ్దాల క్రితం ఒక క్రైస్తవ ఆరాధనా మందిరం (చర్చి)ని ప్రారంభించారు. ఇప్పుడు హిందూ దేవాలయాన్ని నిర్మించారు. ఇంతకు ముందే దుబాయిలో రెండు హిందూ ఆలయాలు ఉన్నాయి.



అరేబియా సముద్ర తీరంలోని గల్ఫ్ దేశాలకు, గుజరాతీ వ్యాపారవేత్తలకు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని యుఎఇలోని దుబాయితో

గల్ఫ్ లేఖ

పాటు పొరుగున ఉన్న ఒమాన్, బహ్రెయిన్ దేశాలలో కూడ దేవాలయాలు ఉన్నాయి. అవన్నీ కూడా గతంలో గుజరాతీ వర్తకులు నిర్మించినవే. ఇప్పటికీ అవి వారి నిర్వహణలోనే ఉన్నాయి.

గుజరాతీలలోని పటీదారు, పటేల్ సామాజిక వర్గాలలో అత్యధికులకు ఇలవేల్పు స్వామి నారాయణ్. బొచసన్వాసీ అక్షర్ పురుషోత్తం సంస్థాన్ (బాప్స్) పేర యుఎఇలోని గుజరాతీలు గత నలభై సంవత్సరాలుగా ప్రైవేటుగా స్వామి నారాయణ్ మందిరాన్ని నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీ, అహ్మదాబాద్‌లతో పాటు అమెరికా, ఆఫ్రికా దేశాలలో కూడ అక్షరధామం మందిరాలను నిర్మించిన ఈ బాప్స్ సంస్థ అబుధాబిలో కూడా మందిర నిర్మాణానికి సంకల్పించి సఫలమయింది.

> యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనేది ఏడు చిన్న రాజ్యాల (అబుధాబి, అజ్మాన్, దుబాయ్, ఫుజైరా, రస్ అలె[illegible]మా, షార్జా, ఉమ్ అల్ కె[illegible]) సమాఖ్య. అబుధాబి లోని స్వామి నారాయణ్ ఆలయానికి ఏడు గోపురాలు ఉన్నాయి. యుఎఇలోని ఏడు రాజ్యాలకు ప్రతీకగా ఈ ఏడు గోపురాలు భక్తుల మనస్సుల్లో భాసిల్లుతున్నాయి. మూలవిరాట్టు స్వామి నారాయణతో పాటు మరో ఆరు దేవతామూర్తులను ఈ విశిష్ట ఆలయంలో ప్రతిష్ఠించారు. వాటిలో ఒకటి తిరుమల ఏడు కొండలపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి.

హిందూ దేవాలయానికే కాకుండా యూదుల ప్రార్థనా మందిర నిర్మాణానికి కూడా యుఎఇ పాలకులు అనుమతించారు. అబ్రహాం మతాల ఆరాధనా కేంద్రాన్ని నెలకొల్పడంతో పాటు సకల మతాలను గౌరవించే విధంగా ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను యుఎఇ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ విజ్ఞప్తిని కూడ పరిశీలించాలని బాప్స్ నిర్వాహకులు కోరడంతో దేవాలయ నిర్మాణానికి అడుగు ముందుకుపడింది. ఈ తరుణంలో ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోదీ అబుధాబిలో యువరాజుతో సమావేశం కావడానికి వెళ్తున్నప్పుడు తమ ఆలయ విషయాన్ని కూడ ప్రస్తావించాలని గుజరాతీలు ఆయన్ని కోరారు. మోదీ అభ్యర్థన మేరకు స్వామి నారాయణ్ సంస్థ కొనుగోలు చేయాలనుకొన్న స్థలానికి మరో మూడింతలు అధిక స్థలాన్ని (13.5 ఎకరాలు) రాజు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్ విరాళంగా ఇచ్చారు. రాజు వ్యక్తిగత విరాళానికి, అదనంగా మరో 13 ఎకరాల స్థలాన్ని సువిశాలమైన పార్కింగ్ నెలవుకై ప్రభుత్వం కేటాయించింది. ప్రధాని మోదీ 2018లో రెండవసారి దుబాయిని సందర్శించిన సందర్భంగా దేవాలయ నిర్మాణానికి రిమోట్ కంట్రోల్ ద్వారా భూమి పూజ చేశారు. ఇటీవల ఏడవసారి పర్యటనలో దాని ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆలయాన్ని ప్రారంభించింది స్వామి నారాయణ్ సంస్థ గురువు మహంత్ స్వామి మహారాజ్ అయినా ప్రధాని మోదీ దీన్ని ప్రారంభించినట్లుగా ప్రచారం జరిగింది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనేది ఏడు చిన్న రాజ్యాల (అబుధాబి, అజ్మాన్, దుబాయ్, ఫుజైరా, రస్ అలె[illegible]మా, షార్జా, ఉమ్ అల్ కె[illegible]) సమాఖ్య. అబుధాబిలోని స్వామి నారాయణ్ ఆలయానికి ఏడు గోపురాలు ఉన్నాయి. యుఎఇలోని ఏడు రాజ్యాలకు ప్రతీకగా ఈ ఏడు గోపురాలు భక్తుల మనస్సుల్లో భాసిల్లుతున్నాయి. ఈ విశిష్ట ఆలయంలో మూలవిరాట్టు స్వామి నారాయణతో పాటు మరో ఆర్గురు దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. ఈ దేవతామూర్తులలో ఒకరు తెలుగు వారి కలియుగ దైవం తిరుమల ఏడు కొండలపై కొలువు దీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి. పద్మావతి శ్రీనివాస భగవాన్ పేర ఉన్న ఈ ఏడుకొండలవాడు నిస్సందేహంగా ఈ ఎడారి దేశాలలోని తెలుగు ప్రవాసులకొక ఆధ్యాత్మిక స్ఫూర్తి.

హిందూ ఆధ్యాత్మిక ఉన్నతి, భారతీయ శిల్పకళా సౌందర్యం ఉట్టిపడే విధంగా రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకొన్న 20 వేల టన్నుల పాలరాతితో రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన రెండు వేల మంది శిల్పులు మూడు సంవత్సరాల వ్యవధిలో ఈ ఆలయాన్ని నిర్మించారు. తెలంగాణలో అద్భుతంగా జిల్లా కలెక్టరేట్ల కాంప్లెక్సులను నిర్మించిన షాపుర్జీ పలంజీ సంస్థే అబుధాబిలోని ఈ స్వామి నారాయణ్ మందిరాన్ని కూడా అద్భుతంగా నిర్మించింది. భారతీయ సంప్రదాయ దేవాలయాల వాస్తు శోభను తలదన్నేలా 402 తెల్ల పాలరాతి స్తంభాలను ఈ ఆలయ నిర్మాణంలో ఉపయోగించారు. ఒక్కొక్క స్తంభంపై దేవతల ప్రతిమలు, హైందవ జీవన విధానం ప్రతిబింబించే విధంగా శిల్పకళ ఉంది. తమ శిల్పకళతో ఆలయాన్ని అలంకరించిన శిల్పులలో రాజస్థాన్‌కు చెందిన మొహమ్మద్ అజ్మల్ ఒకరు. మక్కా, మదీన పుణ్యక్షేత్రాలలో పాలరాయిపై ఖురాన్ సూక్తులను చెక్కిన అజ్మల్ అబుధాబి మందిర శిల్పాలపై కూడ తన ప్రతిభ కనబర్చాడు. ఆలయ ముఖద్వారంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 3డి విధానంతో కూడిన అయోధ్యనగరిని వీక్షిస్తే మనస్సు భక్తి భావంతో నిండిపోయి తాము శ్రీరామచంద్రుడికి అత్యంత దగ్గరగా వెళ్తున్నామనే భావన కలుగుతుంది. పవిత్ర గంగా, యమున నదీ జలాల ప్రవాహాన్ని మైమరపించే విధంగా ఈ నదుల కృత్రిమ ప్రవాహాన్ని కూడ దేవాలయ క్రింది భాగంలో ఏర్పాటు చేయగా సరస్వతీ నదిని ప్రతిబింబించే విధంగా ప్రత్యేక లైట్ల ఫోకసింగ్‌ను ఏర్పాటు చేసారు. ఆలయంలో ఇంకా కొన్ని పనులు పూర్తి కావల్సి ఉన్నాయి. అబుధాబి మందిర ప్రారంభోత్సవ ఘట్టాన్ని ఆధ్యాత్మికత దృష్టితో మాత్రమే చూడాలి కానీ అయోధ్య కోణంతో కాదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్

అవనియందు అగ్రభాష

పేగు బంధంతో ముడిపడి
స్తన్య ధారతో నీలో జీవం పోసుకుని
మాతృమూర్తి లాలనలో బుజ్జగింపై
నాన్న పాలనలో నీలో మమేకమై
వెలుగొందు భాష అమ్మ భాష
అదియే నీకు అవనియందు అగ్ర భాష
అన్య భాషలు ఎన్ని ఉన్నా అవి అవసరానికే
అమృతం చిలికించేది అమ్మ భాషనే కదా సదా
భాషలెన్ని నేర్చిన.. మరువబోకు మాతృభాషని
పలకరింపులలో కూడా పరభాష పదాలు రానివ్వక
అధర కుసుమాలనుండి మాతృభాష
సుగంధాలను వెదజల్లుతూనే ఉండు
జలజాప్తుడి వేడిమికి ప్రాణకోటి జీవం పోసుకున్నట్టు
తల్లి భాష భాషణతో తనువు, మనసు పరవశించాలి
మన అమ్మ భాష పరిఢవిల్లాలి
మన భాష సజీవమై, అజరామరమై
ఆచంద్రతారార్కం నిలవాలి
మాతృభాష ప్రేమికులకి కైమోడ్పులివే
కైకొను ప్రతిన మాతృభాషే ముద్దని


– దాసరి చంద్రమౌళి

మాతృభాష

సమాజాన్ని కలగలిపి బంధించి కట్టి,
పుష్పగుచ్ఛంలా ప్రదర్శించే రంగులతాడు!
ఒకనేల ఆకాంక్షల్ని ఏకగ్రీవంగా ఎలుగెత్తిచాటే
తూర్యారావం మాతృభాష!
తూటాలుగా విస్ఫోటించిన వంగాక్షరాల
అమరికే నేటి బంగ్లాదేశ్!
ఒక ప్రాంత సంస్కృతీబింబాన్ని
ప్రతిఫలించగల అద్దం అమ్మబాస!
తల్లిబాసలో తన్మయమై జనించే సుగంధ పరిమళమేగద
హయలెస్సా, గొకోగొకో, ఉప్పోచెట్టో
ఉలాలుపోస్తూ ఉడిచేగొంతులు
శ్రామిక, కర్షక, శ్రమ చెమటంతా!
నుడికారపు సిరిమువ్వల సవ్వడితో
చెవులను పులకింపజేస్తూ,
వాతెఱతో జాతీయాలను ఆమెతలుగా,
నానుడుల పోడుములతో మనోవీధుల్ని
రాగరంజితం చేస్తుంది!
పురివిప్పిన నెమలిలా నర్తిస్తూ,
జాతిగొప్పతనాన్ని ప్రస్ఫుటింపజేసే
అస్తిత్వకారకం మాతృభాష!
ఈజగత్తు సకలభాషల కలకూజితాల తోట!



– గార రంగనాథం



నేత్రపర్వంగా వీరమ్మ తిరునాళ్ల

ఉయ్యూరు వీరమ్మ తిరునాళ్ల నేత్రపర్వంగా జరిగింది. తిరునాళ్లలోని విశేషంగా జరిగే ఊయల ఉత్సవానికి భక్తులు తండోపతండాలుగా వచ్చారు. అమ్మవారి ఎదురు గండ దీపాలు, తిరుగు గండ దీపాల పట్టుకురావడంతో పట్టణం భక్తసముద్రంగా మారింది. - ఉయ్యూరు





ధర్నాచౌక్ వద్ద ఏపీజేఏసీ నేతల ఐక్యతాభివాదం

ఉద్యోగుల సమర నినాదం!

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమర నినాదం మార్మోగుతోంది. ఆరు రోజులుగా ఆందోళన చేపడుతున్నా పట్టనట్టు ఉన్న ప్రభుత్వంపై ఏపీజేఏసీ ఆధ్వర్యంలో దండెత్తారు. పోరాటం కొనసాగింపులో భాగంగా బందరు, విజయవాడలలోని ధర్నాచౌక్‌ల వద్ద మంగళవారం మహాధర్నా చేపట్టారు. సమస్య పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. కర్కశ ప్రభుత్వ మెడలు వంచేందుకు ఈనెల 27న 'చలో విజయవాడ - మహా ఆందోళన'కు పిలుపునిచ్చారు.

టికెట్లు చిరిగిపోతున్నాయ్!

వైసీపీలో టికెట్లు చిరిగిపోతున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జులుగా నియమించిన వారి పరిస్థితి మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోతోంది. వైసీపీ అధిష్ఠానం.. విజయవాడ పశ్చిమ నుంచి ఆసిఫ్‌ను, మైలవరం నుంచి సర్నాల తిరుపతిరావును ఇన్‌చార్జులుగా నియమిస్తూ జాబితాలు విడుదల చేసిన విషయం విదితమే. తాజాగా వారి స్థానంలో విజయవాడ పశ్చిమ, మైలవరం నియోజకవర్గాలకు కొత్తపేర్లు తెరపైకి వచ్చాయి. అదే సమయంలో ఈ ఇద్దరు నాయకులకు తాడేపల్లి నుంచి పిలుపురావడంతో వీరి అభ్యర్థిత్వాలపై వైసీపీ శ్రేణుల్లోనే అనుమానం వ్యక్తమయ్యే పరిస్థితి ఏర్పడింది.

సర్నాల తిరుపతిరావు, ఆసిఫ్‌కు తాడేపల్లి పిలుపు

- ఇద్దరికీ టికెట్లు లేనట్టేనని ప్రచారం
- మైలవరం తెరపైకి వంశీ పేరు
- ఆసిఫ్ స్థానంలో టీడీపీ మైనారిటీ నేత పేరు



వంశీ



తిరుపతిరావు



ఆసిఫ్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్‌కు మంగళవారం సాయంత్రం తాడేపల్లి నుంచి పిలుపు వచ్చింది. అంతకు ముందు మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు తాడేపల్లిలో ప్రత్యక్షమయ్యారు. వీరి టికెట్ల అంశం చర్చించేందుకే తాడేపల్లి పెద్దలు వీరిని పిలిపించారని వైసీపీ శ్రేణులు చెబుతున్న మాట. నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టీడీపీని వీడి వైసీపీలో చేరనున్న నేపథ్యంలో ఆయనకు గన్నవరం టికెట్‌ను కేటాయించేందుకు వైసీపీ పెద్దలు సిద్ధమయ్యారని సమాచారం.

- ప్రస్తుతం గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న వంశీని మైలవరం లేదా పెనమలూరు నుంచి పోటీ చేయాల్సిందిగా గతంలోనే తాడేపల్లి పెద్దలు సూచించిన విషయం విదితమే. తాజా సమాచారం ప్రకారం వంశీని మైలవరం నుంచి బరిలోకి దింపనున్నట్టు తెలిసింది. ఇక విజయవాడ పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన ఆసిఫ్‌కు సైతం తాడేపల్లి పెద్దలు మొండిచేయి చూపారని సమాచారం. ఆయన స్థానంలో టీడీపీలో ఉన్న మైనారిటీ నేతకు పశ్చిమ సీటు ఇస్తారని తెలుస్తోంది. పొత్తులో భాగంగా పశ్చిమ సీటును జనసేనకు కేటాయించేందుకు టీడీపీ అధిష్ఠానం దాదాపు ఓ నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పశ్చిమ సీటు ఆశించిన సదరు మైనారిటీ నేత టీడీపీ పెద్దల నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మైనారిటీల్లో బలమైన నేతగా పేరున్న ఆయన్ను వైసీపీలోకి ఆహ్వానించి పశ్చిమ సీటు కట్టబెట్టేందుకు అన్ని చర్చలూ పూర్తయినట్టు సమాచారం.

వైసీపీ పెద్దల తీరుపై శ్రేణుల్లో అసంతృప్తి

వైసీపీ పెద్దలు తీసుకుంటున్న నిర్ణయాలపై వైసీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. హడావిడిగా నియోజకవర్గ ఇన్‌చార్జులను ప్రకటించడం ఆ తర్వాత వారిని మార్చేయడంపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంటోంది. మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా సర్నాల తిరుపతిరావును నియమించిన సమయంలోనే ఆయన తుది అభ్యర్థిగా ఉంటారన్న నమ్మకం వైసీపీ శ్రేణుల్లో కానీ నాయకుల్లో కానీ ఏర్పడలేదు. చివరికి ఎంత వేగంగా ఆయన్ను ఇన్‌చార్జిగా నియమించారో అంతే వేగంగా మార్చేసేందుకు సిద్ధమయ్యారు. ఆసిఫ్ విషయంలోనూ అదే జరుగుతోంది. ఆయన ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారం కూడా ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో ఆయన అభ్యర్థిత్వంపై సందేహాలు వ్యక్తమవ్వడం పశ్చిమ వైసీపీ శ్రేణుల్లో అయోమయాన్ని సృష్టిస్తోంది. అయితే ఆసిఫ్ పనితీరుపై చర్చించేందుకే ఆయన్ను తాడేపల్లి పిలిపించారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆసిఫే పశ్చిమ వైసీపీ అభ్యర్థిగా కొనసాగుతారని వారు స్పష్టం చేస్తున్నారు.

వలంటీర్లకు కానుకలు

మొన్న వెలంపల్లి.. నేడు మంత్రి జోగి రమేష్ పంపిణీ

- హాట్ బాక్సులు.. ఫ్లాస్కులు, కప్పులతో గిఫ్ట్ సంచులు
- కానూరులో మంత్రి జోగి రమేష్ అనుచరుల అందజేత
- సంచులపై 'ఆశీర్వదించండి.. అవకాశమివ్వండి' ముద్ర






గిఫ్టు సంచులతో వలంటీర్లు (ఇన్‌సెట్‌లో) మంత్రి జోగి ఇచ్చిన గిఫ్టు ప్యాక్‌లో వస్తువులు

పెనమలూరు, ఫిబ్రవరి 20 : ఎన్నికల తాయిలాలు మొదలయ్యాయి. ఓటర్లను ప్రభావితం చేసేందుకు నోటిఫికేషన్‌కు ముందే వైసీపీ నేతలు గిఫ్టుల పంపిణీకి తెరలేపారు. తమ పార్టీకి అత్యంత కీలకమైన వలంటీర్లకు గిఫ్టులు ఎరవేసి ఎన్నికల్లో లబ్ధిపొందాలనుకుంటున్నారు. మొన్న.. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వెలంపల్లి శ్రీనివాస్ కానుకలు పంపిణీ చేయగా తను ఏమీ తక్కువ కాదన్నట్టు ఇప్పుడు మంత్రి జోగి రమేష్ కూడా అదే బాట పట్టారు. 'నన్ను ఆశీర్వదించండి... అవకాశమివ్వండి! ఫ్యాను గుర్తుకే మన ఓటు' అనే పేరుతో ముద్ర వేసిన సంచుల్లో హాట్ బాక్సులు, ఫ్లాస్కులు, కప్పులు పెట్టి వలంటీర్లకు జోగి రమేష్ అనుచరులు మంగళవారం కానూరులో పంపిణీ చేశారు. కానూరు మన గార్డెన్స్ కల్యాణ మండపంలో పెనమలూరు మండలానికి చెందిన 840 మంది వలంటీర్లను సమావేశపరిచి గిఫ్టు సంచులు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన జోగి రమేష్ మాట్లాడుతూ 'మీరే నాకు మార్గదర్శకులు. పథకాల లబ్ధిదారులు నా కంటే మీకే ఎక్కువ తెలుసు. అధికారంలోకి వస్తే మిమ్మల్ని పార్టీ అధినేత ఇంకా ఎక్కువగా చూసుకుంటారు' అంటూ వారిని ఆకాశానికి ఎత్తారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో విలేకరులు ఎవ్వరూ లేరని నిర్ధారించుకుని జోగి రమేష్ అనుచరులు వలంటీర్లకు గిఫ్టులు పంపిణీ చేశారు.

- వైసీపీ మాజీ కౌన్సిలర్‌కు రెండు ఓట్లు
- మరో మహిళ పేరుతో మూడు ఓట్లు
- భారీగా డబుల్ ఎంట్రీలు
- ఈ ఓటర్లంతా వైసీపీ సానుభూతిపరులే
- టీడీపీ బూత్ ఇన్‌చార్జి ఓటు గల్లంతు
- వెతికినకొద్దీ వెలుగు చూస్తున్న తప్పులు


ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో తప్పులు బయటపడుతూనే ఉన్నాయి. కళ్లెదుట కనిపిస్తున్న చిత్రవిచిత్రాలు అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. వైసీపీ నేతల కనుచూపుల్లోనే ఓటర్ల లిస్టు తయారైనట్టు తేటతెల్లమవుతోంది. నియోజకవర్గంలో కేవలం ఐదు బూత్‌లలో ఓటరు జాబితాను పరిశీలిస్తే విస్మయానికి గురయ్యే నిజాలు బట్టబయలయ్యాయి. చనిపోయిన వారి ఓట్లతోపాటు అధికార పార్టీకి చెందిన వారికి రెండేసి, మూడేసి ఓట్లు ఉన్నాయి. మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకటలక్ష్మీ కుమారికి సైతం రెండు బూత్‌లలో అధికారులు రెండు ఓట్లు కల్పించారు. అస్పష్ట ఫొటోలతో, ఒకే చిరునామా ఉన్నా రెండు ఓట్లు ఎలా కల్పించారో అధికారులే సమాధానమివ్వాలి.


72
LVM3179363
ఇంటి సంఖ్య : 2/169/2
వయస్సు : 53 లింగము : స్త్రీ

922
LVM2813939
ఇంటి సంఖ్య : 2-80-5
వయస్సు : 51 లింగము : స్త్రీ

పట్టణంలో రెండు బూత్‌లలో ఓటు హక్కు ఉన్న వైసీపీ మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మీకుమారి

ఒకొక్కరికి రెండు ఓట్లు


923 | 2 | XWM2081776
ఇంటి సంఖ్య : 3-70
వయస్సు : 73 లింగము : పు
108
909

909 | 2 | XWM2146249
ఇంటి సంఖ్య : 3-70
వయస్సు : 73 లింగము : పు
105
923

833 | 1 | XWM2089183
ఇంటి సంఖ్య : 3-70
వయస్సు : 73 లింగము : పు

మూడు బూత్‌లలో ఓటు హక్కు ఉన్న షేక్ మస్తాన్

గుడివాడ ఓటర్ల జాబితాలో విచిత్రాలెన్నో..!

గుడివాడ : గుడివాడలో 16వ వార్డులోని రెండు బూత్‌లలో ఆ వార్డు వైసీపీ మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకటలక్ష్మీకుమారికి అధికారులు రెండు ఓట్లు ఉన్నాయి. ఒకే వార్డులో రెండు బూత్‌లలో క్రమ సంఖ్యలు 72, 922లతో వెంకటలక్ష్మీ కుమారి మాదాసు పేరుతో రెండు ఓట్లు ఎలా ఇచ్చారో అధికారులే చెప్పాలి.

రెండేసి ఓట్లు..

బూత్ నెంబరు 105లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. తుది జాబితా ప్రచురణలో ఒకే పేజీలో ఉన్న భార్యాభర్తలైన షేక్ రఫీ, నూరున్నీసాలకు రెండేసి ఓట్లు కల్పించారు. 105 బూత్‌లో క్రమ సంఖ్యలు 930, 945లతో రఫీకు, క్రమ సంఖ్యలు 936, 944లతో నూరున్నీసాకు రెండు ఓట్లు ఉన్నాయి. అసమా సుల్తానాకు 105 బూత్‌లో క్రమ సంఖ్యలు 591, 766లతో రెండు ఓట్లు ఉన్నాయి. వీరంతా వైసీపీ సానుభూతిపరులు కావడం విశేషం.

రెండు బూత్‌లలో ఓటు హక్కు

వైసీపీ నాయకుడు షేక్ మునీర్ అహ్మమద్‌కు 105 బూత్‌లో 160, 106 బూత్‌లో 478 క్రమ సంఖ్యలతో రెండు ఓట్లు ఉన్నాయి. మరో యువకుడు మెయిన్ పాషా మెహ్మమద్‌కు 105 బూత్‌లో క్రమ సంఖ్య 468తోనూ, 106 బూత్‌లో క్రమ సంఖ్య 635తోనూ రెండు ఓట్లు ఉన్నాయి. ఒకే చిరునామా, వయస్సు, తండ్రి పేరు అన్నీ ఒకేలా ఉన్నా రెండు ఓట్లు కల్పించారు.

ఒకే వ్యక్తికి మూడు ఓట్లు..

షేక్ మస్తాన్ 105 బూత్‌లో క్రమ సంఖ్య 923తోనూ, 106 బూత్‌లో క్రమ సంఖ్య 833తోనూ, 108 బూత్‌లో క్రమ సంఖ్య 909తోనూ మూడు ఓట్లు ఉన్నాయి.

టీడీపీ బూత్ ఇన్‌చార్జి ఓటు గల్లంతు

స్థానిక 20వ వార్డుకు చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి నల్లూరి రామకృష్ణకు ఇటీవల ఎన్నికల సంఘ విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో ఓటు తీసేశారు. కేవలం టీడీపీ సానుభూతిపరుడు కావడం, ఎన్నికల్లో బూత్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండటంతోనే వైసీపీ నాయకులు సిఫార్సుతో అధికారులు ఓటు తొలగించారని రామకృష్ణ ఆరోపిస్తున్నారు.

మృతులకు చోటు

నియోజకవర్గంలో పలు బూత్‌లలో అక్కడే నివాసముంటున్న వారికి ఓట్లు తొలగించగా, కొంతమంది మృతులకు చోటు కల్పించారు. మృతి చెందిన వారి ఓటు హక్కును కల్పించడం వల్ల దొంగ ఓట్లు పడే అవకాశం ఉంది. మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలంటే బీఎల్‌వోలు వారి వివరాలను సేకరించి కుటుంబ సభ్యుల నుంచి ఆధారాలు సేకరించి వారి ఓట్లను తొలగించాలి. కానీ అలా చేయకుండా వదిలేశారు.

నియో గో.. ఎలక్ట్రికల్ బస్సుల కోసం.. ఏపీటీడీసీ బస్సులను బలి చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన సొంత బస్సులను మూలన పెట్టి ఎలక్ట్రికల్ బస్సులను నడిపే పేరుతో 'కళాధర్ ట్రావెల్స్' అనే సంస్థకు కట్టబెడుతున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ఏపీటీడీసీ బస్సులను అయా యూనిట్లలో ఓ మూలన పెట్టేయబోతున్నారు. 'కళాధర్ ట్రావెల్స్'తో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు భారీ డీల్ ప్రకారం ఇప్పటి వరకు పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన పర్యాటక బస్సులన్నింటినీ మూలన పెట్టేయనున్నారు. గుట్టుచప్పుడు కాకుండా పర్యాటక హోటల్స్, రెస్టారెంట్స్‌ను ప్రైవేటు పరం చేస్తున్న ఏపీటీడీసీ ఉన్నతాధికారులు తాజాగా బస్సులను కూడా వదిలి పెట్టకపోవడం గమనార్హం.



ఆగిపోయిన ఏపీటీడీసీ బస్సులు

ఏపీటీడీసీ బస్సులు గోవిందా!

కళాధర్ గుప్పెట్లోకి బస్సులు

- 23 నుంచి కళాధర్ ట్రావెల్స్ ద్వారా ఎలక్ట్రికల్ బస్సుల ఆపరేషన్
- ప్రైవేటు సంస్థ చేతికే టీటీడీ దర్శన్ టిక్కెట్లు
- సమ్మెకు సిద్ధమౌతున్న ట్రాన్స్‌పోర్టు సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకుల విహార యాత్రల కోసం పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన ట్రాన్స్‌పోర్ట్ యూనిట్ పనిచేస్తుంది. దీని ద్వారా ప్రతి డివిజన్‌లోనూ పర్యాటక ప్యాకేజీల కోసం గత ప్రభుత్వ హయాంలో బస్సులను అందుబాటులో ఉంచారు. విజయవాడ వంటి డివిజన్‌ను దృష్టిలో ఉంచుకుని మల్టీ యాగ్జిల్ బస్సులను కూడా అప్పట్లో కొనుగోలు చేశారు. వైసీపీ అధికారంలోకొచ్చాక పర్యాటక ప్యాకేజీలు అటకెక్కాయి. ప్యాకేజీలే లేకపోవటంతో.. పర్యాటకులు కరువయ్యారు. దీంతో ఏపీటీడీసీ బస్సులకు ఆదరణ తగ్గిపోయింది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)తో కుదుర్చుకున్న దర్శన టిక్కెట్ల ఒప్పందమే ఏపీటీడీసీ ట్రాన్స్‌పోర్ట్ యూనిట్‌కు దిక్కయింది. ప్రతిరోజూ ఏపీటీడీసీకి 1200 దర్శన టిక్కెట్లు ఇస్తుంటుంది. వీటి ఆధారంగానే ట్రాన్స్‌పోర్ట్ యూనిట్ పనిచేస్తోంది. డివిజనల్ యూనిట్ల నుంచి బస్సులు తీసివేసి తిరుపతికి వివిధ దూర ప్రాంతాల నుంచి బస్సులను ఆపరేషన్ చేస్తున్నారు. విజయవాడ నుంచి మల్టీ యాగ్జిల్ బస్సులను తీసివేశాక.. మినీ బస్సులను కేటాయించారు. ఆ బస్సులను కూడా తిప్పటం లేదు.

మూలకు చేరిన ఏపీటీడీసీ బస్సులు

ఉరమని ఉరుములా ఒక్కసారిగా పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) బస్సులన్నింటినీ మూలన పెట్టేసే పథకానికి ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. ఏపీటీడీసీ ఎండీ, ఓ యూనియన్ నేతల ప్రోద్బలంతోనే ట్రాన్స్‌పోర్ట్ యూనిట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు శ్రీకారం చుట్టారని తెలుస్తోంది. పథకం ప్రకారం వారం రోజులుగా పర్యాటక బస్సుల ఆపరేషన్లు నిలుపుదల చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏపీటీడీసీ బస్సులన్నింటినీ నిలుపుదల చేశారు.

ప్రైవేటు సంస్థకు అప్పగింత

కళాధర్ ట్రావెల్స్ అనే సంస్థతో ఉన్నతాధికారులు రహస్యంగా సంప్రదింపులు జరిపిన తర్వాత ఏపీటీడీసీ పరిధిలో బస్సులను తిప్పే నిర్వహణ బాధ్యతలను ఆ సంస్థకు కట్టబెడుతున్నట్టుగా తెలిసింది. ఎండీ స్థాయిలో డీల్ జరిగినట్టు సమాచారం. ఫిబ్రవరి 23 నుంచి ఏపీటీడీసీ బస్సుల స్థానంలో కళాధర్ ట్రావెల్స్ బస్సులు నడవనున్నాయి. ఈ ట్రావెల్స్‌కు మొత్తం 35 ఎలక్ట్రికల్ బస్సులను నడిపేందుకు ఐదేళ్లకాలానికి ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. ఒప్పందం ప్రకారం.. కళాధర్ ట్రావెల్స్ సంస్థ 'నియో.. గో' అనే ఎలక్ట్రికల్ బస్సులను ఈనెల 23వ తేదీ నుంచి నడుపుతుంది. పంజాబ్‌కు చెందిన ఒక సంస్థ ఈ నియో గో బస్సులను తయారు చేస్తుంది. వీటిని నడిపేవారికి ఐదేళ్ల కాలం వరకు ఎలాంటి పన్నులూ చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ బస్సులను కళాధర్ సంస్థ ఐదేళ్లకు లీజుకు తీసుకున్నట్టుగా తెలుస్తోంది. దీని కోసం బస్సుకు రూ.కోటి చొప్పున ఆ సంస్థ సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకున్నట్టు సమాచారం. ప్యాకేజీ ధరల నిర్ణయం కూడా ఆ సంస్థ కంట్రోల్‌లోకి వెళిపోతుంది.

టీటీడీ టిక్కెట్లు.. కళాధర్ గోవిందా

ఏపీటీడీసీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ నుంచి ప్రతిరోజూ 1200 దర్శన్ టిక్కెట్లు వస్తున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ విభాగాన్ని మొత్తం ప్రైవేటీకరణ చేస్తున్న నేపథ్యంలో టీటీడీ కల్పిస్తున్న టిక్కెట్లన్నింటినీ కళాధర్ ట్రావెల్స్‌కు కట్టబెట్టనున్నారని తెలుస్తోంది.

- మిగతా 6లో



యథేచ్ఛగా వైఎస్ఆర్ విగ్రహ నిర్మాణం

- హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు
- విలేకరిపై వైసీపీ కార్యకర్తల దూషణలు

- 6లో..



ఉయ్యూరు ఆలయం వద్ద ఊయలలూగుతున్న వీరమ్మ తల్లి

నేత్రపర్వం.. వీరమ్మ ఊయల ఉత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

ఉయ్యూరు, ఫిబ్రవరి 20 : వీరమ్మతల్లి తిరునాళ్లలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న అమ్మవారి ఊయల ఉత్సవం మంగళవారం అశేష భక్త సందోహం నడుమ నయనానందకరంగా జరిగింది. పదిహేను రోజుల తిరునాళ్లకు మెట్టినింటి నుంచి సోమవారం రాత్రి బయలుదేరిన అమ్మవారు ఎదురుగండ దీపాలు అందుకుని, తిరుగు గండ దీపాల భక్తులు వెంటరాగా పట్టణంలో వీధి వీధి ఊరేగి భక్తుల దీపారాధనలు అందుకుని సాయంత్రం ప్రధాన సెంటర్ సమీపాన ఉన్న ఊయల స్తంభాల ఊయల ఉత్సవం జరుపుకున్నారు. అమ్మవారి ఊయల ఉత్సవం తిలకించేందుకు పలు ప్రాంతాలనుంచి వచ్చి భక్తులతో ఉయ్యూరు ప్రధానసెంటర్‌తోపాటు ఇతర రహదారులు జనసంద్రంగా మారాయి. గ్రామోత్సవం, ఊయల ఉత్సవం అనంతరం వేలాది భక్తులు వెంటరాగా ప్రధాన రహదారిపక్కన ఉన్న ఆలయానికి చేరుకుని తిరునాళ్లలో భక్తుల మొక్కుబడులు తీర్చుకునేందుకు కొలువయ్యారు. వీరమ్మ తల్లి ఊయల ఉత్సవం సందర్భంగా ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. గన్నవరం డీఎస్పీ జయసూర్యతోపాటు పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక రథాలపై తిరుపతమ్మ గోపయ్య స్వాములు

పెనుగంచిప్రోలు చేరుకున్న తిరుపతమ్మ, గోపయ్యస్వామి

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 20 : జగ్గయ్యపేటలో రంగుల మహోత్సవం పూర్తిచేసుకుని మంగళవారం గోపయ్య సమేత తిరుపతమ్మ పరివార దేవతలు ఉదయం పెనుగంచిప్రోలు చేరుకున్నారు. 18న జగ్గయ్యపేటలో రంగుల మండపం నుంచి పల్లకీలో బయల్దేరిన దేవతలు చిల్లకల్లు, భీమవరం, లింగగూడెంల మీదగా మంగళవారం పెనుగంచిప్రోలు చేరుకుంది. లింగగూడెం నుంచి మంగళవారం పెనుగంచిప్రోలులోని రంగుల మండపానికి తీసుకురాగా, పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై ఊరేగింపుగా దేవస్థానానికి తీసుకువచ్చారు. ఈవో కె.రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల వాసు, ధర్మకర్తలు పాల్గొన్నారు. సీఐ జానకిరాం, ఎస్సై రాంబాబు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

- నిరసన తెలిపిన జర్నలిస్టులు, నేతలు



అజిత్‌సింగ్‌నగర్ : అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు పాశవికంగా దాడి చేయడం హేయమని పలువురు వక్తలు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రింట్, ఎలక్ట్రానిక్ అండ్ సోషల్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్మారక గ్రంథాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అసోషియేషన్ సభ్యులు ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్(చిన్ని), టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, సీపీఎం నేత కె.దుర్గారావు, సీపీఐ నేత కేవీ భాస్కరరావులు పాల్గొని సంఘీభావం తెలియజేశారు. అసోసియేషన్ సభ్యులు మాదాల చక్రవర్తి, కె.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ, శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ సంఘాల ఆగ్రహం

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ రౌడీ మూకలపై తక్షణమే హత్యాయత్నం కేసు నమోదు చేయాలని టీడీపీ బీసీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా బీసీ సంఘం నేతలు మంగళవారం నిరసన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు నవనీతం సాంబశివరావు, లబ్బా వైకుంఠం, దాసరి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు.. జగన్ దురహంకారానికి పరాకాష్ట

విద్యాధరపురం : జర్నలిస్టులపై దాడులు జగన్ దురహంకారానికి పరాకాష్ట అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేకరులపై వైసీపీ గుండాల చేత దాడులు చేయించడం జగన్ దురహంకారానికి నిదర్శనమన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలంటే కేంద్రస్థాయిలో చట్టం రూపొందించాల్సి ఉందన్నారు.

హత్యాయత్నం కేసు నమోదుచేయాలి

- అవనిగడ్డలో జర్నలిస్టులు, ప్రజాసంఘాల ధర్నా



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు

అవనిగడ్డ : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూక దాడి హేయమైన చర్య అని జర్నలిస్టు సంఘాల నేతలు మండిపడ్డారు. శ్రీకృష్ణపై దాడిని ఖండిస్తూ అవనిగడ్డలో దివి జర్నలిస్ట్ యూనియన్, అవనిగడ్డ ప్రెస్ క్లబ్, ఏపీయూడబ్ల్యూజేల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, అధికార పార్టీ ముసుగులో అరాచకాలు, అక్రమాలను బయటపెడుతున్న జర్నలిస్టులపై దాడికి తెగబడుతూ వారి నోళ్లు నొక్కాలని చూస్తున్నారన్నారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తన నాలుగు దశాబ్దాల పాత్రికేయ యుగంలో ఇలాంటి ఘటనలు ఎన్నడూ చూడలేదని సీనియర్ జర్నలిస్టు దీవి సారంగపాణి అయ్యంగార్ అన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. జర్నలిస్టుల ధర్నా, నిరసన కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది సైకం రాజశేఖర్, మత్స్యకారనేత కోలా బాలాజీ వర్గాలు మద్దతు పలికారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ మండలి కేశవికి వినతిపత్రం అందజేశారు.





విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న ఏపీ జేఏసీ నేతలు, వివిధ విభాగాల ఉద్యోగులు

జాలిలేని కర్కశ ప్రభుత్వం మెడలు వొంచుదాం

- 27న చలో విజయవాడ ఆందోళనతో గట్టి సమాధానం ఇద్దాం
- అడిగిన డిమాండ్లలో చేసినివి ఒక్కటి ఉంటే చెప్పండి
- ఉద్యోగుల సమస్యలు, సంక్షేమాన్ని గాలికి వొదిలేస్తారా?
- విజయవాడ, బందరు ధర్నాచౌక్‌ల్లో గళమెత్తిన ఏపీజేఏసీ నేతలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ధర్నాచౌక్): తమ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పట్ల ప్రైవేటు యాజమాన్యాలు కనీస గౌరవాన్ని కలిగి ఉంటాయని, ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల పట్ల వైసీపీ పాలకులు కనీస గౌరవం ఇవ్వకపోగా మానవత్వం కూడా చూపడం లేదని ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. తన సర్వీసులో ఇప్పటివరకు ఇలాంటి దుస్థితిని ఎన్నడూ చూడలేదన్నారు. 'ఉద్యమ శంఖారావం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ జిల్లా ధర్నా చౌక్‌లో ఏపీజేఏసీ మహాధర్నా తలపెట్టింది. కార్యక్రమానికి ఏపీఎన్జీవో నేత ఎ.విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం పేరుతో ప్రభుత్వ ప్రతినిధులు చర్చల ద్వారా ప్రభుత్వం ఇప్పటి వరకు అబద్ధాలతో ఉద్యోగులను మోసం చేస్తూనే వస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి ఏ డిమాండ్లకు కూడా పరిష్కారం లభించలేదన్నారు. చర్చల పేరుతో వాయిదాలు, అబద్ధాలతో కాలక్షేపం చేస్తూ వచ్చారే తప్ప పరిష్కరించిన దాఖలా లేదన్నారు. ప్రభుత్వంపై నమ్మకం సడలిపోయిందన్నారు. కార్యాలయాలలో స్టేషనరీ ఖర్చులు కూడా ఉద్యోగులే భరించాల్సి వస్తోందన్నారు. దశాబ్దాలుగా ఉద్యోగులు పోరాడి సాధించుకున్న చట్టపరమైన ప్రయోజనాలనూ ఈ ప్రభుత్వం కుదించేసిందన్నారు. సమావేశాలన్నీ చాయ్ బిస్కట్ సమావేశాలుగానే మిగిలిపోయాయన్నారు. ఉద్యోగులకు మంచి చేయాలనే సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదని కాస్త ఆలస్యంగా అర్థమైందన్నారు. ఈ నెల 27వ తేదీన బీఆర్‌టీఎస్ రోడ్డులో 'మహా ఆందోళన' కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి గట్టి సమాధానం ఇవ్వదలచుకున్నామన్నారు. ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ, ఉద్యోగులు తమ నగదును ప్రభుత్వం దగ్గర దాచుకుంటే ఆ డబ్బులను ప్రభుత్వం దుబారా చేయటం దురదృష్టకరమన్నారు. ఈ ప్రభుత్వాన్ని కేవలం దాచుకున్న డబ్బులను మాత్రమే ఇవ్వాలని అడుగుతున్నామన్న విషయాన్ని పౌరసమాజం గుర్తించాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు జేఏసీలో ఉన్న 104 సంఘాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జేఏసీ కార్యదర్శి ఎండీ ఇక్బాల్, యూటీఎఫ్ నాయకులు హరినాథ్‌బాబు, ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, ఎస్టీయూ నాయకులు రవీంద్రబాబు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సాయిరా తదితరులు పాల్గొన్నారు.

బందరులో దద్దరిల్లిన ధర్నాచౌక్

- డిమాండ్ల సాధనకు ఏపీ జేఏసీ నేతల ధర్నా
- సీపీఎస్, జీపీఎస్ వద్దంటూ నిరసనలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ కృష్ణాజిల్లా విభాగం ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, వేతనాల పెంపు, పెండింగ్ డీఏలు, మధ్యంతర భృతి విడుదల చేయాలని కోరుతూ జేఏసీ నాయకుల నినాదలతో ధర్నాచౌక్ దద్ధరిల్లింది. జిల్లా నలుమూలలనుంచి జేఏసీ నేతలు తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. ఏపీ జేఏసీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, ఏపీ జేఏసీ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు తదితరులు ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. పెన్షనర్స్ అసోయేషన్ జిల్లాకార్యదర్శి ఏవీ ప్రసాద్ మాట్లాడుతూ, 70సంవత్సరాలు, 75సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు అదనపు పెన్షన్‌ను మంజూరుచేయాల్సి ఉన్నా కోత పెట్టారన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖరరావు, ఏపీ జేఏసీ జిల్లా విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి హేమప్రకాష్ తదితరులు మాట్లాడుతూ, ఈనెల 27వతేదీన నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులను కూడా తీసుకువచ్చి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్ల జేఏసీ నాయకులు, ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు.

185 సీఏఎస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో 185 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) స్పెషలిస్ట్ డాక్టర్ల ని యామకం చేపడుతున్నట్లు ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ మం గళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రకటించారు. రెగ్యులర్, కాంట్రాక్ట్, కోటేషన్ ప ద్ధతిలో పోస్టుల్ని భర్తీ చేస్తామన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యా హ్నం ఒంటిగంట వరకూ మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ, ఫోరెన్సిక్ మె డిసిన్ విభాగాలకు ఈ నెల 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. గైనకాలజీ, పీడీయాట్రిక్స్, ఎనస్థీసియా, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, పాథాలజీ వి భాగాలకు మార్చి 1న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సమాచారం కోసం సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

చలసాని రాఘవేంద్రరావుకు సత్కారం

వన్‌టౌన్: ఇటీవల నూఢిల్లీలో జరిగిన నాఫ్కాబ్ పాలక మండలి డైరెక్టర్ గా ఎన్నికైన విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సమితి స భ్యుడు చలసాని రాఘవేంద్రరావును మంగళవారం నగరంలో సీపీఐ నేతలు సత్కరించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, సహాయ కార్యద ర్శులు జేవీ సత్యనారాయణమూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, కోటేశ్వరరావు రాఘవేంద్రరావును సత్కరించినవారిలో ఉన్నారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో పలువురికి పతకాలు

విజయవాడ స్పోర్ట్సు: రాజమహేంద్రవరంలో ఈ నెల 16న ముగిసిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా బ్యాడ్మింట న్ ప్లేయర్స్ పతకాలతో సత్తా చాటారు. మహిళల 40 ప్లస్ డబుల్స్‌లో శ్రీదేవి, లక్ష్మీ తనూజ (రజతం), 45 ప్లస్ సింగిల్స్ పద్మ (స్వర్ణం), 50 ప్లస్ సింగిల్స్‌లో జయ (స్వర్ణం), 50 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కేవీడీ ప్రసాద్, జయ (రజతం), పురుషుల 60 ప్లస్ సింగిల్స్‌లో శ్రీనివాస గాంధీ (స్వర్ణం), డబుల్స్‌లో శ్రీనివాసగాంధీ, శ్రీనివాసరావు (రజతం), 65 ప్లస్ సింగిల్స్‌లో పీఎస్ శాస్త్రి (స్వర్ణం), 70ప్లస్ డబుల్స్‌లో గంగాధరరావు, విజయ్‌కుమార్ (రజతం), సింగిల్స్‌లో సా యిప్రసాద్ (రజతం) సాధించారని కేడీబీఏ అధ్యక్ష,కార్యదర్శులు పోలినేని అంకమ్మ చౌదరి, పర్సా శ్రీనివాసరావు తెలిపారు. వీరంతా హర్యానా రాష్ట్రం పంచకులలో మార్చి 16 నుంచి జరిగే చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారన్నారు.

కరాటే సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా విజయ్‌కుమార్

రాష్ట్ర స్పోర్ట్సు కరాటే అసోసియేషన్ (కాయ్) సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా నగరానికి చెందిన కరాటే కోచ్ ఉప్పాడ విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. ఇటీవల కాయ్ ఆధ్వర్యంలో గొల్లపూడిలో సెమినార్, రిఫరీ అండ్ జడ్జీ పరీక్షలు జరిగాయి. 45 మంది పాల్గొనగా విజయ్‌కుమార్‌కు ఢిల్లీ నుంచి వచ్చిన షిహాన్ రజనీష్ చౌదరి ఏడాదికి సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

హిందువుల మనోభావాలపై ఆంక్షలా!

- 24న పవిత్ర స్నానాలకు అనుమతివ్వండి
- మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్



కృష్ణవేణి పాదాలు పరిశీలిస్తున్న మండలి, టీడీపీ నాయకులు

కోడూరు, ఫిబ్రవరి 20 : హిందువుల మనోభావాలు దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నజగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాఘ శుద్ధ పౌర్ణమికి వచ్చే భక్తుల శాపనార్థాలతో కొట్టుకుపోతుందని అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరు మండలం సాగర సంగమ ప్రదేశాన్ని స్థానిక నేతలతో కలిసి ఆయన సందర్శించారు. దెబ్బతిన్న భవనాలు, దేవుళ్ల విగ్రహాలు, కృష్ణవేణి పాదాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ, మాఘశుద్ధ పౌర్ణమి అంటే సంగమ స్నానం అని, వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా భక్తులకు అనుమతి ఇవ్వలేదన్నారు. ఆది శంకరాచార్యులు ఇక్కడ స్నానం చేశారని, గత కృష్ణా పుష్కరాలకు వేలాదిమంది సంగమ క్షేత్రంలో స్నానాలు చేశారన్నారు. క్షేత్రంలో భక్తుల కోసం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరినా స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 24న సంగమ ప్రాంతంలో భక్తుల స్నానాలకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాంబులు వేసి రేవులో చేపలు చంపేస్తున్నారు!

- పోలీసులను ఆశ్రయించిన మత్స్యకారులు

కోడూరు, ఫిబ్రవరి 20 : మత్స్యకారులకు జీవనోపాధిగా ఉన్న కృష్ణానది రేవులో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు బాంబులు వేసి చేపలను చంపేస్తున్నారని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియులు కోడూరు పోలీసులను ఆశ్రయించారు. స్టేషన్‌లో ఎస్ఐ శిరీషకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కొప్పనాతి పరశురామయ్య మాట్లాడుతూ, గత మూడేళ్లుగా విశ్వనాథపల్లి రేవులో రాత్రి వేళల్లో బాంబులు వేసి మత్స్య సంపదను చంపేస్తున్నారని, గుర్తు తెలియని వ్యక్తులు బాంబులు వేయటం వల్ల మత్స్య సంపద తరలి పోయే ప్రమాదం ఉందని అన్నారు. అధికారులు స్పందించి రేవులో బాంబులు వేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్వనాథపల్లి గ్రామ సర్పంచ్ కొప్పనాతి శేషుబాబు, అగ్నికుల క్షత్రియ నాయకులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

పార్టీ మారుతున్నట్టు అసత్య ప్రచారమే.. : కొనకళ్ల



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 : తాను వైసీపీలోకి మారుతున్నట్టు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వైసీపీలో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీని వీడే ప్రసక్తే లేదన్నారు. తనపై లేనిపోని దుష్ప్రచారం చేయవద్దని సోషల్ మీడియా ప్రతినిధులకు హితవు పలికారు.

కలెక్టర్ గారూ ఇదేం పని..!

- ఎంపీ పేరు లేకుండా శిలాఫలకం ఏర్పాటు



మచిలీపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా కలెక్టరేట్ చుట్టూ కాంపౌండ్‌వాల్, ఇతర నిర్మాణాల పనులను మంగళవారం కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే పేర్నినాని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. శిలాఫలకంపై ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం ఎంపీ పేరును ముద్రించాల్సి ఉండగా, రాజకీయకోణంలో ఎంపీ పేరును వేయకపోవడంపై ఎంపీ వర్గీయులు గుర్రుగా ఉన్నారు. కలెక్టర్‌గారు ఇదేం వివక్ష అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎంపీ పార్టీ మారడంతో ఆయన పేరును ముద్రించకుండా చేశారా.. లేక మరేమైనా కారణాలు ఉన్నాయా అన్న చర్చ నగరంలో జరుగుతోంది. శిలాఫలకంపై పేర్ని వెంకట్రామయ్య(నాని), కలెక్టర్ రాజాబాబు, పట్టణాభివృద్ధి ప్రభుత్వ కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, ముడా చైర్‌పర్సన్ బొర్రా వెంకట కనకదుర్గ నాగలక్ష్మీ భవానీ, జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు పేర్లను ముద్రించారు. ఎంపీ పేరును మాత్రం మరిచారు. ప్రోటోకాల్ అంశంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఎంపీ బాలశౌరి సిద్ధమవుతున్నట్టు సమాచారం.

పాలిటెక్నిక్ క్యాంపస్ ఎంపికలో ఇద్దరికి రూ.8.6 లక్షల ప్యాకేజీ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

గుడ్లవల్లేరు : ఎ.ఎ.ఎన్.ఎంఅండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్‌లో కళాశాల క్యాంపస్ డ్రైవ్‌లో ప్రఖ్యాత టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థకు 8.6 లక్షల వార్షిక ఆదాయంతో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో పాలిటెక్నిక్ కళాశాలల నుంచి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన 1372 మంది విద్యార్థులు హాజరుకాగా.. తొమ్మిది మంది వార్షిక ఆదాయం రూ.8.6 లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారని, వారిలో తమ కళాశాల విద్యార్థులు బి.కార్తీక్, ఎమ్.అక్షయ్ నిర్మల్‌లు ఎంపికవడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, సిబ్బందిని కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, కో-సెక్రటరీ వల్లూరుపల్లి రామకృష్ణ తదితరులు అభినందించారు.

ఒకొక్కరికి రెండు ఓట్లు

(5వ పేజీ తరువాయి)

అసమా సుల్తానాకు 105 బూత్‌లో క్రమ సంఖ్యలు 591, 766లతో రెండు ఓట్లు ఉన్నాయి. అధికారులు రెండేసి ఓట్లు కేటాయించిన వారందరూ వైసీపీ సానుభూతిపరులు కావడం విశేషం.

రెండు బూత్‌లలో ఓటు హక్కు

వైసీపీ నాయకుడు షేక్ మునీర్ అహ్మమద్‌కు 105 బూత్‌లో 160, 106 బూత్‌లో 478 క్రమ సంఖ్యలతో రెండు ఓట్లు ఉన్నాయి. మరో యువకుడు మెయిన్ పాషా మెహ్మమద్‌కు 105బూత్‌లో క్రమసంఖ్య 468తోనూ, 106 బూత్‌లో క్రమసంఖ్య 635తోనూ రెండు ఓట్లు ఉన్నాయి. ఒకే చిరునామా, వయస్సు, తండ్రి పేరు ఒకేలా ఉన్నా రెండు ఓట్లు కల్పించారు.

ఒకే వ్యక్తికి మూడు ఓట్లు..

షేక్‌మస్తాన్ 105 బూత్‌లో క్రమసంఖ్య 923తోనూ, 106 బూత్‌లో క్రమ సంఖ్య 833తోనూ, 108 బూత్‌లో క్రమ సంఖ్య 909తోనూ మూడు ఓట్లు ఉన్నాయి.

టీడీపీ బూత్ ఇన్‌చార్జి ఓటు గల్లంతు

స్థానిక 20వ వార్డుకు చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి నల్లూరి రామకృష్ణకు ఇటీవల ఎన్నికల సంఘ విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో ఓటు తీసేశారు. కేవలం టీడీపీ సానుభూతిపరుడు కావడం, ఎన్నికల్లో బూత్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండటంతోనే వైసీపీ నాయకులు సిఫార్సుతో అధికారులు ఓటు తొలగించారని రామకృష్ణ ఆరోపిస్తున్నారు.

మృతులకు చోటు

నియోజకవర్గంలో పలు బూత్‌లలో అక్కడే నివాసముంటున్న వారికి ఓట్లు తొలగించగా, కొంతమంది మృతులకు చోటు కల్పించారు. మృతి చెందిన వారి ఓటు హక్కు వల్ల దొంగ ఓట్లు పడే అవకాశం ఉంది. మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలంటే బీఎల్వోలు వారి వివరాలను సేకరించి కుటుంబ సభ్యుల నుంచి ఆధారాలు సేకరించి వారి ఓట్లను తొలగించాలి. కానీ అలా చేయకుండా వదిలేశారు.

వ్యవస్థలను గౌరవించని వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండటం దౌర్భాగ్యం

గుడివాడ : వ్యవస్థలను గౌరవించలేని వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండటం తెలుగు ప్రజల దౌర్భాగ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము వ్యాఖ్యానించారు. మీడియా సంస్థలపై కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలను అయన ఖండించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, వైసీపీ మూకల దాడిలో గాయపడిన ఫొటో జర్నలిస్టు కుటుంబానికి సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే నాని వ్యాఖ్యలను చూస్తుంటే ప్లాన్ ప్రకారమే దాడి చేశారనే అనుమానాలు వస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో సమస్యలను పట్టించుకోక దేశ, రాష్ట్ర రాజకీయాలు గురించి మాట్లాడే సన్నాసి ఎమ్మెల్యేగా ఉండటం దురదృష్టకరమన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తదితరులు కొడాలి వ్యాఖ్యలను ఖండించారు.

యథేచ్ఛగా వైఎస్ఆర్ విగ్రహ నిర్మాణం

- హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు
- విలేకరిపై వైసీపీ కార్యకర్తల దూషణలు



వేలేరు రహదారి మధ్యలో సాగుతున్న పనులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 20 : వేలేరు, రేమల్లె, జవహర్ నవోదయ రహదారి కూడలిలో ఆర్వోబీ వద్ద అనుమతులు లేకుండా ప్రజారవాణాకు ఆటకంకలిగేలా నిర్మిస్తున్న వైఎస్ఆర్ విగ్రహ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని హైకోర్టు గత శనివారం(ఫిబ్రవరి 10)న ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ స్థానిక వైసీపీ నాయకుల ప్రోద్బలంతో విగ్రహ నిర్మాణ పనులు నిరాటంకంగా సాగుతున్నాయి. వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో బహిరంగంగానే నిర్మాణ పనులు జరుగుతున్నా పోలీసులు, ఆర్ అండ్ బీ, పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్టే విధించిన ప్రాంతంలో పార్టీకి చెందిన వ్యక్తులు గానీ ప్రజలు గానీ ఆ ప్రాంతంలో ఉండకూడదు, కానీ ఆ ప్రదేశంలో వైసీపీకి చెందిన వ్యక్తులు సుమారు 20మందికి పైగా కాపలాగా ఉన్నారు.

కవరేజికి వెళ్లిన విలేకరిపై దుర్భాషలు

నిర్మాణం సమాచారంతో విలేకరులు కవరేజీ చేసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న వైసీపీ కార్యకర్తలు ఆంధ్రజ్యోతి విలేకరిని అడ్డుకుని దుర్భాషలాడుతూ వాగ్వివాదానికి దిగారు. విధినిర్వహణలో భాగంగా ఫోటో తీసుకునేందుకు వచ్చానని చెపుతున్నా వినకుండా విలేకరిపైకి గుంపుగా రావడంతో అక్కడే ఉన్న ఎస్సై జనార్ధన్ వారిని అడ్డుకుని పంపించివేశారు. ఘటనపై ఆర్ అండ్ బీ డీఈఈ, విజయవాడ అధికారులను వివరణ కోరగా ఉదయం వచ్చి పనులు ఆపివేయించామని, పనులు మానకుని అక్కడే కాపలా ఉండాలా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. మీడియా సమాచారంతో ఘటనా స్థలం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు సీఐ నరసింహమూర్తి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	298
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి శేషవాహన సేవ



వన్‌టౌన్, ఫిబ్రవరి 20: బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండోరోజైన మంగళవారం స్వామివారికి శేషవాహన సేవ నిర్వహించారు. ఉదయం కృష్ణానది నుంచి కలశతీర్థం తీసుకువచ్చారు. అనంతరం నిత్య అర్చన, పుణ్యాహవచనం, వాస్తుపూజ, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తు హోమం, ధ్వజపట ప్రతిష్ఠ, బేరీ పూజ, ధ్వజారోహణం వంటివి నిర్వహించారు. సాయంత్రం నిత్య హోమం, బలిహరణం, నీరాజనం, మంత్రపుష్పం, శేషవాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామిని భక్తిమీర దర్శించుకుని తమ ఆర్తిని వినిపించారు.. ఈవో ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

జగన్ పాలనలో దళితులపై దమనకాండ

● బొండా ఉమా

పాయకాపురం, ఫిబ్రవరి 20 : సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో నిత్యం ఏదో ఓ మూల దళితులపై దమనకాండ జరుగుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. టీడీపీ సెంట్రల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్ ఆధ్వర్యంలో 63వ డివిజన్ సుందరయ్యనగర్ ప్రాంతంలో మంగళవారం దళిత గర్జన యాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమా దళితులపట్ల వైసీపీ ప్రభుత్వం చూపుతున్న నిరంకుశ ధోరణిపై ప్రజలను చైతన్య పరుస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు పనిగట్టుకుని దళితుల భూములను కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు అందించే 27 సంక్షేమ పథకాలను జగన్ అటకెక్కించారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చేసి దళితులపై దాడులకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు దళితులంతా ఐక్యంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నేతలు పైడి తులసి, లబ్బా దుర్గా, బత్తుల కొండ, పైడి శ్రీను, లబ్బా వైకుంఠం, పట్టిమ రమణ, కోలా శ్రీను పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బొండా ఉమా

రానున్నది టీడీపీ ప్రభుత్వమే
పరుచూరి ప్రసాద్

పాయకాపురం: రాష్ట్రంలో రానున్నది టీడీపీ ప్రభుత్వమే అని, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి చేసేది విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. 64వ డివిజన్ కండ్రికలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి లేదన్నారు. టీడీపీ- జనసేన పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిపోయిన అభివృద్ధిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రసాద్

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

వన్‌టౌన్, ఫిబ్రవరి 20: మద్యం తాగొద్దని భార్య మందలించిందని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కృష్ణలంక పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పైడి ఉమాదేవి మధ్యాహ్న భోజనం వండి పెట్టే పని చేస్తుంటుంది. భర్త సుమన్ ఉడ్ పాలిష్ పనిచేస్తుంటాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుమన్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం పూటుగా తాగి రావడంతో భార్య మందలించింది. రాత్రి భోజనాలు అయిన తరు వాత భర్త ఇంట్లోంచి ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా, ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కృష్ణబలిజ సంఘం ఆత్మీయ సమ్మేళనం

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 20 : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాగల నాయకుడు చంద్రబాబు అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని చిన్నిలు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో కృష్ణబలిజ సంఘం ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే కృష్ణబలిజ సామాజిక వర్గ అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నేతలు నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయి బాబా-నాగమానసాదేవి మందిరంలో మంగళవారం బాబాకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక రకాల పూలతో బాబాకు పూజలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకుడు సుధాస్వామి బాబాకు ప్రత్యేక హారతి ఇచ్చారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ఫొటో జర్నలిస్ట్‌పై దాడి అమానుషం

భవానీపురం, ఫిబ్రవరి 20 : ప్రజాస్వామ్యంలో నిస్వార్థంగా పనిచేస్తున్న జర్నలిస్ట్‌లపై దాడులు చేయడం అమానుషమని గాంధీదేశం సోషల్ వెల్ఫేర్‌ట్రస్ట్ వ్యవస్థాపకుడు గాంధీనాగరాజన్ ఒక ప్రకటనలో ఖండించారు. అనంతపురం రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ కృష్ణపై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 20 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుబ్బరాజునగర్, సుందరమ్మదిబ్బ, న్యూ రాజరాజేశ్వరిపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాయకాపురం: పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్, లక్ష్మీనగర్, ఎల్‌బీఎస్ నగర్, సుందరయ్యనగర్, ఆంధ్రాబ్యాంక్ మెయిన్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ. సుధాకర్ తెలిపారు.

గవర్నర్‌పేట: సూర్యారావుపేట సెక్షన్‌లో జోర్నకల్ ఫీడర్ పరిధి, కస్తూరిబాయిపేట పరిధి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ఫీడర్ పరిధిలోని పలు వీధుల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యాధరపురం: భవానీపురం 11 కేవీ హైవే ఫీడర్‌లైన్ల మరమ్మతుల కారణంగా వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్డు, హైవే రోడ్డు వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్డు, బేతపూడి అరుణ కుమారి రోడ్డు, బాజి బాబా మందిరంరోడ్డు, సభాపతి రోడ్డు, ఔట్ ఏజెన్సీ మీరా సాహెబ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

2వ వారం
అప్సర
సినిమా



రోజూ 4 ఆటలు : 11-15AM, 02-30PM, 06-15PM, 9-30PM
www.justickets.in
www.bookmyshow.com

MAGICAL BLOCKBUSTER



విజయవాడ	అలంకార్	మచిలీపట్నం	సిరివెంకట్
విజయవాడ	జి3రాజ్‌యువరాజ్	గుడివాడ	జి3సింధూర
విజయవాడ	ఊర్వశి INOX	గుడ్లవల్లేరు	రామకృష్ణ
విజయవాడ	మిరాజ్ సినిమాస్	ముదినేపల్లి	పూర్ణిమ
ఎంజిరోడ్	లైలా INOX	కైకలూరు	జి3విజయలక్ష్మీ
లబ్బీపేట	పీవీపీ సినీపోలీస్	బంటుమిల్లి	శ్రీదుర్గామహల్
లబ్బీపేట	పివిఆర్ సినిమాస్	లక్ష్మీపురం	అంజనాసినీమ్యాక్స్
బెంజిసర్కిల్	క్యాపిటల్‌సినిమాస్	గన్నవరం	శాంతి
పటమట	LEPL INOX	హనుమాన్‌జంక్షన్	శ్రీకృష్ణాటాకీస్
అశోక్‌నగర్	పవర్‌సినీపోలీస్	నూజివీడు	సత్యనారాయణ
వన్‌టౌన్	సౌమ్య	ఆగిరిపల్లి	అనుడీలక్స్
భవానీపురం	స్వాతి	ఇబ్రహీంపట్నం	బాలాజీఐకానియా
పాయకాపురం	తారాస్క్రీన్స్	కొండపల్లి	శివకృష్ణ
కానూరు	శ్రీవిజయలక్ష్మి	కంచికచర్ల	పివిఆర్ సినీప్లెక్స్
పోరంకి	శ్రీవెంకటకృష్ణ	నందిగామ	లక్ష్మీప్రసన్న
కంకిపాడు	శ్రీవిజయలక్ష్మి	జగ్గయ్యపేట	శ్రీఅలంకార్ సినిమాస్
ఉయ్యూరు	జి3శ్రీనివాస	మైలవరం	సంఘమిత్ర
పామర్రు	శివరామ్	తిరువూరు	వెంకటేశ్వర
కూచిపూడి	సత్యసాయి	విస్సన్నపేట	వెంకటేశ్వర
చల్లపల్లి	సాగర్	గంపలగూడెం	రామమోహన్
అవనిగడ్డ	వెంకటేశ్వర	ఏ.కొండూరు	వెంకటేశ్వర
పెడన	శ్రీకృష్ణతులసి		

HASYA MOVIES release

ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి ● ధరల పెరుగుదలపై మహిళా కాంగ్రెస్ నిరసన



మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో నిరసన

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 20: పెరుగుతున్న ధరలను అదుపు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి అన్నారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవ్వడాన్ని నిరసిస్తూ ఏపీ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తాంతియా కుమారి మాట్లాడుతూ రోజురోజుకూ ధరలు పెరుగుతున్న కారణంగా పేదవాడి జీవితం దుర్భరంగా మారుతోందని, మహిళలు కుటుంబాలను నెట్టుకురావడం కష్టంగా ఉందని అన్నారు. అధిక ధరలతో పేదవాడు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదవాడికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, మహిళలకు రక్షణ లేదని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపో తున్నాయని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనను మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నిరసన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల హరిత, సిటీ మహిళా కాంగ్రెస్ నాయకురాలు మండేపూడి సునీత, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: AT CHOTUPPAL
O.S. NO. 117 OF 2022
Between:
Kota Narsi Reddy ...Plaintiffs
And
Gorripati Vidyadevi ...Defendants
To
Gorripati Vidyadevi D/o. Basaweshwar Rao aged about 37 years R/o. H.No.36-2-15/2 RU, Plot No.302, Rama Krishna Residency, Mogalarajapuram, VIJAYAWADA, Krishna District
NOTICE
General public is hereby informed that the above named plaintiffs filed the above suit for Specific performance of agreement of sale against the defendant. The said case is stands posted to 01.03.2024 for the appearance in the above matter he/she may appear personally or through an Advocate before the Hon'ble Court on 01.03.2024 at 10.30 a.m. and submit their case.
Hence, this Notice.
// BY ORDER OF THE HON'BLE COURT //
DATE: 19-02-2024
Sd/- RAPOLU VENU
ADVOCATE: CHOUTUPPAL
Cell No.70139 76876

టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉపాధి

తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి కిలారు శ్రావణ్

విద్యాధరపురం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 25లక్షల మంది యువత మొదటిసారి ఓటు వేయనున్నారని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి కిలారు శ్రావణ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్ లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ క్రమంలో యువ ఓటర్లకు చైతన్యం కల్పించేందుకు మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 23వేల మంది యువత మొదటిసారి ఓటు వేసే వారు ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల మంది యువత మొదటిసారి ఓటు వేసే వారు ఉన్నారని వీరందరినీ కలిసి చంద్రబాబుకే మొదటి ఓటు వేయాలని కోరనున్నట్లు తెలిపారు. ఓటు ప్రాధాన్యత శక్తిలను తెలియజేయడంతో పాటు ఓటు ద్వారా ఎంత మార్పును తీసుకురావచ్చో కూడా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. లోకేశ్ తన యువగళం పాదయాత్ర ద్వారా యువతను చైతన్యపరిచారన్నారు. రాష్ట్ర యువత కూడా మార్పును కోరుకుంటుందని తెలిపారు. జగన్ పాలనలో యువత పరిస్థితి దౌర్భాగ్య స్థితికి చేరుకుందని తెలిపారు.

ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పొట్లూరు దర్శిత్, పెద్ది శరత్, నాని సుశీల్, మోహిత్, బసవయ్య పాల్గొన్నారు.



మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కిలారు శ్రావణ్

THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: AT CHOTUPPAL
O.S. NO. 116 OF 2022
Between:
Kota Narsi Reddy ...Plaintiffs
And
Gorripati Yamini ...Defendants
To
Gorripati Yamini D/o. Basaweshwar Rao, R/o. H.No.36-2-15/2 RU, Plot No.302, Rama Krishna Residency, Mogalaraja puram, VIJAYAWADA, Krishna District
NOTICE
General public is hereby informed that the above named plaintiffs filed the above suit for Specific performance of agreement of sale against the defendant. The said case is stands posted to 01.03.2024 for the appearance in the above matter he/she may appear personally or through an Advocate before the Hon'ble Court on 01.03.2024 at 10.30 a.m. and submit their case.
Hence, this Notice.
// BY ORDER OF THE HON'BLE COURT //
DATE: 19-02-2024
Sd/- RAPOLU VENU
ADVOCATE: CHOUTUPPAL
Cell No. 70139 76876

THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: AT CHOTUPPAL
O.S. NO. 118 OF 2022
Between:
Kota Narsi Reddy ...Plaintiffs
And
Gorripati Yogitha ...Defendants
To
Gorripati Yogitha D/o. Basaweshwar Rao aged about 36 years R/o. H.No.36-2-15/2 RU, Plot No.302, Rama Krishna Residency, Mogalarajapuram, VIJAYAWADA, Krishna District
NOTICE
General public is hereby informed that the above named plaintiffs filed the above suit for Specific performance of agreement of sale against the defendant. The said case is stands posted to 01.03.2024 for the appearance in the above matter he/she may appear personally or through an Advocate before the Hon'ble Court on 01.03.2024 at 10.30 a.m. and submit their case.
Hence, this Notice.
// BY ORDER OF THE HON'BLE COURT //
DATE: 19-02-2024
Sd/- RAPOLU VENU
ADVOCATE: CHOUTUPPAL
Cell No.70139 76876

కొత్త ఓటర్లు నామినేషన్ చివరి పది రోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

●సెంట్రల్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి స్వప్నిల్ దినకర్



మాట్లాడుతున్న స్వప్నిల్ దినకర్

చిట్టినగర్, ఫిబ్రవరి 20: కొత్త ఓటర్లు నామినేషన్ చివరి పదిరోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని సెంట్రల్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో పలు పార్టీలకు చెందిన నాయకులు ఈనెల 13 నుంచి 19 వరకు వచ్చిన కొత్త ఓటర్లు, మార్పులు, చేర్పులు దరఖాస్తుల వివరాలను కమిషనర్‌కు తెలియజేశారు. కొత్త ఓట్లతోపాటు మార్పులకు సంబంధించిన ఓట్లను ఏఈఆర్‌వోలు తప్పులు దొర్లకుండా సక్రమంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. రాజకీయ పార్టీలు సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను తెలియజేస్తే ఆ బూత్‌లలో సెక్యూరిటీని పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. కొత్త ఓటర్లు నామినేషన్ చివరి పదిరోజుల ముందువరకు దరఖాస్తు చేసుకోవాలని, ఓటర్ కార్డులలో తప్పుఒప్పులను ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చే ముందుకు వరకు సరిచేసుకోవచ్చన్నారు. నవనీతం సాంబశివరావు(టీడీపీ), నాయకులు ఎస్సీ అన్సారీ, వినోద్‌కుమార్, సుందర్‌పాల్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

దమ్ముంటే విజయవాడ అభివృద్ధిపై చర్చకు రా

● కేశినేని శ్రీనివాస్‌కు కేశినేని శివనాథ్ సవాల్



బాధితులకు మందులు అందిస్తున్న కేశినేని శివనాథ్, గద్దె రామ్మోహన్

వన్‌టౌన్, ఫిబ్రవరి 20: దమ్ముంటే విజయవాడ అభివృద్ధిపై కేశినేని శ్రీనివాస్ (నాని) తనతో చర్చకు రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) సవాల్ విసిరారు. క్రీస్తురాజపురంలో మంగళవారం శివనాథ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. 1421 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు, 678 మందికి ఉచితంగా కళ్లజోళ్లను అందించారు. శుక్లాలతో బాధపడే వారికి ఈనెల 27 న ఉయ్యూరు రోటరీ ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయనున్నారు. 176 మందికి గుండె పరీక్షలు, 109 మందికి ప్రసూతి పరీక్షలు, 272 మందికి జనరల్ మెడిసిన్, 59 మందికి ఆర్థో పరీక్షలు 99 మందికి కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాము నిస్వార్థంగా సేవలు చేస్తుంటే కొంతమంది సొల్లువాగుడు వాగుతున్నారన్నారు. చంద్రబాబుకు సవాల్ విసిరే అర్హత, విమర్శించే అర్హత కేశినేని శ్రీనివాస్‌కు లేదన్నారు. విజయవాడ అభివృద్ధిపై దమ్ముంటే తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

● డిప్యూటీ మేయర్ అవుతు శైలజ



దోమల నివారణ చర్యలపై బయాలజిస్టుతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 20 : శివారు ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడు తున్నట్లు డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తెలిపారు. 58వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ మలేరియా విభాగపు అధికారులు మంగళవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. కాలువల్లో ఫాగింగ్ చేసి నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. బయాలజిస్టు సూర్యకుమార్, ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ బెనర్జీ పాల్గొన్నారు.

టీడీపీ- జనసేనలకు ప్రజలే ప్రచార సారథులు

● జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోతిన మహేశ్

విద్యాధరపురం, ఫిబ్రవరి 20: టీడీపీ- జనసేనలకు ప్రజలే ప్రచార సారథులు అని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు మంగళవారం భవానీపురంలోని 42 వ డివిజన్‌లో తిరుపతి సురేష్, అనూష డివిజన్ కమిటీ సభ్యులతో కలసి ఆయన ఇంటింటికి రాబోయే టీడీపీ- జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజలను కలుసుకుని వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక కార్పొరేటర్ ఆలోచనలు దోచుకోవడం, దాచుకోవడంపైనే ఉంటాయన్నారు. అతను సహాయం చేయడానికి బదులు ఉచిత సలహాలు ఇస్తున్నాడన్నారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ఖండించారు. పాత పోలీసుస్టేషన్, ట్రయాంగిల్ పార్కు వద్ద ప్లాట్లలోని వారిని కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఉత్తరకుమారుడి పలుకులు బాలస్వామికి కొత్తకాదు

23వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు



మాట్లాడుతున్న ఆత్మకూరి సుబ్బారావు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 20: ఉత్తరకుమారుడి పలుకులు 23వ డివిజన్ కార్పొరేటర్ బాల స్వామికి కొత్తకాదని, రెండు సార్లు కార్పొరేటర్‌గా గెలిచి, వీఎంసీలో ఫ్లోర్‌లీడర్‌గా వెలగబెడుతున్న బాలస్వామి తన కార్యాలయం ముందు రోడ్డుకూడా వేయించుకోలేని అసమర్థుడని 23వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు (సురేష్) విమర్శించారు. మంగళవారం సూర్యారావుపేటలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడ నుంచైనా పోటీ చేసే హక్కు ఎవరికైనా ఉందని, వెలంపల్లి సెంట్రల్‌కు వస్తే తప్పేమిటని ప్రశ్నించారు. వెలంపల్లి గెలుపు ఖాయం కనుకనే సెంట్రల్‌లోని టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారని, ఆయనపై బురదజల్లేందుకు సిద్ధపడుతున్నారని అన్నారు. బొండా ఉమా మూడుసార్లు పోటీ చేస్తే ఒక్కసారే గెలిచారన్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. సమావేశంలో వైసీపీ లీగల్ సెల్ నాయకులు చావాలి అబ్రహం లింకన్, ఏ. నిరంజన్, స్థానిక నేతలు వడ్డి వాసు, సానికొమ్ము శివారెడ్డి, లాలిబాబు, పసుమర్తి రాజేష్, ఒగ్గు గవాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా వీరమ్మ గ్రామోత్సవం

ఉయ్యూరు, ఫిబ్రవరి 20 : ఉయ్యూరులో మంగళవారం వీరమ్మ గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్లలో భాగంగా ఆదివారం రాత్రి మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారు వేలాదిగా తిరుగుగండ దీపాల భక్తులు వెంట రాగా రాత్రంతా పట్టణ వీధుల్లో ఊరేగారు. తిరుగుగండ దీపాల భక్తు లు అమ్మవారిని స్మరించుకుంటూ మొక్కుబడి తీర్చుకున్నారు. పల్లకిలో ఊరేగుతున్న అమ్మవారికి బిందెలతో నీరు వారబోసి, హారతులతో స్వాగతం పలికారు. పిల్లలు, పెద్దలు అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొని వీరమ్మ నామస్మరణ చేశారు.

శ్రద్ధాంజలి



జననం : 07-08-1938
మరణం : 09-02-2024

శ్రీ కొల్లి వెంకటేశ్వరరావు గారు
Rtd. Irrigation Dept. SE

మీ సుదీర్ఘ జీవన ప్రస్థానంలో ఎన్నో ప్రాజెక్టులను నిర్మించి, రైతులకు ఆదర్శంగా నిలిచి, వెటరన్ ఇరిగేషన్ ఇంజనీర్ గా అవార్డు అందుకున్నారు. మా ఉన్నతికి అహర్నిశలు కృషి చేసి, మమ్ములను ఉన్నత స్థానములో నిలిపిన మీరు లేరన్న నిజం నమ్మలేనిది, మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుతూ..

భార్య : కొల్లి ఝాన్సీలక్ష్మి (లేటు)

కుమారులు - కోడళ్ళు :
కొల్లి శ్రీనివాస్ కుమార్ - లత
కొల్లి సురేష్ కుమార్ - కృష్ణవేణి (లేటు)

మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు

కుమార్తె - అల్లుడు : దండమూడి విజయలక్ష్మి - డా॥ రమేష్ కుమార్

పెద్దకర్మ : ది. 21-02-2024, బుధవారం విజయవాడ గాయత్రీనగర్‌లో జరుగును. సెల్ : 98494 48858, 93934 70848

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

▸ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-181884

▸ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి. ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును స్పాట్ క్యాష్. (100% జెన్యూన్) సంప్ర. సెల్ : 945 945 3338
AJB-181880

WANTED

▸ VJA శ్రీ మురుగన్ ఆఫ్‌సెట్, డిజిటల్ ప్రెస్‌లో పనిచేయుటకు హెల్పర్స్ (M/F) కావలెను. ప్రింటింగ్ రంగంలో అనుభవం గల వారికి ప్రాధాన్యత. సంప్ర & 888 5644 900
AJB-181879

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 290/-
కలర్ 30% EXTRA
కృష్ణలంక : 99854 09587, 1 టౌన్ : 99854 09286
పటమట, పెనమలూరు : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
& 99854 11868, 99854 85777, 99854 11733, 99854 09286, 99854 09587.

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
& సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

బుధవారం • 21 ఫిబ్రవరి 2024

cinema@andhrajyothy.com

విఐ ఆనంద్‌తో అనిల్ సుంకర మరో చిత్రం



'ఊరు పేరు భైరవకోన' చిత్రంతో తాజాగా విజయం పొందిన దర్శకుడు విఐ ఆనంద్‌తో ఆ చిత్ర సమర్పకుడు, నిర్మాత అనిల్ సుంకర మరో సినిమా నిర్మించనున్నారు. ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతూ కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేశారు అనిల్ సుంకర. 'విఐ ఆనంద్ సూపర్ నేచురల్ అడ్వెంచర్స్ చేయడంలో దిట్ట. కొత్త సినిమా కూడా కథ, సెటప్ పరంగా యూనిక్‌గా ఉంబోతోంది. ఇందులో హీరో, మిగిలిన వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, సహ నిర్మాతలు: రాజేశ్ దండా, అజయ్ సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికపాటి, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర.

సవాల్‌గా స్వీకరించా

దీపక్ సరోజ్



పలు తెలుగు చిత్రాల్లో బాల నటుడిగా అలరించిన దీపక్ సరోజ్ ఇప్పుడు 'సిద్ధార్థ్‌రాయ్' చిత్రంతో హీరోగా వెండితెర ఎంట్రీ ఇవ్వబోతున్నారు. యశస్వీ దర్శకత్వంలో ప్రదీప్ పూడి, జయ అడపాక, సుధాకర్ బోయిన నిర్మించారు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా దీపక్ సరోజ్ మీడియాతో ముచ్చటించారు.

- బాల నటుడిగా 'మిణుగురులు' చిత్రంతో నంది పురస్కారం అందుకున్నాను. చదువు పూర్తి అయ్యాక యశస్వీ నన్ను కలసి 'సిద్ధార్థ్ రాయ్' కథ చెప్పారు. కథా నేపథ్యం విని షాక్ అయ్యాను. అసలు ఇలాంటి పాత్ర నేను చేయగలనా అనుకున్నాను. కానీ మా డైరెక్టర్‌ను నమ్మి ముందుకెళ్లాం.
- నాది రొటీన్ హీరోయిజం ఉన్న పాత్ర కాదు. తను చాలా లాజికల్‌గా ఆలోచిస్తాడు. పెద్దగా దేనికీ స్పందించడు. కానీ కొన్ని సందర్భాల్లో చాలా ఎమోషనల్ అవుతాడు. సవాల్‌గా స్వీకరించి ఈ పాత్ర చేశాను.
- 'అర్జున్‌రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో మా సినిమాకు పోలికలు లేవు. రెండు భిన్నమైన కథలు. గౌతమ బుద్ధుని తాత్వికత ప్రతిఫలించేలా ఉంటుంది కాబట్టి 'సిద్ధార్థ్‌రాయ్' అనే టైటిల్ పెట్టాం. హీరోగా మరో రెండు సినిమాలు చేస్తున్నాను.

సైన్యానికి సెల్యూట్ చేసేలా ఉంటుంది



వరుణ్‌తేజ్

'కొత్త కథ చూపించాలనే ఫ్యాషన్‌తో 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. ఈ సినిమా చూశాక ప్రేక్షకులు గర్వంగా, గుండెల నిండా దేశభక్తితో మన సైనికులకు సెల్యూట్ చేస్తారు' అని హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా శక్తి ప్రతాప్‌సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్ కథానాయిక. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం ఈ చిత్రం తెలుగు, హిందీ ట్రైలర్స్‌ను రామ్‌చరణ్, సల్మాన్‌ఖాన్ ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'తెలుగులో ఇదే తొలి ఏరియల్ వార్ డ్రామా. ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురి చేసేలా, అబ్బురపరిచే సన్నివేశాలు ఇందులో చాలా ఉన్నాయి. కచ్చితంగా ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది' అన్నారు. మానుషి చిల్లర్ మాట్లాడుతూ 'ఆపరేషన్ వాలెంటైన్ నాకు చాలా స్పెషల్ మూవీ. షూటింగ్‌లో వరుణ్‌తేజ్ సహకారం మరువలేనిది. నా డ్రీమ్ రోల్‌ను చేశాను' అని తెలిపారు. సమష్టి కృషికి రూపం ఈ సినిమా, యాక్షన్ డ్రామా, ఫన్ ఎమోషన్స్ లాంటి అన్ని ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉన్నాయి అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాలో కీలకమైన పాత్ర చేశాను, విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటాయి అని నవదీప్ తెలిపారు.

డాన్‌కు జోడీగా



అగ్రహీరోలందరి సరసన హీరోయిన్‌గా నటిస్తూ వరుస విజయాలను అందుకుంటున్నారు కియారా అద్వాణీ. మరో భారీ చిత్రంలో ఆమె కథానాయికగా అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. రణ్‌వీర్‌సింగ్ హీరోగా తెరకెక్కుతోన్న 'డాన్ 3' చిత్రంలో కియారా కథానాయికగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ప్రకటించారు. ఈ చిత్రంలో కియారా పాత్ర శక్తిమంతంగా ఉంటుంది, పోరాట ఘట్టాల్లో ఆమె అలరిస్తారు అని మేకర్స్ చెప్పారు. కియారా తొలిసారి రణ్‌వీర్‌తో జోడీ కడుతున్నారు. ఆమె ప్రస్తుతం తెలుగులో రామ్‌చరణ్ తో 'గేమ్ ఛేంజర్' చిత్రం చేస్తున్నారు.

కమెడియన్ కాదు కామిక్ యాక్టర్



హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రుతో కలసి నిర్మించిన చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది. చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "సుందరం మాస్టర్' ట్రైలర్ చాలా బావుంది. హర్షను కమెడియన్ అనడం నాకు నచ్చదు. ఆయనో కామిక్ యాక్టర్. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. కొత్తవాళ్లను ప్రోత్సహిస్తున్న రవితేజకు అభినందనలు' అన్నారు. హర్ష మాట్లాడుతూ 'మా సినిమాకు చిరంజీవి గారు ఇచ్చిన మద్దతు మర్చిపోలేను. పదేళ్ల క్రితం ప్రేక్షకుల మధ్యలో ఉన్న నేను ఇప్పుడు ఇలా వేదికపై ఉన్నాను. మనం గట్టిగా అనుకుంటే ఏదైనా సాధించగలం' అన్నారు. ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అవుతుందో తెలియదు కానీ మా అందరికీ గౌరవాన్ని తీసుకొస్తుంది అని దర్శకుడు చెప్పారు. హర్ష వల్లే మేం ఈ రోజు ఇక్కడ నిలబడగలిగాం, ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది అని సుధీర్ కుమార్ తెలిపారు.

గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారుతారా?

త్రిష అసహనం



తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అన్నాడీఎంకే బహిష్కృత నేత ఏవీ రాజుపై హీరోయిన్ త్రిష మండిపడ్డారు. "గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారిపోయే జీవితాలు కొందరివి... ఇలాంటి నీచమైన మనుషులను చూస్తుంటే చాలా అసహ్యంగా ఉంది. దీనిపై త్వరలోనే న్యాయపరంగా కఠిన చర్యలు కోరతాను " అంటూ ఆమె మంగళవారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇటీవల ఏవీ రాజు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఓ ఎమ్మెల్యే హీరోయిన్ త్రిషకు డబ్బులిచ్చి కూవత్తూరు పంచాయతీ లోని ఓ రిసార్ట్‌కు తీసుకొచ్చారని, ఈ విషయం నటుడు, మాజీ ఎమ్మెల్యే కరుణాస్‌కు తెలుసని అన్నారు. ఈ వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపుతున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా త్రిషపై అసభ్యంగా మాట్లాడిన ఏవీ రాజును అరెస్టు చేయాలని నటుడు, దర్శకుడు చేరన్ డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా బహిరంగంగా సినీ పరిశ్రమలోని సభ్యులు కించపరిచేలా మాట్లాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, ప్రధాన కార్యదర్శి బీఎస్ స్వామినాథన్ సంయుక్తంగా విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

రెండు ఫ్లాట్స్ కొన్న మృణాల్



'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందిన బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీ స్టార్' లో నటిస్తోంది. అలాగే కొన్ని బాలీవుడ్ చిత్రాల్లో కూడా నటిస్తూ బిజీగా ఉంది. దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి.. అనే పెద్దల మాటను ఆచరణలో పెడుతూ ఆమె ఇటీవల ముంబైలోని అంధేరి వెస్ట్‌లో ఓబరాయ్ స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్‌లో ఖరీదైన ఫ్లాట్లు రెండు కొనుగోలు చేసింది. ఒక్కో ఫ్లాట్



ఉత్కంఠ పెంచి వినోదం పంచేలా



అర్జున్ కల్యాణ్, కుషిత్ కల్లపు హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'బాబు నంబర్ వన్ బుల్‌షిట్ గై'. లక్ష్మణవర్మ దర్శకత్వంలో దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. మార్చి 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అర్జున్ కల్యాణ్ మాట్లాడుతూ 'హీరోగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది. థ్రిల్లర్, డ్రామా ఉన్న కథతో మూడు భాషల్లో తెరకెక్కించాం' అని తెలిపారు. 'దిలీప్‌గారు రాజీ పడకుండా సినిమాను నిర్మించారు. ఉత్కంఠ కలిగించడంతో పాటు వినోదం పంచేలా ఉంటుంది. నటీనటులు, టీమ్ అంతా చాలా కష్టపడి ఒక మంచి సినిమాను రూపొందించాం. మా సినిమాను ఆదరించాలి' అని దర్శకుడు ప్రేక్షకులను కోరారు. కుటుంబంతో కలసి చూసేలా ఈ సినిమా ఉంటుందని కుషిత చెప్పారు. దర్శకుడు సాయిరాజేశ్, నిర్మాత ఎస్కేఎన్, వికేక్ కూచిబొట్ల ముఖ్య అతిథులుగా పాల్గొని సినిమా ఘనవిజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

లవ్ రొమాంటిక్ థ్రిల్లర్




మేఘశ్యామ్, రేఖ నిరోషా జంటగా రూపుదిద్దుకొన్న 'వాస్తవం' చిత్రం విడుదలకు సిద్ధమైంది. జీవన్ బండి దర్శకత్వంలో ఆదిత్య ముద్గల్ ఈ సినిమా నిర్మించారు. మంగళవారం టీజర్‌ను విడుదల చేసిన అనంతరం నిర్మాత మాట్లాడుతూ 'లవ్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా చిత్రం రూపుదిద్దుకుంది. సినిమా మీద ఇష్టంతో చాలా కష్టపడి తీశాం. ప్రేక్షకుల ఆశీస్సులు కోరుకుంటున్నాం' అన్నారు. 'ఈ సినిమాలో ప్రతి చిన్న క్యారెక్టర్ గుర్తుండి పోతుంది. అందరి సహకారంతో మంచి సినిమా తీశాను. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు దర్శకుడు. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించి, హిట్ చేయాలని హీరో మేఘశ్యామ్, హీరోయిన్ రేఖ నిరోషా కోరారు.

మెప్పించే ముఖ్య గమనిక

విరాన్ ముత్తంశెట్టి, లావణ్య జంటగా నటించిన చిత్రం 'ముఖ్య గమనిక'. వేణు మురళీధర్ వి. దర్శకత్వంలో రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించారు. ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు



ముఖ్య అతిథిగా హాజరైన హీరో విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'కుటుంబ నేపథ్యాన్ని పక్కనపెట్టి తన కష్టంతో పైకి రావాలనుకుంటున్నాడు విరాన్. ఈ సినిమాతో ఆయన సక్సెస్ కొట్టాలి' అని ఆకాంక్షించారు. విరాన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. అల్లు అర్జున్ నాకు అందించిన సహకారం మరువలేనిది' అన్నారు. వేణు మురళీధర్ మాట్లాడుతూ 'విరాన్, లావణ్య జంట ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ. కిరణ్ సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు.



ఫ్యాషన్

మోడర్న్ 'ఇయర్ రింగ్స్'!



హ్యాంగింగ్స్ లేదంటే స్టడ్స్... ఇంతకంటే ఇయర్ జ్యువెలరీలో వెరైటీలేముంటాయి? అని అమ్మాయిలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఊహకందని మోడర్న్ ఇయర్ రింగ్స్ మార్కెట్లోకొచ్చేశాయి. డ్రెస్సింగ్ స్టయిల్, డిజైన్‌కి తగ్గ ఈ మోడర్న్ ఇయర్ రింగ్స్ పెట్టుకుంటే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ కచ్చితంగా మీరే!







ఇయర్ జాకెట్స్: చెవి తమ్మె ముందూ వెనకా రెండు వైపులా ఫిక్స్ అయిపోయే ఈ రకం కమ్మలు ఇప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్. ముందు వైపు చిన్న స్టడ్ ఉంటే దానికి అటాచ్‌మెంట్‌గా వెనకవైపు కొంచెం పెద్ద సైజు స్టడ్ ఉండే వెరైటీ ఇయర్ రింగ్స్ ఇవి. చెవికి తొడిగినట్టుగా రెండు వైపులా కనిపిస్తాయి కాబట్టే ఈ చెవి పోగులకు ఇయర్ జాకెట్స్ అని పేరు.



డబుల్ సైడెడ్ ఇయర్ రింగ్స్: వెనకది ముందుకు, ముందుది వెనక్కి మార్చి మార్చి పెట్టుకునే వీలుండేలా తయారైన ఇయర్ రింగ్స్ ఇవి. డ్రస్‌కి నప్పేట్టుగా, స్టయిల్‌కి తగ్గట్టుగా ఒకే ఇయర్ రింగ్‌ని మార్చుకునే వీలుంది కాబట్టే వీటికి డబుల్ సైడెడ్ ఇయర్ రింగ్స్ అని పేరు.

ఫ్రంట్ బ్యాక్ ఇయర్ రింగ్స్: చెవి పోగు వెనకుండే హుక్కు ఆకర్షణ తెచ్చిపెట్టే ఈ రకం ఇయర్ రింగ్స్ చూడముచ్చటగా ఉంటాయి. కమ్మతోపాటు వెనకవైపుంటే హుక్ పెట్టుకున్నప్పుడు ఓ బొమ్మ లేదా ఓ ఆకారం కనిపించటం ఫ్రంట్ బ్యాక్ ఇయర్ రింగ్స్ ప్రత్యేకత.



ఇయర్ కఫ్స్: చెవులు మరింత ఆకర్షణీయంగా కనిపించాలంటే చెవి మొత్తాన్ని కవర్ చేసే ఆభరణం పెట్టుకోవాలి. ఈ ఐడియాతో తయారైనవే ఇయర్ కఫ్స్. చూడటానికి కాస్త పెద్దవిగా చెవి మొత్తాన్ని కవర్ చేసే ఇయర్ కఫ్స్ ఎన్నో వెరైటీ మెటీరియల్స్ డిజైన్స్‌తో తయారవుతాయి.

అభిరుచి

మనదైన ఆహార సంస్కృతి కోసం..

"మన ఆహారం మన సంస్కృతిలో భాగం... దానికి దూరమైతే మనల్ని మనం పోగొట్టుకున్నట్టే" అంటారు అరుణా టిర్కీ. ఉన్నతోద్యోగాన్ని మానేసి, రెస్టారెంట్ తెరిచి, ఆదివాసీ ఆహార సంస్కృతి పరిరక్షణకు ఆమె పాటుపడుతున్నారు. విదేశాల్లో సైతం భారతీయ గిరిజన వంటకాల్ని రుచి చూపిస్తున్న నలభై తొమ్మిదేళ్ళ అరుణ కథ ఇది...

"ఇది తొమ్మిదేళ్ళ క్రితం మాట. అప్పట్లో ఐక్యరాజ్యసమితి (యుఎన్)కి అనుబంధంగా... రాష్ట్రస్థాయిలో కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను. ఆ బాధ్యతల్లో భాగంగా దేశమంతా పర్యటించేదాన్ని. నేను కలిసిన చాలామంది వ్యక్తులు మా స్థానిక ఆహార రుచుల గురించి అడిగేవారు. నేను జార్ఖండ్‌లోని ఓరాన్ తెగకి చెందినదాన్ని. నా చిన్నప్పుడు మా ప్రాంతంలో ఏ ఇంటికి వెళ్ళినా స్థానికమైన సంప్రదాయ



ఆహారం కనిపించేది. మేమూ ఇష్టంగా వాటినే తినేవాళ్ళం. మా అమ్మ చేపలు పట్టి తెస్తే... నాన్న ఆకు కూరల్ని, కూరగాయల్నీ స్వయంగా పండించేవారు. దాదాపు గిరిజన కుటుంబాలన్నీ ఇలాగే చేసేవి. కాలక్రమేణా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. వాటిని తయారు చేసేవారి సంగతి దేవుడెరుగు... తలచుకొనేవారే కరువైపోయారు. అలాంటి పరిస్థితుల్లో... మీ గిరిజన తెగకు ప్రత్యేకమైన ఆహారం ఏవి ఉంటాయి? అంటే ఏం చెప్పాలి? అది చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. ఈ విషయం గురించి ఆలోచించినప్పుడు... ఎన్నో గిరిజన తెగలు తమ వంటకాల మీద ఆసక్తి కోల్పోతున్నారని అర్థమయింది. ప్రతి ప్రాంతానికీ కొన్ని విలక్షణమైన ఆహారపు అలవాట్లు ఉంటాయి. అవి అక్కడి ప్రజల సంస్కృతిలో భాగం. అంతేకాదు... మనం ఉండే ప్రాంతంలో వాతావరణానికి తగినట్టు, స్థానికంగా పండే వాటితో పూర్వం ఆహారం ఉండేది. అది ఆరోగ్యప్రదం కూడా. ఇప్పుడు అన్ని చోట్లా అన్ని రుచులూ దొరుకుతూ ఉండడంతో... వాటి పట్ల జనం ఆకర్షితులవుతున్నారు. కొత్త తరం వాళ్ళకు ఇంటి భోజనం నచ్చడం లేదు. మన వాతావరణానికి అనువుకాని ఆహారమే అనేక జీవనశైలి వ్యాధులకు కారణమవుతోంది. 'ఈ తరానికి సంప్రదాయ ఆహారం విలువను తెలియజెయ్యాలి. ప్రతి గిరిజన గృహంలో వాటిని మళ్ళీ భాగం చెయ్యాలి' అని నిర్ణయించుకున్నాను. అంతరించిపోతున్న వంటలు, వాటి తయారీ పద్ధతుల గురించి వివరాలు సేకరించడంతో ఆ పని ప్రారంభించాను. దానికోసం ఎన్నో గ్రామాలు

> ఉద్యోగం నాకు దేశంలోని వివిధ ప్రాంతాలను పరిచయం చేస్తే... గిరిజన వంటకాల పునరుద్ధరణ ఇటలీ, తైవాన్, జపాన్ దేశాలకు తీసుకువెళ్ళింది. ఆ దేశాల్లో నిర్వహించిన వివిధ ఆదివాసీ ఉత్సవాల్లో మా వంటకాలు ప్రదర్శించాం. మా రెగ్యులర్ కస్టమర్లలో గిరిజనేతరులు కూడా ఎంతోమంది ఉన్నారు. పదిహేనేళ్ళపాటు జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆదివాసీలతో కలిసి పని చేశాను.



తిరిగాను. ఎందరినో కలిశాను. వారికి గుర్తున్న వంటలన్నిటినీ నమోదు చేసుకున్నాను. మా ఇంట్లోనే ప్రయోగాలు చేశాను. అన్నీ కుదిరాయనిపించిన తరువాత 2016లో రాంచీలో జరిగిన 'అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం'లో... ఒక స్టాల్ ఏర్పాటు చేసి, ఆ వంటలను ప్రదర్శించాను. వాటి ప్రత్యేకతను వివరించాను. దానికి నేను ఊహించనంత స్పందన వచ్చింది. సాధారణ ప్రజలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ రుచులను మెచ్చుకున్నారు. వాటిని వండే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అప్పుడు జరిగిన గిరిజన వంటకాల పోటీలో... మొదటి బహుమతి నాకే వచ్చింది. ఇది నాకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది.

రుచిగా, ఆరోగ్యంగా...

కేవలం గిరిజన వంటకాలతో ఒక రెస్టారెంట్ తెరిస్తే బాగుణ్ణనిపించింది. రెండేళ్ళపాటు డబ్బు కూడబెట్టాను. 2018లో... ఉద్యోగాన్ని వదిలేసి, రాంచీలో రెస్టారెంట్ ప్రారంభించాను. దాని పేరు 'అజెమ్ ఎంబా'. అంటే 'గొప్ప రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారం' అని అర్థం. మొదట్లో ఓరాన్, ముండా తెగల గిరిజన కుటుంబాలతో వండించి తెచ్చి విక్రయించేవాళ్ళం. ఆ తరువాత సొంత కిచెన్ ఏర్పాటు చేశాను. ఉద్యోగం వదిలేసి... పూర్తి సమయాన్ని రెస్టారెంట్ కోసమే కేటాయిస్తున్నాను. మా రెస్టారెంట్ పూర్తి పర్యావరణ అనుకూలంగా ఉంటుంది. అక్కడ వంట నుంచి వడ్డనల వరకూ అన్ని పనులూ గిరిజన మహిళలే చేస్తారు. సేంద్రియమైన దినుసుల్ని అటవీ ప్రాంతాల నుంచి సేకరించి తీసుకువచ్చేవాళ్ళం. యువతను ఆకర్షించడం కోసం మాండ్వా మొమోల్లాంటి వాటితో సహా... నాలుగు తెగలకు చెందిన ఇరవైకి పైగా రుచులను ప్రస్తుతం అందిస్తున్నాం. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా పాతికమందికి పైగా స్థానికులకు ఉపాధి కల్పించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ఉద్యోగం నాకు దేశంలోని వివిధ ప్రాంతాలను పరిచయం చేస్తే... గిరిజన వంటకాల పునరుద్ధరణ ఇటలీ, తైవాన్, జపాన్ దేశాలకు తీసుకువెళ్ళింది. ఆ దేశాల్లో నిర్వహించిన వివిధ ఆదివాసీ ఉత్సవాల్లో మా వంటకాలు ప్రదర్శించాం. మా రెగ్యులర్ కస్టమర్లలో గిరిజనేతరులు కూడా ఎంతోమంది ఉన్నారు. గ్రామీణాభివృద్ధిలో పీజీ డిప్లమా చేసిన నేను పదిహేనేళ్ళపాటు జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆదివాసీలతో కలిసి పని చేశాను. అనేక ఐరాస ప్రాజెక్టుల్లో భాగస్వామినయ్యాను. వాటన్నిటికన్నా ప్రస్తుతం చేస్తున్న పనిని చాలా ఆస్వాదిస్తున్నాను. దాదాపు నూట యాభై దేశాల్లో స్థానిక ఆహారాలను, సంప్రదాయ వంట పద్ధతులను ప్రోత్సహిస్తున్న 'స్లో ఫుడ్' సంస్థలో సభ్యురాలుగా ఉన్నాను. వివిధ దేశాలకు మా ప్రాంత గిరిజన రుచుల్ని పరిచయం చేస్తున్నాను. సంప్రదాయ ఆహారాన్ని ఆదరించేవారు ఎప్పుడూ ఉంటారనేది నేను తెలుసుకున్న పాఠం. సరైన ప్రచారం, మార్కెటింగ్ ఉంటే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల పోటీ తట్టుకోవచ్చు. వీలైనన్ని గిరిజన వంటకాలను పునరుద్ధరించడం, జార్ఖండ్ బయట కూడా వాటికి ప్రాచుర్యం కల్పించడం, మరింతమంది గిరిజన మహిళలకు ఉపాధి కల్పించడం... ఇవీ నా లక్ష్యాలు."



పుస్తకాలంటే ఆమెకు ఇష్టం. కాదు కాదు.. ప్రాణం. అందుకే ఇంటినే గ్రంథాలయంగా మలిచారు. 'లీడ్ చిల్డ్రన్ లైబ్రరీ' కోసం... ఏకంగా తన ఒంటిమీద ఉండే ఆరు తులాల బంగారు ఆభరణాల్ని అమ్మేశారు. తాను సైతం అంటూ... పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగును నింపటానికి అడుగులేస్తున్న కాసుల శోభారాణిని 'నవ్య' పలకరించింది.

గ్రంథాలయం కోసం... బంగారాన్నే అమ్మేశారు!

"మా ఇంటికొచ్చి డబ్బులు, బొకేలు, శాలువాలు ఇస్తే పెద్దగా పట్టించుకోం. మంచి పుస్తకాలు ఇస్తే గొప్పగా ఫీలవుతా. ఇంట్లో పని చేసుకుని.. మా వారు ఉద్యోగానికి.. మా ఇద్దరు పిల్లలను బడికి పంపించిన తర్వాత అధిక సమయం గ్రంథాలయాలు, వాటి నిర్వహణకే కేటాయిస్తా. ఈ పుస్తకాల పిచ్చి ఇప్పటిది మాత్రం కాదు! పేజీలను కాస్త వెనక్కి తిప్పాల్సిందే.

అందుకే పుస్తకాలంటే ఇష్టం..

మా తాతయ్య మాత్రం ఎంచక్కా ఓ గదిలో ప్రశాంతంగా కూర్చుని.. కథలు, నవలలు, మనో వికాస పుస్తకాలు చదివేవారు. తాతయ్య ఆర్ఎమ్‌పీ డాక్టర్‌గా పని చేసేవారు. అయినా.. ఏంటో తాతయ్యకు పుస్తకాల పిచ్చి అనుకునేదాన్ని. ఆయనకు ఖాళీ దొరికినప్పుడు పుస్తకాల గురించి నాతో చెప్పేవారు. అలా నాకు పుస్తకాలపై మక్కువ పెరిగింది. ఆ తర్వాత మా వారి వల్ల పుస్తకాలపై ప్రేమ కలిగింది. వాస్తవానికి నేను నర్సింగ్ చేశా. మా వారు ఏ సహకారం లేకున్నా.. ఎంతో కష్టపడి చదివి ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయ్యారు. నలుగురికీ ఆదర్శంగా నిలిచారు. ఆయన తీరు, ఆలోచనలంటే ఇష్టపడ్డాను. సమాజానికి ఏదైనా చేయాలనే తలంపును చూసి.. ఆయనతో కలసి నడవాలనుకున్నా. గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఆలోచన, స్ఫూర్తి మా జీవితానుభవం నుంచే వచ్చింది.

ఇంటినుంచే తొలి అడుగు..

విద్య అందరికీ అందాలనేది మా ఆలోచన. ముఖ్యంగా పేద పిల్లలకు పుస్తకాలు కొనే స్తోమత ఉండదు. వారు లైబ్రరీల్లో ప్రశాంతంగా చదువుకోవాలి. పోటీ పరీక్షల్లో నెగ్గి మంచి భవిష్యత్ వైపు నడవగలరు. అందుకే 2019లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలనుకున్నాం. ఎక్కడో ఎందుకూ.. వరంగల్‌లోని నర్సంపేటలో ఉండే మా ఇంటినే పునాదిగా చేసుకున్నాం. ఇంటినుంచే తొలి అడుగు ప్రారంభించాం. పదివేల పుస్తకాలతో ఇల్లే గ్రంథాలయం అయ్యింది. కథల పుస్తకాలు, నీతి పుస్తకాలు, ఇంగ్లీషు పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యేవారికి అకడమిక్ పుస్తకాలు అందుబాటులో ఉంచాం. ఒకవైపు అధిక సంఖ్యలో పుస్తకాలు.. చదువుకోవాలని వచ్చిన వారికి ఇబ్బంది ఉండేది. దీంతో నూతన భవనం నిర్మించాలనుకున్నారు మా వారు. అయితే 'ఇపుడు ఆర్థికంగా కష్టమే' అన్నారు.. ఒకరోజు మాటల్లో! ఏ మాత్రం ఆలోచించకుండా.. నా ఒంటి మీద ఉండే ఆరు తులాల బంగారాన్ని మా వారికి ఇచ్చాను. 'నీకు ఇబ్బందేమో' అన్నారు. 'డబ్బులు వచ్చినప్పుడు మళ్లీ కొనివ్వు' అన్నానంతే. ఇది విని.. కొందరేమో 'గీ పుస్తకాల పిచ్చి ఏందీ?' అన్నారు. నేను అవేమీ పట్టించుకోలేదు. గ్రంథాలయం కోసం త్వరగా ఓ నూతన భవనం ప్రారంభించామంతే.

అదే నా కల..

మా ఇద్దరితో పాటు పిల్లలూ మా ఆలోచనలో భాగస్వాములయ్యారు. మరిన్ని గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు అడుగులేశాం. ములుగు, నాగులపల్లి, సూర్యాపేట తండా, మేడపల్లి.. ఇలా వరంగల్ ప్రాంతంలోని దాదాపు ఇరవై రెండు గ్రామాల్లో ఇరవై ఐదు గ్రంథాలయాలు నెలకొల్పాం. చాలా వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నెలకొల్పాం. గ్రంథాలయాలు ఏర్పాటు చేసి ఊరుకోకుండా.. వాటి నిర్వహణకోసం సమయాన్ని వెచ్చిస్తా. ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు జత చేస్తుంటాం. నేను నర్సింగ్ చదివాను. చదివే పిల్లలను చూశాక.. నేనూ మళ్లీ చదవాలనుకున్నా. అందుకే ఎల్.ఎల్.బీ. జాయిన్ అయ్యా. ప్రతి ఊరిలో ఓ లైబ్రరీ ఉండాలి. ఆ మాటకొస్తే ప్రతి ఇంట్లో ఓ లైబ్రరీ ఉండాలంటాన్నేను. ఈ మధ్యకాలంలోనే 'హగ్ ఎ బుక్' అనే ఉద్యమాన్ని ప్రారంభించాం. ఈ ఏడాది మరో పది గ్రంథాలయాలు నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సమాజానికి వీలైనంతగా సేవ చేయాలన్నదే ఆలోచన. బాగా చదివి.. జడ్జి కావాలన్నదే నా కల.



> మా ఆయన పేరు కాసుల రవికుమార్. ప్రభుత్వ పాఠశాల (ములుగు) ఉపాధ్యాయుడు. తన జీతంలో 33 శాతం గ్రంథాలయాలకే వెచ్చిస్తారు. పదిమంది పిల్లలకు సేవ చేస్తున్నామనే భావన మాకు గొప్పగా అనిపిస్తుంది. మా ఇంట్లోని గ్రంథాలయం ఎప్పుడూ తెరిచే ఉంటుంది. పలు గ్రామాల్లో గ్రంథాలయాలకు వచ్చి చదివే పిల్లలకు వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు పెడుతుంటాం. పిల్లల మనో వికాసానికి సంబంధించిన కార్యక్రమాలు చేస్తుంటాను. ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులతో పాటు పోక్సో చట్టం మీద అవగాహన కల్పిస్తుంటా. మా దగ్గర చదువుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు విదేశాల్లోనూ ఉద్యోగాలు చేస్తున్నారు. మేం ఎవరి దగ్గరా.. డబ్బులు తీసుకోం. మంచి పుస్తకాలిస్తేనే తీసుకుంటాం. ఎవరైనా హైదరాబాద్‌లో పుస్తకాలున్నాయంటే.. వరంగల్ నుంచి వెళ్లి మరీ తెచ్చుకుంటాం. ఇదీ పుస్తకాలకు మేం ఇచ్చే విలువ!

● రాళ్లపల్లి రాజావలి



యోగా

బద్ధకం వదలాలంటే..

ఉదయాన్నే నిద్ర లేచిన వెంటనే ఒళ్లు విరుచుకుంటాం! ఎక్కువ సమయం పాటు కుర్చీలో కూర్చుని లేచినా, ఇలాగే చేస్తాం! అనాలోచితంగా చేసే ఈ చర్యతో శరీరంలోని కండరాలు వదులై, మెదడు చురుకుగా మారుతుంది. అయితే ఇదే ఫలితాన్ని ఇచ్చే యోగాసనాలు కూడా ఉన్నాయి!

● **బాలాసనం**

పసిపిల్లలను పోలిన ఈ భంగిమతో పిరుదులు, పిక్కలు, తొడలతో పాటు, ఉదరం దగ్గర కండరాలు సాగుతాయి.

● **త్రికోణాసనం**

నడుము కింది భాగం, కాళ్లలోని కండరాలు స్ట్రెచ్ అవుతాయి. ఎక్కువ సమయం పాటు ముడుచుకుని ఉన్న కాళ్లకు రక్తప్రసరణ మెరుగవుతుంది.

● **అదోముఖ శవాసనం**

ఈ ఆసనంతో ఉదరం, భుజాలు, ఛాతీ దగ్గరి కండరాలు సాగుతాయి. ఛాతీ ప్రదేశంలో పట్టేసినట్టు అనిపించే భావన తొలుగుతుంది.



స్ఫూర్తి

తిరువణ్ణామలై జిల్లా... పులియూర్ గ్రామం... తమిళనాడులోనే అత్యంత వెనుకబడిన గిరిజన ప్రాంతం. కనీస వసతులు కూడా లేని ఆ గ్రామం నుంచి ఓ మహిళ సివిల్ జడ్జి అయ్యారు. ప్రసవం అయిన రెండు రోజులకే పోటీ పరీక్ష రాసి... విజయం సాధించిన ఆమె... ఆ రాష్ట్రంలోనే ఈ ఘనత సాధించిన తొలి గిరిజన మహిళగా చరిత్ర సృష్టించారు. ఆవిడే 23 ఏళ్ల ఎం.శ్రీపతి.



సంకల్పమే బలం

బాగా చదువుకొని... ఉన్నత స్థానంలో నిలవాలన్నది శ్రీపతి చిన్ననాటి కల. కానీ ఎక్కడో విసిరేసినట్టుండే కొండ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఆమె ఆకాంక్ష నెరవేరాలంటే... ఎన్నో సవాళ్లను అధిగమించాలి. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడాలి. నిరుపేద గిరిజన తెగకు చెందిన శ్రీపతి కుటుంబానికి ఆమెను చదివించడమంటే తలకు మించిన భారం. అయినా ఆమె వెనకడుగు వేయలేదు. 'ఊహ తెలిసినప్పటి నుంచి మేం పేదరికంలోనే మగ్గుతున్నాం. నా చుట్టూ బడికి పోవాల్సిన పిల్లలు పనులకు వెళుతున్నారు. ఇది నన్ను కలవరపెట్టింది. ఈ పరిస్థితి మారాలంటే దానికి ఏకైక మార్గం చదువు మాత్రమే. అందుకే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బడి మానలేదు' అంటున్న శ్రీపతికి చిన్న వయసులోనే పెళ్లి చేశారు పెద్దలు.

పెళ్లి తరువాత కూడా ఆమె చదువుకు బ్రేక్ వేయలేదు. భర్త, అత్తమామలు, ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే కాలేజీకి వెళ్లారు. సమీప గ్రామంలో బీఏ పూర్తి చేసిన శ్రీపతి... ఆ తరువాత బ్యాచులర్ ఆఫ్ లాలో ఉత్తీర్ణులయ్యారు. సివిల్ జడ్జ్ కావాలనే లక్ష్యంతో 'తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్' (టీఎన్‌పీఎస్‌సీ) పరీక్షలు రాయాలని నిర్ణయించుకున్నారు. దాని కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. టీఎన్‌పీఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే అప్పటికి ఆమె నిండు గర్భిణి.

'ఇక్కడే నాకు ఊహించని పరిస్థితి ఎదురైంది. నాకు డాక్టర్ ఇచ్చిన డెలివరీ తేదీ, టీఎన్‌పీఎస్‌సీ సివిల్ జడ్జి పరీక్ష తేదీ పక్కపక్కనే అయ్యాయి. దీంతో ఏంచేయాలో తోచలేదు. పరీక్ష రాయాలంటే చెన్నై వెళ్లాలి. మా ఊరికి రెండొందల కిలోమీటర్ల దూరం. నేనేమో నిండు గర్భిణిని. అంత దూరం ప్రయాణం చేయడం శ్రేయస్కరం కాదని అందరూ చెప్పారు. అలాగని వదిలేస్తే నేను ఎన్నో ఏళ్లుగా పడిన శ్రమకు, కన్న కలలకు అర్థం ఉండదు. ఏంచేయాలి? ఆలోచిస్తుంటే నా భర్త నాకు భరోసా ఇచ్చారు. దాంతో నాకు ధైర్యం వచ్చింది. ఎలాగైనా సరే... పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నా' అంటూ చెప్పుకొచ్చారు శ్రీపతి.



పరీక్ష తేదీ దగ్గరపడుతోంది. ఇప్పుడు తను ఒక్కతే కాదు... కడుపులో ఉన్న తన బిడ్డ కోసం కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. మరోవైపు పరీక్షకు సన్నద్ధమవ్వాలి. కానీ దానికి ముందే మరో పెద్ద పరీక్ష ఎదురైంది ఆమెకు. సరిగ్గా పరీక్షకు రెండు రోజుల ముందు బిడ్డకు జన్మనిచ్చారు. నిండు చూలాలు. రెండొందల కిలోమీటర్లు ప్రయాణించడం శ్రేయస్కరం కాదని తెలుసు. ఎవరు వద్దన్నా ఆమె వినలేదు. ఓపిక కూడగట్టుకుని... గత సంవత్సరం నవంబర్‌లో చెన్నై వెళ్లి పరీక్ష రాశారు. ఇటీవలే వాటి ఫలితాలు విడుదలయ్యాయి. అందులో విజయం సాధించారు శ్రీపతి. తద్వారా తమిళనాడులోనే సివిల్ జడ్జ్ అయిన తొలి గిరిజన మహిళగా నవ చరితకు నాంది పలికారు. 'ఎలాంటి సౌకర్యాలూ లేని కొండ ప్రాంతం నుంచి వచ్చిన శ్రీపతి సాధించిన విజయం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆమెకు మద్దతుగా నిలిచిన ఆమె భర్త, కుటుంబాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నా' అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ట్వీట్ చేశారు. టీఎన్‌పీఎస్‌సీ కార్యాలయం ముంగిట చంటి బిడ్డతో నిలబడిన శ్రీపతి ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

విదేశాల్లో చదువుకునే దేశీ విద్యార్థుల కోసం
గ్లోబల్ స్టూడెంట్ హెల్త్‌కేర్ ప్లాన్

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్.. విదేశీ విద్యకు వెళ్లే దేశీ విద్యార్థుల కోసం గ్లోబల్ స్టూడెంట్ హెల్త్‌కేర్ ప్లాన్ పేరిట ఒక ప్రత్యేకమైన పాలసీ తీసుకువచ్చింది. ఇది క్యాష్‌లెస్ హెల్త్ పాలసీ. దీని ప్రీమియం కూడా డాలర్లలో చెల్లించవచ్చు. 12-40 వయోశ్రేణిలోని వారి కోసం ఈ హెల్త్‌కేర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో నాలుగు ఆప్షన్లుంటాయి. 30 లక్షల డాలర్ల వరకు ఇది కవరేజీ కల్పిస్తుంది. 3 నెలల నుంచి ఏడాది కాలానికి పాలసీ టర్మ్‌ను ఎంచుకోవచ్చు. నెట్‌వర్క్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, వైద్యులు, వృత్తినిపుణుల సేవలను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంచడం ద్వారా పాలసీదారుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను ఇది తీర్చగలుగుతుంది. ఇది డెంటల్ కవరేజీ, వైద్యుల హోమ్ విజిట్లు, ప్రత్యామ్నాయ ఔషధాలు వంటి సేవలు కూడా ఇది అందిస్తుంది.

నియామకాల జోరు తగ్గదు..




వర్క్ ఫ్రమ్ హోమ్ కుదరదు
టీసీఎస్ సీఈఓ కృతివాసన్

ముంబై: నియామకాల జోరు తగ్గిస్తున్నామన్న వార్తలను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తోసిపుచ్చింది. అలాంటి ఆలోచనే లేదని కంపెనీ సీఈఓ కృతివాసన్ నాస్కామ్ నిర్వహించిన ఒక సదస్సులో స్పష్టం చేశారు. కాకపోతే డిమాండ్‌ను బట్టి నియామకాల ప్రక్రియలో మార్పు ఉండొచ్చని తెలిపారు. ఆర్థిక వ్యవస్థలు కోలుకుంటున్న సూచనలు కనిపిస్తున్నందున, పని చేసేందుకు మరింత మంది ఉద్యోగులు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం టీసీఎస్‌లో 6 లక్షల మంది ఉద్యోగులుండగా అందులో 35.7 శాతం మంది (2 లక్షలకు పైగా) మహిళలేనని ఆయన చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఐటీ పరిశ్రమ కొత్తగా 60,000 మందిని చేర్చుకోవచ్చని గత వారం విడుదల చేసిన నివేదికలో నాస్కామ్ పేర్కొంది.

ఆఫీసుకు రావాల్సిందే: తమ కంపెనీలో పని చేసే ఉద్యోగులు ఇంకా ఇంటి నుంచే పని (డబ్ల్యూఎఫ్‌హెచ్) చేస్తామంటే కుదరదని టీసీఎస్ సీఈఓ స్పష్టం చేశారు. ఇంటి నుంచే పని చేస్తే జూనియర్లు సీనియర్ల నుంచి పని ఎలా నేర్చుకుంటారని ఆయన ప్రశ్నించారు. తమ ఉద్యోగుల్లో 40 శాతం మంది ఆఫీసుకు వచ్చి పని చేస్తున్నట్టు తెలిపారు. తమ క్లయింట్ కంపెనీల్లో అయితే నూటికి నూరు శాతం ఉద్యోగులు ఆఫీసుకు వచ్చి పని చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) ఎంతగా ఎదిగినా మానవ మేధకు ప్రత్యామ్నాయం కాదన్నారు. క్రియాశీలక, వ్యూహాత్మక ఆలోచన ఏఐతో సాధ్యం కాదన్నారు. కాకపోతే మానవ ఆలోచనా నైపుణ్యాలకు ఏఐ కొంత వరకు సాయపడుతుందన్నారు.

2027 నాటికి
రూ.1.41 లక్షల కోట్లు
భారత ఏఐ మార్కెట్‌పై నాస్కామ్-బీసీజీ అంచనా



ముంబై: దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) మార్కెట్ 25-35 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)తో అభివృద్ధి చెందుతున్నదని.. 2027 నాటికి భారత ఏఐ మార్కెట్ పరిమాణం 1,700 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.41 లక్షల కోట్లు) స్థాయికి చేరుకోవచ్చుని ఓ రిపోర్టు అంచనా వేసింది. కంపెనీలు ఆధునిక సాంకేతికత కోసం భారీగా వెచ్చిస్తుండటం, దేశీయంగా ఏఐ నిపుణులతోపాటు ఏఐలో పెట్టుబడులు వేగంగా పెరుగుతుండటం వంటి పలు అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయని నివేదిక పేర్కొంది. ఐటీ రంగ అసోసియేషన్ నాస్కామ్, బీసీజీ సంయుక్తంగా రూపొందించిన ఈ నివేదికను నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరమ్ సదస్సులో మంగళవారం విడుదల చేశారు. మరిన్ని విషయాలు..

- ప్రపంచవ్యాప్తంగా ఏఐలో పెట్టుబడులు 2019 నుంచి 24 శాతం చొప్పున వృద్ధి చెందుతూ వచ్చాయి. గత ఏడాదిలో దాదాపు 8,300 కోట్ల డాలర్ల పెట్టుబడులు తరలివచ్చాయి.
- మెజారిటీ పెట్టుబడులు డేటా అనలిటిక్స్, జెనరేటివ్ ఏఐ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) అల్గోరిథమ్స్ అండ్ ప్లాట్‌ఫామ్స్ విభాగాల్లోకి వచ్చాయి.
- దేశీయంగా టెక్ సర్వీసెస్, ప్రొడక్ట్ కంపెనీలు ఏఐ పెట్టుబడుల్లో 93 శాతం డిజిటల్ కంటెంట్, డేటా అనలిటిక్స్, సప్లై చెయిన్ సేవల అభివృద్ధి కోసం వెచ్చించాయి.
- ఏఐ నిపుణులు అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. దేశంలో 4.20 లక్షల మంది నిపుణులు ఏఐ సాంకేతిక విధులను నిర్వహిస్తున్నారు.
- ఏఐ నైపుణ్య వ్యాప్తి కూడా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో మూడు రెట్లు అధికం. గత ఏడేళ్లలో ఏఐ నైపుణ్యం కలిగిన వ్యక్తులు 14 రెట్లు పెరిగారు. 2027 వరకు ఏఐ నిపుణుల డిమాండ్‌లో 15 శాతం సీఏజీఆర్ నమోదు కానుంది.
- భారత్‌లోని టెక్నాలజీ ఇండస్ట్రీలో గడిచిన ఏడాది కాలంలో ఏఐ/ఎంఎల్ ఉద్యోగాలు 15 శాతానికి పైగా పెరిగాయి. ఏఐ ఇంజనీర్ ఉద్యోగావకాశాలు వార్షిక ప్రాతిపదికన 67 శాతం పెరిగాయి.
- కృత్రిమ మేధ నిపుణుల ప్రాధాన్యతను గుర్తించి, ప్రధాన కంపెనీలు తమ ఉద్యోగులకు ఈ సాంకేతికతలో శిక్షణ ఇచ్చేందుకు భారీగా వెచ్చిస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఉద్యోగుల నైపుణ్య శిక్షణ కోసం వచ్చే మూడేళ్ల కాలానికి 100 కోట్ల డాలర్ల మేర కేటాయింపులు జరుపుతున్నాయి.

తెలంగాణ స్టార్టప్‌లకు జపాన్ తోడ్పాటు
రూ.1,336 కోట్ల రుణ సాయం

హైదరాబాద్: తెలంగాణలో ఏర్పాటయ్యే స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించేందుకు జపాన్ ముందుకొచ్చింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,336 కోట్ల రుణసాయం అందించనుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి వికాస్ షీల్, భారత్‌లో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) ప్రధాన ప్రతినిధి సైటో మిత్సునోరి సంతకాలు చేశారు. తెలంగాణ పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి సరికొత్త వ్యాపార ఆలోచనలతో ముందుకొచ్చే స్టార్టప్‌లకు జపాన్ అందించే ఈ రుణం నుంచి ఆర్థిక సాయం అందిస్తారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించే స్టార్టప్‌లకీ ఈ పథకం ద్వారా ప్రత్యేక రుణ సాయం అందిస్తారు.

దేశీయ నౌకాయాన రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. బ్లూ ఎకానమీ పాలసీ కింద 2047 నాటికి ఈ రంగంలో రూ.75 లక్షల కోట్ల నుంచి రూ.80 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ కంపెనీల నౌకల కొనుగోలు, లీజింగ్‌ని ప్రోత్సహించేందుకూ నౌకాయాన అభివృద్ధి నిధి (ఎండీఎఫ్) పేరుతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,560 ▼	57,350 ▼	77,000 ▼
ముంబై	62,139 ▲	56,919 ▲	70,898 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ		విజయవాడ	525
హైదరాబాద్	534	విశాఖపట్నం	535
21వ తేదీ		వరంగల్	536
చిత్తూరు	603		
గోదావరి	525	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	గోదావరి	139
వరంగల్	135		
కరీంనగర్	135	విజయవాడ	139
మహబూబ్‌నగర్	135	గుంటూరు	139
కర్నూలు	135	ఒంగోలు	139
విశాఖపట్నం	127	చిత్తూరు	140

సోనీ-జీ విలీనంపై మళ్లీ చర్చలు !

నిజం లేదన్న జీ గ్రూప్

న్యూఢిల్లీ: సోనీ-జీ ఎంటర్‌టైన్మెంట్ కంపెనీల విలీనంపై మళ్లీ వార్తలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జెడ్‌ఈఈఎల్) చొరవ తీసుకున్నట్టు సమాచారం. దీంతో రెండు కంపెనీల మధ్య గత 15 రోజులుగా ముంబైలో చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. జీ గ్రూప్ మాత్రం ఈ వార్తలను తోసిపుచ్చింది. అలాంటి ప్రయత్నాలేవీ జరగడం లేదని స్పష్టం చేసింది. 2021 డిసెంబరులో విలీనానికి సంబంధించి రెండు కంపెనీల మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. అయితే తుది చర్చలు ఎంతకీ తేలకపోవటంతో సోనీ గ్రూప్ గత నెల 22న ఈ విలీన ప్రతిపాదనను రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.83,000 కోట్లు) విలువైన ఈ విలీనాన్ని సోనీ గ్రూప్ ఆమోదించేలా ఆ సంస్థను ఆదేశించాలని ఎన్‌సీఎల్‌టీని ఐ జీగ్రూప్ ఆశ్రయించింది. ఈ విలీన వార్తలతో బీఎస్‌ఈలో మంగళవారం జీ ఎంటర్‌టైన్మెంట్ షేరు 8.03 శాతం లాభంతో రూ.193 వద్ద ముగిసింది.

బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్‌తో రెనో జట్టు

న్యూఢిల్లీ: దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో కార్ల లభ్యత పెంచడం లక్ష్యంగా డిజిటల్ సర్వీసుల కంపెనీ బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్‌తో రెనో ఇండియా భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఉభయ సంస్థలు ఈ మేరకు ఒక ఎంఓయూపై సంతకాలు చేశాయి. గ్రామీణ, సెమీ అర్బన్ మార్కెట్లలో రెనో క్విడ్, ట్రైబర్, కైగర్ కార్ల లభ్యత మరింత పెంచేందుకు ఈ ఎంఓయూ దోహదపడుతుంది. బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్‌కు గల 1,016 డిజిటల్ స్టోర్లు, లక్ష టచ్ పాయింట్ల విస్తృత నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని తమ కార్లపై గ్రామీణుల్లో చైతన్యం కల్పిస్తామని రెనో తెలిపింది.

ఆరో రోజూ అదే జోరు



మార్కెట్లో కొనసాగిన బుల్ ర్యాలీ

- సరికొత్త రికార్డు స్థాయికి నిఫ్టీ
- మళ్లీ 73,000 ఎగువకు సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్లో వరుసగా ఆరో రోజూ సూచీల ర్యాలీ కొనసాగింది. ఆరంభ నష్టాల నుంచి తేరుకుని నిఫ్టీ సరికొత్త ఉన్నత శిఖరాన్ని అధిరోహించగా.. సెన్సెక్స్ మళ్లీ 73,000 మైలురాయిని దాటింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 349.24 పాయింట్ల లాభంతో 73,057.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 74.70 పాయింట్ల వృద్ధితో 22,196.95 వద్ద క్లోజైంది. సూచీకి సరికొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపు స్థాయిది. అంతేకాదు, సూచీ 22,215.60 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును సైతం నమోదు చేసింది. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,984 పాయింట్లు, నిఫ్టీ 580 పాయింట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 పాజిటివ్‌గా ముగిశాయి.

వర్ల్‌పూల్ ఇండియాలో 24% వాటా విక్రయం: అమెరికాకు చెందిన గృహోపకరణాల తయారీ దిగ్గజం వర్ల్‌పూల్ కార్పొరేషన్ తన భారత అనుబంధ విభాగమైన వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటాకు సమానమైన 3.13 కోట్ల షేర్లను ఓపెన్ మార్కెట్ ద్వారా రూ.4,089.45 కోట్లకు విక్రయించింది. తద్వారా వర్ల్‌పూల్ ఇండియాలో మాతృసంస్థ వాటా 75 శాతం నుంచి 51 శాతానికి తగ్గింది. నిధుల సమీకరణతో పాటు రుణభారం తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటా విక్రయించనున్నట్లు గత ఏడాది నవంబరు 30వ తేదీనే మాతృసంస్థ ప్రకటించింది. మంగళవారం బీఎస్‌ఈలో వర్ల్‌పూల్ ఇండియా షేరు 3.24 శాతం నష్టంతో రూ.1,287.70 వద్ద స్థిరపడింది.

విభోర్ స్టీల్ లిస్టింగ్ అదుర్స్
తొలిరోజే 193 శాతం వృద్ధి చెందిన కంపెనీ షేరు

ఇంజనీరింగ్ పరిశ్రమల్లో ఉపయోగించే స్టీల్ ట్యూబ్స్ అండ్ పైపుల తయారీ సంస్థ విభోర్ స్టీల్ ట్యూబ్స్ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. కంపెనీ తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.151తో పోలిస్తే, బీఎస్‌ఈలో కంపెనీ షేరు 178.81 శాతం ప్రీమియంతో రూ.421 వద్ద లిస్టయింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 192.72 శాతం లాభంతో రూ.442 వద్దకు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.838.14 కోట్లుగా నమోదైంది. గత వారంలో ముగిసిన విభోర్ స్టీల్ ఐపీఓకూ దాదాపు 300 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. 2003లో ప్రారంభమైన ఈ కంపెనీ మహారాష్ట్ర, తెలంగాణలో ప్లాంట్లను కలిగి ఉంది.

విస్తరణ బాటలో ఆసుస్ ఇండియా

హైదరాబాద్: ఆసుస్ ఇండియా.. రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్‌ఓజీ) స్టోర్లను మరింతగా విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఆసుస్ ఆర్‌ఓజీ బ్రాండ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. కాగా హైదరాబాద్‌లో కంపెనీ రెండో ఆర్‌ఓజీ స్టోర్‌ను ప్రారంభించింది. దీంతో హైదరాబాద్‌లో ఈ స్టోర్ల సంఖ్య 4కి చేరుకోగా ఏపీ, తెలంగాణల్లో ఆసుస్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ (ఏఈఎస్), ఆర్‌ఓజీ స్టోర్ల సంఖ్య 13కి చేరిందని ఆసుస్ ఇండియా నేషనల్ సేల్స్ మేనేజర్ జిగ్నేష్ భవ్‌సర్ తెలిపారు. ఈ స్టోర్‌లో గేమింగ్ కమ్యూనిటీకి అవసరమైన కన్స్యూమర్ నోట్‌బుక్స్, ఆర్‌ఓసీ పర్సనల్ కంప్యూటర్లు, లాప్‌టాప్స్, యాక్సెసరీస్, క్రియేటర్ సిరీస్ అందుబాటులో ఉంటాయన్నారు.

ఏపీలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీ.. ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అతి పెద్ద హరిత ఉదజని (గ్రీన్ హైడ్రోజన్) ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. ఎన్‌టీపీసీ అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్) ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామం వద్ద ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఇందుకు అవసరమైన భూమిని లీజుపై ఇచ్చేందుకు ఎన్‌జీఈఎల్, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) మధ్య మంగళవారం సంతకాలు జరిగాయి. రోజుకు 1,200 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తారు. ఇక్కడ ఉత్పత్తి చేసే హరిత ఉదజనిని వివిధ ఎగుమతి మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ వంటి ఉత్పత్తులుగా మార్చి ఎగుమతి చేస్తారు.

స్పోర్ట్స్

ఖేలో ఇండియాలో పల్లవికి రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో విజయనగరం వెయిట్‌లిఫ్టర్ ఎస్. పల్లవి రజతంతో మెరిసింది. మంగళవారం గువాహటిలో జరిగిన ఈ పోటీల్లోని మహిళల 64 కిలోల విభాగంలో పల్లవి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్నాచ్‌లో 80 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 95 కిలోలతో కలిపి ఓవరాల్‌గా 175 కిలోల బరువెత్తి పతకం సాధించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పల్లవి ఈ క్రీడల్లో పాల్గొంది. ఇక, గుంటూరులోని కేఎల్‌ఈఎఫ్ విశ్వవిద్యాలయం తరపున పోటీపడ్డ హైదరాబాద్ స్విమ్మర్ సాయి నిహార్ ఓ స్వర్ణం (200 మీ. మెడ్లే), రజతం (200 మీ. బ్యాక్‌స్ట్రోక్ దక్కించుకున్నాడు.





రాహుల్ అవుట్.. బుమ్రాకు రెస్ట్

రాంచీ చేరిన టీమిండియా

రాంచీ: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు కోసం భారత జట్టు రాంచీలో అడుగుపెట్టింది. మంగళవారం ప్రయివేట్ చార్టర్‌లో ఇక్కడకు చేరిన టీమ్‌లో పేసర్ బుమ్రా కనిపించలేదు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు రాంచీ టెస్టు నుంచి విశ్రాంతినిచ్చినట్టు బీసీసీఐ ప్రకటించింది. కాగా, ఈ టెస్టు బరిలోకి దిగుతాడనుకున్న కేఎల్ రాహుల్ కూడా జట్టుకు దూరమైనట్టు బోర్డు తెలిపింది. రాహుల్ ఐదో టెస్టు (ధర్మశాల)లో ఆడేదీ లేనిదీ అతడి ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని బోర్డు వెల్లడించింది. ప్రస్తుతం రంజీల్లో ఆడుతున్న బెంగాల్ పేసర్ ముకేశ్ కుమార్‌ను బుమ్రా స్థానంలో పిలిచే అవకాశం ఉంది.



విరాట్ మళ్లీ తండ్రయ్యాడు

న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండోసారి తండ్రయ్యాడు. అతడి భార్య అనుష్క శర్మ ఈనెల 15న మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇన్ని రోజులు గోప్యంగా ఉంచిన ఈ సమాచారాన్ని స్వయంగా విరుష్క దంపతులు మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. తమ చిన్నారికి అకాయ్ అనే పేరు పెట్టినట్టు చెప్పారు. 2017లో వివాహం చేసుకున్న కోహ్లీ, అనుష్కకు 2021లో కూతురు వామికా జన్మించిన సంగతి తెలిసిందే. 'మా జీవితంలో మధుర క్షణాలివి. ఈ సంతోషకర సమయంలో మీ ఆశీర్వాదాలు, శుభాకాంక్షలు కోరుకుంటున్నాం. వామికకు సోదరుడు పుట్టాడని చెప్పడానికి సంతోషిస్తున్నాం. అలాగే మా గోప్యతను గౌరవిస్తారని ఆశిస్తున్నాం' అని తమ పోస్టులో పేర్కొన్నారు. దీంతో అభిమానులతో పాటు సెలెబ్రిటీలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. విరాట్ దంపతులు ప్రస్తుతం లండన్‌లో ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతోనే ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్‌కు విరాట్ దూరమయ్యాడని తెలుస్తోంది.

ఏసీఏలో మితిమీరుతున్న
వైసీపీ పెత్తనం?

అపెక్స్ కౌన్సిల్ తీరుపై విమర్శలు
టీమ్ సెలెక్షన్స్‌లో సిఫార్సుల ఒత్తిడి!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ ట్రోఫీలో ఈసారి ఆంధ్ర జట్టు నాకౌట్‌కు చేరడంలో ప్రస్తుత కెప్టెన్ రికీ భుయ్‌తో పాటు సీనియర్ క్రికెటర్ హనుమ విహారి ముఖ్య భూమిక పోషించారు. ఇదంతా నాణానికి ఒకవైపు కాగా, మరో వైపు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)పై వైసీపీ నాయకుల పెత్తనం మితిమీరుతోందని క్రికెట్ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ టోర్నీకి జట్టును ఎంపిక చేయాలన్నా, ఆఖరికి తుది జట్టులో ఎవరిని ఆడించాలనే విషయాలు కూడా కత్తి మీద సాముగా తయారైందని సమాచారం. అధికార పార్టీ నాయకుల నుంచి నేరుగా ఏసీఏ యంత్రాంగానికి ఫోన్లు రావడం.. వారు వినకపోతే, అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో ఒత్తిడి చేయించడం పరిపాటిగా మారిపోయిందని తెలుస్తోంది. ఇటీవల రాయలసీమకు చెందిన ఇద్దరు క్రికెటర్లను రంజీ జట్టులోకి తీసుకోవాలని తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్టు సమాచారం. ఈ సీజన్‌కు తొలుత కెప్టెన్‌గా ఉన్న హనుమ విహారికి ఇదే విషయంలో ఇబ్బందులు తలెత్తడంతో ఒక దశలో అతడు సహనం కోల్పోయి మాట్లాడిన మాటలకు గానూ ఉన్న ఫళంగా నాయకత్వ బాధ్యతల నుంచి తొలగించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్తూరు క్రికెట్ అసోసియేషన్‌ను వైసీపీకి చెందిన సీనియర్ నాయకుడి తనయుడు గుప్పిట్లో పెట్టుకుని, ఏసీఏ కార్యకలాపాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్చి 22 నుంచి ఐపీఎల్

టోర్నీ మొత్తం భారత్‌లోనే..
లీగ్ చైర్మన్ అరుణ్ ధూమల్



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఎప్పుడు జరుగుతుంది.. భారత్‌లోనే నిర్వహిస్తారా? తదితర సందిగ్ధమైన అంశాలకు తెరదించాడు లీగ్ చైర్మన్ అరుణ్ ధూమల్. ఈ సీజన్ ఐపీఎల్ మ్యాచ్‌లన్నీ దేశంలోనే జరుగుతాయనీ, వచ్చేనెల.. అంటే మార్చి 22న లీగ్ ప్రారంభమవుతుందని ధూమల్ స్పష్టతనిచ్చాడు. పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామన్నాడు. ఈ ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. అయితే, ఐపీఎల్‌లో తొలి పదిహేను రోజుల షెడ్యూల్‌ను ముందుగా ప్రకటించి, మిగతా మ్యాచ్‌ల షెడ్యూల్‌ను సార్వత్రిక ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత వెల్లడిస్తామని ధూమల్ తెలిపాడు. వచ్చేనెలలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముంది. 2009లో తొలిసారిగా ఐపీఎల్‌ను పూర్తిగా విదేశం (దక్షిణాఫ్రికా)లో నిర్వహించిన నిర్వాహకులు.. సార్వత్రిక ఎన్నికల కారణంగా 2014 అంచెలో కొంత భాగం యూఏఈలో జరిపారు. ఇక, 2019లో ఎన్నికలున్నప్పటికీ మొత్తం టోర్నమెంట్ భారత్‌లోనే జరిగింది. అయితే, టీ20 ప్రపంచకప్ సన్నద్ధతను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఐపీఎల్ ఫైనల్‌ను మే 26న జరిపే యోచనలో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం.

నాకౌట్‌కు భారత జట్లు
ప్రపంచ టీటీ టీమ్ చాంపియన్‌షిప్

బుసాన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. మంగళవారం జరిగిన తమ గ్రూపు చివరి మ్యాచ్‌లో పురుషుల బృందం 3-0తో న్యూజిలాండ్‌ను చిత్తుచేయగా, మహిళల జట్టు 3-2తో స్పెయిన్‌పై ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 40 జట్లు పోటీపడ్డ ఈ టోర్నీలో 24 టీమ్‌లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఇక, క్వార్టర్‌ఫైనల్ చేరాలంటే మరో రెండు మ్యాచ్‌లు నెగ్గాల్సి ఉంటుంది. క్వార్టర్స్‌కే చేరితే, పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖాయమవుతుంది.

టైతో ముగించిన టైటాన్స్



పంచకుల: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్ 10ను తెలుగు టైటాన్స్ జట్టు డ్రాతో ముగించింది. మంగళవారం యు ముంబాతో జరిగిన మ్యాచ్‌ను టైటాన్స్ 45-45తో టై చేసుకుంది. టైటాన్స్ కెప్టెన్ పవన్ 14 పాయింట్లతో చెలరేగి, జట్టుకు మరో పరాభవం తప్పించాడు. ఆట ఆఖరి నిమిషంలో పవన్ సూపర్ రైడ్‌తో 4 పాయింట్లు సాధించి, స్కోరు సమం చేశాడు. అత్యంత చెత్త ఆటతో ఈ సీజన్‌ను టైటాన్స్ లీగ్‌లో అట్టడుగు స్థానంతో ముగించింది. ఆడిన 22 మ్యాచ్‌ల్లో రెండింట్లోనే టైటాన్స్ గెలవడం గమనార్హం.

గుల్వీర్ స్వర్ణం వెనక్కి...



టెహ్రాన్: ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 3000 మీటర్ల రేసులో విజేతగా నిలిచిన భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్‌కు ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. రేసు ముగిసిన తర్వాత గుల్వీర్‌ను అనర్హుడిగా ప్రకటించారు నిర్వాహకులు. రేసు సందర్భంగా గుల్వీర్ తనకు కేటాయించిన లేన్‌నుంచి పక్కకు వెళ్లాడంటూ వచ్చిన ఫిర్యాదును పరిశీలించిన తర్వాత నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో తాను సాధించిన స్వర్ణ పతకాన్ని గుల్వీర్ కోల్పోక తప్పలేదు. ఈ విషయంలో భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) చేసిన అప్పీల్‌ను ఈవెంట్ నిర్వాహకులు తిరస్కరించారు.

పంత్ ప్రాక్టీస్

ఐపీఎల్‌లో బ్యాటర్‌గానే బరిలోకి..

న్యూఢిల్లీ: గాయం నుంచి కోలుకుంటున్న రిషబ్ పంత్ తిరిగి మైదానంలోకి అడుగుపెట్టాడు. 2022 డిసెంబరులో కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పంత్ అప్పటి నుంచి ఆటకు దూరమయ్యాడు. అయితే జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) పునరావాస శిబిరంలో ఉన్న పంత్ దాదాపు కోలుకున్నాడు. తన ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ ఆలూర్‌లో నిర్వహించిన ప్రాక్టీస్ మ్యాచ్‌లోనూ ఆడాడు. ఇందులో అతడు చురుగ్గానే కనిపించడం సానుకూలాంశం. ఇప్పటికే పంత్ ఐపీఎల్‌లో ఆడతాడన్న సంకేతాలు వస్తున్నాయి. అయితే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పంత్ కేవలం స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే దిగనున్నట్టు సమాచారం. కీపర్ బాధ్యతలను మరో ఆటగాడికి అప్పగించనున్నట్టు తెలుస్తోంది.



రంజీ ప్లేట్ విజేత హైదరాబాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జట్టు రంజీ ప్లేట్ గ్రూప్ విజేతగా అవతరించింది. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో మేఘాలయతో ముగిసిన ఫైనల్లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 71/1తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన హైదరాబాద్ 34.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసి, లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ తిలక్ వర్మ (64), ఓపెనర్ రాహుల్ సింగ్ (62) రాణించారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో మేఘాలయ 304, ఆంధ్ర 350కు ఆలౌట్ కాగా, రెండో ఇన్నింగ్స్‌లో మేఘాలయ 243 రన్స్ చేసింది.



హైదరాబాద్ జట్టుకు జగన్ బంపరాఫర్: రంజీ ప్లేట్ గ్రూప్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు వరాల జల్లు కురిపించారు. టీమ్‌కు రూ.10 లక్షలు, టోర్నీలో రాణించిన కెప్టెన్ తిలక్ వర్మ, తన్మయ్, తనయ్, నితీశ్, ప్రజ్ఞయ్ రెడ్డికి తలో రూ.50 వేలు ప్రకటించారు. ఇవికాక వచ్చే రంజీ ఎలైట్ సీజన్‌లో ట్రోఫీ సాధిస్తే హైదరాబాద్ జట్టుకు రూ.కోటి నగదు బహుమతితో పాటు జట్టులోని ప్రతి ప్లేయర్‌కు బీఎండబ్ల్యూ కారును బహుమానంగా ఇవ్వనున్నట్టు చెప్పారు.



చెస్‌లో 8ఏళ్ల చిన్నోడి సంచలనం

గ్రాండ్‌మాస్టర్‌కు షాకిచ్చిన భారత సంతతి చిన్నారి

సింగపూర్: భారత సంతతికి చెందిన ఎనిమిదేళ్ల బుడ్డోడు చదరంగ క్రీడలో సంచలనం సృష్టించాడు. స్విట్జర్లాండ్‌లో జరిగిన బర్గ్‌డార్ఫర్ స్టధాస్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో సింగపూర్ తరఫున ప్రాతినిధ్యం వహించిన భారత సంతతి చిన్నారి అశ్వథ్ కౌశిక్ నాలుగో రౌండ్‌లో ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్, 37 ఏళ్ల జాసెక్ స్టొపాపై విజయం సాధించాడు. క్లాసికల్ గేమ్ చెస్ చరిత్రలో గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన అత్యంత పిన్న వయసు ఆటగాడిగా అశ్వథ్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుతం ఫిడే ర్యాంకింగ్స్‌లో 37,338 ర్యాంక్‌తో ఉన్న అశ్వథ్ భారత్‌కు చెందినవాడే. అయితే, అతని కుటుంబం 2017లో సింగపూర్‌కు వలస వెళ్లడంతో ఆ దేశం తరఫున ఆడుతున్నాడు. రెండేళ్ల క్రితం ఈస్టర్న్ ఆసియా యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్-8 కేటగిరిలో పోటీపడ్డ అశ్వథ్.. ఆ టోర్నీలోని మూడు విభాగాల్లోనూ విజేతగా నిలిచాడు.



స్టోక్స్ చేతికి బంతి!

చివరి రెండు టెస్టుల్లో బౌలర్‌గానూ సేవలు

రాంచీ: ఓటమి బాధలో ఉన్న ఇంగ్లండ్ జట్టుకు, వారి అభిమానులకు ఓ గుడ్‌న్యూస్. ఈ సిరీస్‌లో కేవలం బ్యాటర్‌గానే సేవలందిస్తున్న కెప్టెన్ స్టోక్స్ తిరిగి బంతి చేతపట్టే అవకాశం ఉంది. వెన్ను నొప్పి కారణంగా అతను బౌలింగ్‌కు దూరంగా ఉంటున్నాడు. గత జూన్‌లో ఆసీస్‌తో జరిగిన టెస్టులో స్టోక్స్ చివరిసారి బౌలింగ్ చేశాడు. 'నేను కచ్చితంగా బౌలింగ్ చేస్తానని, చేయనని కూడా చెప్పలేను. నాపై వర్క్‌లోడ్ ఎలా ఉందనే విషయమై వైద్య సిబ్బందితో చర్చిస్తున్నా. సన్నాహకాల్లో అయితే వంద శాతం బౌలింగ్ చేయగలిగాను. టెస్టులోనూ చేస్తాననిపించింది. కానీ అది మరీ తొందరపాటు అవుతుందని దూరంగా ఉన్నా' అని స్టోక్స్ తెలిపాడు.


కర్నూలు 'ఈనాడు' కార్యాలయం ఎదుట వైసీపీ శ్రేణుల నినాదాలు

కర్నూలు 'ఈనాడు' కార్యాలయంపై వైసీపీ దాడి

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా 'ఈనాడు' ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూకలు మూకుమ్మడిగా దాడి చేసి బీభత్సం సృష్టించాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి ఘటన మరవకముందే.. ఏకంగా ఒక పత్రిక కార్యాలయంపైనే దాడి చేయడం పాత్రికేయవర్గాలను దిగ్ర్భాంతికి గురి చేస్తోంది. దాడికి వచ్చిన మూకలు పట్టుకున్న ఫ్లెక్సీపై 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణ ముర్దాబాద్ అని రాసి ఉంది. వివరాల్లోకి వెళితే.. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అనుచరులైన కర్నూలు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సంగాల సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, షైతాపు నరసింహులు, వైసీపీ యువజన విభాగం నాయకుడు అక్కిమి హనుమంతరెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు కర్నూలు నడిబొడ్డున 'ఈనాడు' కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. పెద్దఎత్తున కేకలు వేస్తూ కర్రలు, రాళ్లతో చెలరేగిపోయారు. రాళ్లు రువ్వి కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. పత్రిక బోర్డును ధ్వంసం చేశారు. 'ఈనాడు' సంస్థల అధినేత రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీభత్సం సృష్టించారు. 'మా నాయకుడికి వ్యతిరేకంగా వార్తలు రాస్తారా..? మీ అంతు చూస్తాం' అని బెదిరించారు. పత్రిక ప్రతులను రోడ్డుపై వేసి నిప్పు పెట్టారు. గంటన్నరకు పైగా అలజడి సృష్టించారు. ముందే ఈనాడు సిబ్బంది ఆఫీసుకు తాళం వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, యాడ్ ఎగ్జిక్యూటివ్ అల్లాస్వామి తలుపులు వేసి కిందకు దిగుతుండగా వైసీపీ శ్రేణులు ఆయనను చుట్టుముట్టారు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. 'ఈనాడు' కార్యాలయంపై దాడిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత తీవ్రంగా ఖండించారు. పోలీసుల సమక్షంలోనే వైసీపీ మూకలు దాడులు చేయడం దుర్మార్గమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. పత్తికొండలో ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలోనే వైసీపీ మూకలు 'ఆంధ్రజ్యోతి' విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. కర్నూలు 'ఈనాడు' కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు.

శ్రీకృష్ణకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ మూకదాడిలో గాయపడ్డ ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి. వైద్యం ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎక్స్ వేదికగా రాప్తాడు 'సిద్ధం' సభలో వైసీపీ నేతలు శ్రీకృష్ణపై చేసిన దాడిని ఆమె ఖండించారు. 'నిజాలు రాస్తున్న పత్రికలపైనా, పత్రికా ప్రతినిధులపైనా, ఫొటో జర్నలిస్టులపైనా సమాధానం చెప్పే ధైర్యంలేని జగన్మోహనరెడ్డి మూకదాడులను పురిగొల్పుతున్నారు. కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ నేతలు మూక దాడులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నా. ప్రత్యక్ష దాడులకు దిగడం, కొట్టి చంపడం వంటివి అధికారపార్టీకి వెన్నతో పెట్టిన విద్య' అని దుయ్యబట్టారు.

ఫొటో గ్రాఫర్‌పై దాడి విచారకరం: ఎంపీ రెడ్డెప్ప

వి.కోట, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి విచారకరమని చిత్తూరు వైసీపీ ఎంపీ రెడ్డెప్ప అన్నారు. మంగళవారం వి.కోటలో మీడియాతో మాట్లాడుతూ.. దాడి ఘటన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.


నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జర్నలిస్టులతోపాటు ఆందోళనలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, వామపక్ష నాయకులు


అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు


శ్రీకాకుళంలో ధర్నా చేస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

అజ్ఞాతంలోకి వైసీపీ గూండాలు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి జరిగిన మూడురోజుల తర్వాత మొదటి అరెస్టు

- జర్నలిస్టుల ఆందోళనలతో కదిలిన పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే విశ్వ అనుచరుడు ఎర్రిస్వామి అరెస్టు
- దాడికి పాల్పడినవారు ఇంకా బయటే...
- వైసీపీ నాయకుల అండతో అండర్‌గ్రౌండ్‌లోకి..

అనంతపురం క్రైం, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20: 'ఆంధ్రజ్యోతి' అనంతపురం జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ గుండాల్లో చాలామంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. రాప్తాడు సమీపంలో ఆదివారం జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో వైసీపీ మూకలు శ్రీకృష్ణపై పాశవిక దాడికి పాల్పడ్డాయి. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అనంతపురం ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో దాడిలో పాల్గొన్నవారిలో కొందరు పారిపోగా.. మరికొందరు వైసీపీ నేతల అండతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దాడిచేసిన మూడు రోజుల తర్వాత మొదటి అరెస్టు మంగళవారం జరిగింది. ఆ జిల్లాలోని కూడేరు మండలం మరుట్ల 2వ కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని రాప్తాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎర్రిస్వామిని అతని స్వగ్రామంలోనే అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు రాప్తాడు పోలీస్‌స్టేషన్ వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాశారు. అతణ్ని తమతో బయటకు తీసుకెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో పోలీసు అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చారు. ఎర్రిస్వామిపై 307, 147, 148 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కల్యాణదుర్గం మున్సిపాలిటీలోని దొడఘట్టవాసి, మంత్రి ఉష శ్రీచరణ్ అనుచరుడు జీ అశోక్ కోసం పోలీసులు మంగళవారం అతని ఇంటికెళ్లారు. అప్పటికే అతడు పరారయ్యాడు. దీంతో ఇంటి వద్ద ఉన్న అతని బైక్‌ను ట్రాక్టర్‌లోకి ఎక్కించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అశోక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇతనిపై సెబ్ పోలీసులు గతంలో కేసులు నమోదు చేసినట్లు సమాచారం. మద్యం సేవించి ఊళ్లో తిరుగుతూ.. తనను ఎవరూ ఏమీ చేసుకోలేరని బీరాలు పలుకుతున్నాడని స్థానికులు అంటున్నారు. ఈ విషయం పోలీసులకు తెలుసా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకృష్ణపై కర్రతో దాడికి పాల్పడిన బండి రవి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అనుచరుడు. దాడి తర్వాత అతడు అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయాడు. కాగా, శ్రీకృష్ణపై దాడి జరిగి మూడు రోజులు గడిచింది. దాడికి పాల్పడ్డవారు ఎవరో సామాన్యులు కూడా చెప్పగలుగుతున్నారు. వీడియో ఆధారాలూ ఉన్నాయి. అయినా, వారిని పోలీసులు పట్టుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కాగా, శ్రీకృష్ణపై దాడి వ్యవహారంలో ఇప్పటివరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని రాప్తాడు సీఐ మునిస్వామి తెలిపారు.


రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్న మిద్దె ఎర్రిస్వామి


నాగేంద్ర (ఫైల్)


అశోక్ (ఫైల్)

శ్రీకృష్ణకు పరామర్శ: హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను తెలుగుదేశం పార్టీ నాయకుడు జేసీ పవన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఉదయం పరామర్శించారు. ఆరోగ్య వివరాలు, అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ భానుప్రకాశ్, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, నెట్‌వర్క్ ఇన్‌చార్జీ కృష్ణప్రసాద్ శ్రీకృష్ణను పరామర్శించారు.

చొక్కా చింపి.. కొట్టి...

- 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై వైసీపీ మూకల దాడి
- కర్నూలు జిల్లా మద్దికెరలో ఘటన

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మరవకముందే.. అలాంటిదే మరో దౌర్జన్యం! కర్నూలు జిల్లా మద్దికెర 'ఆంధ్రజ్యోతి' విలేకరి కె.వీరశేఖర్‌పై వైసీపీ మూకలు దాడికి దిగాయి. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మండల కేంద్రమైన మద్దికెరలో హెల్త్ క్లీనిక్, మద్దికెర-బీఎన్ పేట రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. కవరేజీకి వెళ్లిన వీరశేఖర్‌పై వైసీపీ నాయకుడు, స్థానిక వీఆర్వో సోదరుడు రంగస్వామి, మరి కొందరు దాడికి తెగబడ్డారు. 'మాకే వ్యతిరేకంగా వార్తలు రాస్తావా..? హౌసింగ్ బిల్లులో అక్రమాలు జరిగాయని రాస్తావా..? నీ అంతు చూస్తా' మంటూ వీరశేఖర్‌పై ఒక్కసారిగా దాడిచేసి.. చొక్కా పట్టుకుని, చేతులతో కొట్టారు. కవరేజీకి వెళ్లిన ఇతర జర్నలిస్టులు శేఖర్‌కు రక్షణగా నిలిచారు. అనంతరం వీరశేఖర్, ఇతర పాత్రికేయులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలోనే వైసీపీ మూకలు దాడికి పాల్పడటం తీవ్రమైన చర్య అని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కె.నాగరాజు, జి.కొండప్ప, ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసులుగౌడు డిమాండ్ చేశారు.

దాడులు ఆగేవరకు పోరుబాటే!

- రేపు 'చలో అనంతపురం'
- కొనసాగిన జర్నలిస్టుల ఆందోళనలు
- శ్రీకృష్ణపై దాడికి సర్వత్రా నిరసనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

'ఆంధ్రజ్యోతి' అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి వ్యతిరేకంగా వరుసగా రెండోరోజూ పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగాయి. ఫొటోగ్రాఫర్లు, జర్నలిస్టులు, మీడియాపై దాడులు ఆపాలంటూ గురువారం 'చలో అనంతపురం'కు జర్నలిస్టులు పిలుపునిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా మంగళవారం జర్నలిస్టు సంఘాలు, టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. రాప్తాడు ఘటన ప్రజాస్వామ్యంలో చీకటి రోజు అని నేతలు తీవ్రంగా ఖండించారు. ఆ జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో ప్లకార్డులు చేతబట్టి, రోడ్డెక్కి నిరసన తెలిపారు. శ్రీకృష్ణపై దాడిని బెస్త సేవాసంఘం నాయకులు ఖండించారు. పాలకులు జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని పలువురు పాత్రికేయులు అన్నారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలవద్ద, ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు మంగళవారం ధర్నా చేపట్టారు. నెల్లూరు జిల్లాలో జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రోడ్డెక్కి, జగన్ తీరును నిరసించారు. ఆత్మకూరు బీఎస్‌ఆర్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలనే డిమాండ్‌తో ఈనెల 22న 'చలో అనంతపురం' కార్యక్రమం చేపడుతున్నట్టు జర్నలిస్టు నేతలు ప్రకటించారు. ఈ మేరకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, 'సామ్నా' రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, రమణారెడ్డి, ఎలక్ర్టానిక్ మీడియా అధ్యక్షుడు శివ, ఫొటో జర్నలిస్టు యూనియన్ రాష్ట్రనాయకుడు సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మోసాల మామ... ఉత్తుత్తి ప్రేమ!

(మొదటి పేజీ తరువాయి)

కింద లబ్ధిపొందిన విద్యార్థుల సంఖ్య పదోవంతు కూడా లేదని తేలింది.

మూడేళ్లు అటకెక్కించి...

రాష్ట్రంలో ఎప్పటి నుంచో అమలులో ఉన్న ఇంగ్లీషు మీడియంను తానే తెచ్చినట్లుగా గొప్పలు చెప్పడం.. 'పేద విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలో చదువు కోకూడదా' అంటూ మైకు పట్టుకుని ఊరూరా ఊదరగొట్టడం! ఇదీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఖరి! కానీ.. అదే జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు విదేశీ విద్యను దూరం చేశారు. మూడేళ్ల తర్వాత కోర్టు ఆదేశించడంతో ఈ పథకాన్ని పునరుద్ధరించక తప్పలేదు.

116 మందికే సాయం

పేద పిల్లలపై కోట్ల రూపాయలు గుమ్మరిస్తున్నానని డప్పు కొట్టుకుంటున్న జగన్.. ఈ రెండేళ్లలో విదేశీ విద్యాదీవెన కింద సాయం అందించింది కేవలం 116 మందికి. అంటే జగన్ నియమించుకున్న సలహాదారుల కంటే తక్కువ. ఈ ఐదేళ్లలో సలహాదారుల హంగులు, ఆర్భాటాల కోసం రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేశారు. విదేశీ విద్యాదీవెన కోసం పెట్టిన ఖర్చు కేవలం రూ.15.69 లక్షలు మాత్రమే. ఈ పథకం అమలు చేయడం తనకు ఇష్టంలేదని చెప్పకనే చెబుతున్నారు. దీనిని ఆంక్షల చట్రంలో బంధించి 'అర్హుల'కు కోతేస్తున్నారు. 2022-23 సంవత్సరంలో క్యూఎస్ ర్యాంకింగ్‌లో టాప్-200లో ఉన్న యూనివర్సిటీల్లో సీట్లు పొందిన వారికి మాత్రమే ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. వందలోపు ర్యాంకు ఉన్న విశ్వవిద్యాలయాల్లో సీటు సాధిస్తే 100 శాతం ఫీజు భరిస్తామని, 101-200 ర్యాంకు వరకు ఉన్న యూనివర్సిటీల్లో అయితే 50 శాతం ఫీజు లేదా రూ.50 లక్షలు (ఏది తక్కువైతే అది) చెల్లిస్తామన్నారు. ఈ ఆంక్షల నేపథ్యంలో 290 మందే అర్హత సాధించారు. ఇంత మందికి సాయం చేయడానికి కూడా జగన్‌కు మనసు రాలేదు. రెండో ఏడాది (2023-24లో) ఆంక్షల చట్రాన్ని మరింత బిగించారు. టాప్-50 యూనివర్సిటీల్లో సీటు సాధించిన వారికే ఈ పథకం వర్తింపజేస్తామన్నారు. దీంతో అర్హులైన విద్యార్థుల సంఖ్య 50 లోపునకు పడిపోయింది. ఇది.. అధికారిక సమాచారం! అంటే.. మొత్తంగా 340 మంది అర్హులు! వీరికైనా లబ్ధి చేకూరిందా అంటే.. అదీ లేదు.

ఇన్ని అబద్ధాలా..

అరకొరగా అమలు చేస్తున్న పథకానికి అత్తెసరుగా లబ్ధిదారులను ఎంపిక చేసిన జగన్ సర్కారు... దీనిపై అబద్ధాలను మాత్రం ఘనంగా చెప్పుకొంటోంది. 'విదేశీ విద్యాదీవెన నిధుల విడుదల' అంటూ 2023 డిసెంబరులో అప్పటి వరకు 408 మంది విద్యార్థుల కోసం రూ.107 కోట్లు ఖర్చు చేసినట్టు ఒక అందమైన అబద్ధం అల్లారు. నిజానికి.. 2022-23లో 35 మందికి రూ.2.19 కోట్లు, 2023-24లో 81 మందికి రూ.13.5 కోట్లు చెల్లించినట్లు సంబంధిత శాఖ 'సమాచార హక్కు' కింద ఇచ్చిన దరఖాస్తుకు సమాధానమిచ్చింది. అంటే.. ఈ పథకం కింద రెండేళ్లలో ఖర్చు చేసిన మొత్తం 15.69 కోట్లు మాత్రమే! ఇక ఒక ఏడాది 35 మంది, రెండో ఏడాది 81 మంది... మొత్తం 116 మంది లబ్ధి పొందారని లెక్కలు వేసుకుంటే.. తప్పులో కాలేసినట్లే. విద్యార్థులకు ఇచ్చే ఈ అరకొర ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం 4 వాయిదాల్లో ఇస్తోంది. బటన్ నొక్కిన ప్రతిసారీ ఆ అంకెను లెక్కిస్తూ... ఒక విద్యార్థినే నలుగురిగా చూపిస్తున్నారు. ఇది.. జగన్ మార్కు మాయ!

అందరికీ సీట్లు కష్టం..!

- 2019 నాటి పరిస్థితులు వేరు: పవన్
- అప్పుడు స్వేచ్ఛగా కేటాయించాం
- ఇప్పుడు పొత్తులో ఇవ్వలేం
- కొత్తగా బీజేపీ కూడా రాబోతోంది
- పదవుల బాధ్యత నాది.. నన్ను నమ్మండి
- జగన్ ఓడిపోవాలి.. అదే మన లక్ష్యం
- విశాఖ, గోదావరి నేతలకు జనసేనాని దిశానిర్దేశం
- ఓటు బదిలీ జరగాల్సిందేనని స్పష్టీకరణ
- ఈ వారంలోనే ఢిల్లీ పర్యటన!


రాజమండ్రిలో జనసైనికులతో మాట్లాడుతున్న పవన్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పార్టీలో టికెట్ల ఆశావహులు అధికంగా ఉన్నారని.. కానీ అందరికీ సర్దుబాటు చేయడం కష్టమని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పొత్తుల్లో ఉన్నప్పుడు అన్ని సీట్లు ఇవ్వడం సాధ్యం కాదన్నారు. టీడీపీ, జనసేన ఓట్లు పరస్పరం బదిలీ కావలసిన అవసరాన్ని నొక్కిచెప్పారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ జగన్ ఓడాలి. జనసేన- తెలుగుదేశం కలసి అధికారంలోకి రాబోతున్నాయి. బీజేపీ కూడా కలిసి వస్తోంది. అందరూ ఐక్యంగా పనిచేయాలి. ఓటు బదిలీ కావాలి. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి. 2019 ఎన్నికల్లో సీట్లు ఆశించిన వారందరికీ స్వేచ్ఛగా టికెట్లు కేటాయించగలిగాం. ప్రస్తుత పరిస్థితులు వేరు. అర్థం చేసుకోండి. మీరుంటేనే నేనుంటాను. నేనుంటేనే పార్టీ ఉంటుంది' అని చెప్పారు. ఆదివారం విశాఖలో ఉత్తరాంధ్ర నేతలతో, సోమ, మంగళవారాల్లో రాజమండ్రిలో ఉమ్మడి గోదావరి జిల్లాల నాయకులతో ఆయన సమావేశాలు జరిపారు. పొత్తులో భాగంగా అనుసరించాలిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. 'పొత్తుల్లో ఉన్నప్పుడు కొన్ని కుదరవు. అందరికీ సీట్లు కేటాయింపు సాధ్యం కాదు. నన్ను నమ్మి పార్టీ కోసం పని చేయండి. నాయకులకు ఏయే పదవులు ఇవ్వాలన్న బాధ్యత నాకు వదిలేయండి. కష్టపడి పని చేసిన వారిలో ఎవరినీ మరచిపోను. అందరినీ గుర్తు పెట్టుకుని, న్యాయం చేస్తాను. ఎవరూ అధైర్యపడొద్దు. నాతో పాటు పోటీ చేసే మెజారిటీ సభ్యులను అసెంబ్లీకి తీసుకెళ్తాను. సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగే ప్రతి ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా మూడో వంతు సీట్లు మనకు వస్తాయి. అప్పుడు అందరికీ అవకాశాలు లభిస్తాయి, ముందు మనకు రాష్ట్ర భవిష్యత్ ముఖ్యం. ప్రస్తుతం వైసీపీని ఓడించడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన ముందుకెళ్తున్నాయి. త్వరలో బీజేపీ కూడా కలవబోతోంది. మూడు పార్టీల నాయకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది. పొత్తుల గురించి ఎక్కడా తక్కువ చేసి మాట్లాడొవద్దు. పార్టీ సూచనలు అందరూ కచ్చితంగా పాటించాలి. వైసీపీ ఉంటే రాష్ట్రానికి భవిష్యత్ లేదు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేవు. ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇలాంటి సమయంలో రాష్ట్రానికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని పేర్కొన్నారు. టికెట్లు ఆశిస్తున్న కొందరు నాయకులతో ఆయన వ్యక్తిగతంగా కూడా సమావేశమయ్యారు. బుధవారం ఉదయానికి ఆయన మంగళగిరి పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. తర్వాత కృష్ణా, గుంటూరు, ప్రకాశం నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తారు. ఈ వారంలోనే ఢిల్లీ పర్యటన ఉండే అవకాశం ఉంది.

రాజమండ్రి రూరల్ నుంచి మేమే

ఎక్కువ సీట్లు తీసుకుని సద్వినియోగం చేసుకోకపోతే వైసీపీకి లబ్ధి: పవన్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాపుల ప్రాబల్యమున్న గోదావరి జిల్లాలకు వచ్చి కాపులకు రిజర్వేషన్లు ఇచ్చేది లేదన్న జగన్.. అధికారంలోకి రాగానే ఈడబ్ల్యుఎస్ కోటాలో పెట్టిన 5శాతం రిజర్వేషన్లను కూడా తొలగించారని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. దీనివల్ల కాపులు నష్టపోయారని తెలిపారు. పచ్చటి కోనసీమలో చిచ్చురేపిన జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే అశాంతి ప్రబలుతుందని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జనసేన కార్యాలయంలో మంగళవారం ఆయన రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల ముఖ్యనాయకులతో సమీక్ష నిర్వహించారు. 'ఈ ఎన్నికల ప్రక్రియలో మన ప్రతి అడుగూ వ్యూహాత్మకమే, కూటమి అభ్యర్థులు గెలిచేవిధంగా పనిచేయాలి. టీడీపీతో పొత్తు ఇవాళ రాష్ట్రానికి బాగా అవసరం. పొత్తు ప్రకటించింది రాజమహేంద్రవరంలోనే. ఇక్కడ మన ముద్ర ఉండాలి. రాజమండ్రి రూరల్‌లో గత ఎన్నికల్లో మనకు మంచి సంఖ్యలో ఓట్లు వచ్చాయి. ఈ స్థానం నుంచి మనమే పోటీ చేస్తాం. కందుల దుర్గేశ్‌ను వదులుకోం. పొత్తులో మనం ఎక్కువ సంఖ్యలో స్థానాలు తీసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే వైసీపీకి లబ్ధి కలుగుతుంది. మనం ఒంటరిగా పోటీచేస్తే 40 స్థానాల్లో గెలుస్తాం. కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం పొత్తు నిర్ణయం చేశాం. ఈ క్రమంలోనే సీట్ల సర్దుబాటు ఉంటుంది' అన్నారు. గోదావరి జిల్లాలకు మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి వచ్చి చిచ్చులు రేపుతున్నారన్నారు.


చిత్తూరు జిల్లా కొడతనపల్లెలో మృతుడు వెంకటేశ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భువనేశ్వరి

మీ బిడ్డల బాధ్యత నేను తీసుకుంటా!

- మృతుల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ
- 3 లక్షల చొప్పున సాయం.. గుడుపల్లెలో అన్న క్యాంటీన్ ప్రారంభం

కుప్పం, ఫిబ్రవరి 20: 'మీ బిడ్డల బాధ్యత నేను తీసుకుంటా. బాధ పడొద్దు' అంటూ మృతుల కుటుంబాలకు నారా భువనేశ్వరి ధైర్యం చెప్పారు. ఆమె మంగళవారం చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం గుడుపల్లె, కుప్పం మండలాలలో పర్యటించారు. అక్రమ కేసులపై చంద్రబాబు జైలుకెళ్లినప్పుడు మనస్తాపంతో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను పరామర్శించారు. తొలుత ఆమె బెంగళూరునుంచి గుడుపల్లె మండలం కొడతనపల్లె చేరుకున్నారు. ఇక్కడ మృతుడు వీ వెంకటేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి తల్లిదండ్రులు చౌడమ్మ, వెంకటేశ్, భార్య సౌమ్య, పిల్లలు తులసీరామ్, మోక్షిత్, మౌర్యను పలకరించి ఓదార్చారు. రూ.3 లక్షల చెక్కు అందించారు. చిన్నారులైన వెంకటేశ్ బిడ్డల బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె గుడుపల్లె రైల్వే స్టేషన్ సర్కిల్ సమీపంలో అన్న క్యాంటీన్ ప్రారంభించారు. మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. యామగానిపల్లెలో మృతుడు జి.శ్రీనివాసులు (కొండలప్ప) కుటుంబాన్ని పరామర్శించారు. అతడి భార్య పద్మను ఓదార్చి రూ.3 లక్షల చెక్కు ఇచ్చారు. అక్కడినుంచి కుప్పం చేరుకుని చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పీ మనోహర్ ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. అనంతరం కుప్పం మున్సిపాలిటీ 3వ వార్డులోని చర్చికి వెళ్లి ప్రార్థనలు జరిపారు.

నూజివీడు టీడీపీ ఇన్‌చార్జిగా పార్థసారథి

- టీడీపీకి ముద్దరబోయిన రాజీనామా

అమరావతి(ఆంధ్రజ్యోతి), నూజివీడు, ఫిబ్రవరి 20: ఏలూరు జిల్లా నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ మంత్రి కొలుసు పార్థసారథి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్థసారథి ప్రస్తుతం కృష్ణా జిల్లా పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇప్పటివరకూ నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మంగళవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసి వైసీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకొన్నారు. నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

సాయం తక్కువ.. డప్పు ఎక్కువ!

ముస్లింలకు జగన్ మార్క్ మోసం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'సాయం తక్కువ.. సందడి ఎక్కువ' అన్నటుగా ఉంది జగన్ సర్కార్ తీరు. జగన్ బటన్ ఎన్నిసార్లు నొక్కినా ముస్లిం మైనార్టీలకు ఒరిగిన లబ్ధి మాత్రం గతం కన్నా తక్కువే. లబ్ధిదారుల సంఖ్య కూడా తక్కువే. చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 40,302 మంది ముస్లిం యువతుల వివాహానికి 'దుల్హన్ పథకం' కింద రూ.50 వేల చొప్పున రూ.201.51 కోట్లు ఆర్థికసాయాన్ని అందించింది. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని నిలిపివేయడంతో ముస్లిం సంఘాలు కోర్టుకి వెళ్లాయి. దీంతో మూడేళ్ల తర్వాత కోర్టు ఆదేశాలతో దుల్హన్‌కు పేరు మార్చి 'షాదీ తోఫా' పేరుతో అరకొరగా అమలు చేస్తున్నారు. ముస్లిం యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇవ్వకుండా, ముస్లిం విద్యా సంస్థల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించకుండా గాలికి వదిలేసింది. ఇక, పేద ముస్లింలకు గత ప్రభుత్వం ఇచ్చిన రంజాన్ తోఫాను రద్దు చేసింది. షాదీ తోఫాకు నిబంధనల చట్రం బిగించి కొందరికే పరిమితం చేసి లబ్ధిదారుల సంఖ్య తగ్గించి ఏదో గొప్పగా చేసినట్లు చెబుతోందనే విమర్శలు మైనారిటీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనారిటీ' అంటూ వాళ్ల ఓటు బ్యాంకును కొల్లగొట్టే వ్యూహంతో కపట ప్రేమ చూపిస్తున్నారని ముస్లింలు మండిపడుతున్నారు. జగన్ తన ఐదేళ్ల కాలంలో 6,280 మందికి మాత్రమే సాయం చేశారు. ఆ సాయం రూ.లక్ష వంతున చేశారని అనుకున్నా రూ.62.8 కోట్లకు మించలేదు. అంటే గత ప్రభుత్వం కన్నా తక్కువ సాయం చేసిన జగన్ సర్కార్ ఎక్కువ చేసినట్లుగా చెప్పుకొంటోంది. షాదీ తోఫాను.. కల్యాణమస్తుతో కలిపి అంకెలగారడీ చేయడం గమనార్హం. ఎన్నికలు సమీపిస్తుండడంతో విడతల పేరుతో బటన్ నొక్కడం.. అంకెల గారడీ చేయడం జగన్మాయగా మారింది. కల్యాణమస్తు పథకానికి ఈ ఐదేళ్ల కాలంలో ఎంత మందికి ఆర్థిక సాయం చేశారు, షాదీ తోఫా పథకం కింద ఎంత మంది ముస్లిం యువతులకు సాయం చేశారు, మొత్తం ఎన్నికోట్లు అనే పూర్తి అంశాలు విడివిడిగా చెప్పకుండా అంకెలగారడీ చేసి 10 వేల మందికి ఇచ్చామని ప్రచారం చేయడం గమనార్హం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కింది ఎంత మందికి లబ్ధి చేకూరింది అనే అంశాలను గోప్యంగా ఉంచారు.


టీడీపీ హయంలో దుల్హన్ అమలు ఇలా

2015-16లో లబ్ధిదారుల సంఖ్య 2,584 మంది కాగా, అందిన సాయం రూ.12.92 కోట్లు. 2016-17లో 9,822 మందికి రూ.49.11 కోట్లు, 2017-18లో 11,920 మందికి రూ.5,960 కోట్లు, 2018-19లో 15,976 మందికి రూ.79.88 కోట్లు ఇచ్చారు. దుల్హన్ పథకం కింద ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున అందించిన సాయం రూ.201.51 కోట్లు. వీటితోపాటు.. ముస్లిం మైనార్టీలకు చంద్రబాబు పలు సంక్షేమ పథకాలను అమలు చేశారు. విద్యా సంస్థల ఏర్పాటు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా చిరు వ్యాపారులకు రుణాలు అందించారు.

కల్యాణమస్తు, షాదీతోఫా నిధులు విడుదల

- రూ.78.53 కోట్లు విడుదల చేసిన సీఎం జగన్

గత ఏడాది అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 10,132 జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా నిధులను సీఎం జగన్ మంగళవారం విడుదల చేశారు. మొత్తం రూ.78.53 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. షాదీతోఫా, కల్యాణమస్తు.. దాదాపుగా 10,132 మంది జంటలకు మంచి చేసే కార్యక్రమమని తెలిపారు. పిల్లలను చదువులను ప్రోత్సహిస్తూ వధూవరులు ఇద్దరూ పదోతరగతి పాసై ఉండాలన్న నిబంధన పెట్టామన్నారు. గతంలో ఎస్సీలకు రూ.40 వేలకే పరిమితమైన పథకాన్ని రూ.లక్ష వరకు పెంచినట్టు తెలిపారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.1.20 లక్షల వరకు ఇస్తున్నట్టు తెలిపారు. ఇది ఐదో విడత కార్యక్రమమని, ఇప్పటి వరకు 56,194 జంటలకు రూ.427 కోట్లు అందించామని వివరించారు.





సర్పంచ్‌ల సంఘం సమావేశంలో చేసిన తీర్మానాన్ని విడుదల చేస్తున్న పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ, ఇతర సభ్యులు

జగన్‌ను ఇంటికి పంపేందుకు మేమూ సిద్ధం

» ఏపీ సర్పంచుల సంఘం ఏకగ్రీవ తీర్మానం

విజయవాడ (గవర్నర్‌పేట), ఫిబ్రవరి 20: 'ఎన్నికలకు జగన్ సిద్ధం అంటున్నారు. ఆయన్ని ఇంటికి పంపడానికి మేమూ సిద్ధమే' అని ఏపీ సర్పంచుల సంఘం ఏకగ్రీవ తీర్మానం చేసింది. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి, సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను ఇంటికి పంపడానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లు, కార్పొరేటర్లు సిద్ధంగా ఉండాలని ఏపీ సర్పంచ్‌ల సంఘం పిలుపునిచ్చింది. ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్, ఏపీ సర్పంచ్‌ల సంఘం ప్రతినిధుల సంయుక్త సమావేశం మంగళవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. సమావేశానికి పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. సీఎం వైఎస్ జగన్‌ను ఓడించాలని సర్పంచ్‌లకు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లకు పిలుపునిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. జగన్ ఓడితేనే సర్పంచ్‌లకు మనుగడ ఉంటుందని, గ్రామ పంచాయతీలకు భవిష్యత్తు ఉంటుందని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తమ సమస్యలపై పోరాటాలు చేస్తున్నారని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా 3 కోట్ల మంది గ్రామీణ ప్రజల ఇబ్బందులను ఢిల్లీ వరకు తీసువెళ్లి అనేక ఉద్యమాలు చేసినట్లు వెల్లడించారు. సర్పంచ్‌ల సమస్యలపై సీఎం జగన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఉద్యమాలు చేసి అలసిపోయామని, విసిగిపోయామని అన్నారు. రాజకీయ పరమైన నిర్ణయమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు. ఫిబ్రవరి 25లోగా సర్పంచ్‌ల 16 డిమాండ్లు నెరవేర్చని పక్షంలో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈనెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ నిరాహారదీక్షలు, కలెక్టరేట్‌ల ముందు ధర్నాలు చేయాలని కమిటీలు పిలుపునిచ్చాయి. 'జగన్ ఓడితేనే మన మనుగడ' అనే నినాదంతో అన్ని పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు పనిచేయాలని నిర్ణయించాయి. సమావేశంలో ఏపీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శి పగడాల రమేశ్, ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రాజ్యసభకు వైసీపీ అభ్యర్థులు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారంరిటర్నింగ్ అధికారి విజయరాజు వారికి ధృవీకరణ పత్రాలు అందించారు. ధృవీకరణ పత్రాలు స్వీకరించాక వారు ముగ్గురూ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభకు ఎన్నికైనందుకు వారిని సీఎం అభినందించారు. దీంతో రాష్ట్రం నుంచి మొత్తం 11 మంది రాజ్యసభ సభ్యులూ వైసీపీకి చెందినవారే అయ్యారు.

ఓట్లు వేయించండి... ఉద్యోగాలు ఇస్తాం

» వలంటీర్లకు ఎమ్మెల్సీ దువ్వాడ ఎర

సంతబొమ్మాళి, మెళియాపుట్టి, ఫిబ్రవరి 20: 'వచ్చే ఎన్నికల్లో కష్టపడి మాకు ఓట్లు వేయించండి. అధికారంలోకి రాగానే మూలపేట పోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తాం' అని టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వలంటీర్లకు ఎర వేశారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. 'రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు వైసీపీ విజయానికి కృషి చేయాలి. మండలంలో పనిచేస్తున్న 444 మంది వలంటీర్లకు పోర్టులో ఉద్యోగాలు వేయిస్తాం. అలాగే వలంటీర్ తన పరిధిలోని 50 కుటుంబాల్లో ఇద్దరు అర్హులను గుర్తించాలి. వారికి కూడా ఉద్యోగాలు పోర్టులో ఇప్పిస్తాం. వలంటీర్లు పోర్టు ఉద్యోగాలకు వెళ్తే ఆ ఖాళీల్లో 444 మందిని కొత్తగా నియమిస్తాం' అని దువ్వాడ ప్రకటించారు.

వలంటీర్లకు నోటీసులు

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మేజర్ పంచాయతీలోని రెండో సచివాలయం పరిధిలో 38 మంది వలంటీర్లు ఉండగా... అధికారులు 28 మందికి నోటీసులు అందజేశారు. సచివాలయం 3లో 32 మంది వలంటీర్లు ఉండగా... 25 మందికి మంగళవారం ఎంపీడీవో నోటీసులు జారీ చేశారు. దీంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న బిరుదులతో నగదు పారితోషికం ఇచ్చి సన్మానాలు చేస్తోంది. మరోవైపు సక్రమంగా పనిచేయడం లేదంటూ నోటీసులు అందజేస్తోందని వలంటీర్లు వాపోతున్నారు. ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు సక్రమంగా అందజేయని వలంటీర్లకు నోటీసులు ఇస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

కొత్తగా రూ.900 కోట్ల అప్పు

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కొత్తగా రూ.900 కోట్ల అప్పు తెచ్చింది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించి ఈ అప్పు తీసుకుంది. ఈ రూ.900 కోట్ల అప్పును 15 సంవత్సరాల్లో చెల్లించాలి. దీనిపై 7.44 శాతం వడ్డీ అమలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జగన్ సర్కారు తెచ్చిన మంగళవారం అప్పులు రూ.68,900 కోట్లకు చేరుకున్నాయి.

ప్రాంతాలవారీగా కాంగ్రెస్ బహిరంగ సభలు!

» అనంత, విశాఖ, గుంటూరు, జంగారెడ్డిగూడెంలో పెట్టే యోచన

» సభల్లో పాల్గొననున్న ప్రియాంక, కర్ణాటక, తెలంగాణ సీఎంలు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రాంతాలవారీగా బహిరంగ సభలను నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకువెళ్లాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) నిర్ణయించింది. ఇందుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) మద్దతు ఇస్తోంది. 2014 నుంచి ఇప్పటిదాకా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని ఏఐసీసీ అంతంతగానే పట్టించుకుంటూ వచ్చింది. అయితే, వైఎస్ కుమార్తె షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టిన తర్వాత పరిస్థితి మారింది. అందులోభాగంగా ఆ పార్టీ అనంతపురం, గుంటూరు, జంగారెడ్డిగూడెం, విశాఖల్లో బహిరంగ సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 26వ తేదీ సాయంత్రం అనంతపురంలో జరిగే బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారు. అమరావతి రాజధానిని బలపరుస్తూ గుంటూరులో జరిపే బహిరంగ సభలో ప్రియాంక గాంధీ పాల్గొంటారు. జంగారెడ్డిగూడెంలో చేపట్టనున్న బహిరంగ సభలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య పాల్గొంటారు. విశాఖలో జరగనున్న బహిరంగ సభలో రాహుల్‌గాంధీ పాల్గొంటారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జంగారెడ్డిగూడెం లేదా విశాఖ బహిరంగ సభల్లో పాల్గొంటారు. నిజానికి, ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఏఐసీసీ నిర్ణయించింది. ప్రజా సమస్యలపైనా పెద్దఎత్తున కార్యక్రమాలను చేపట్టాలని నిశ్చయించింది. ఇందులో భాగంగా ఈ నెల 22న షర్మిల నేతృత్వంలో సెక్రటేరియేట్ ముట్టడికి ఆ పార్టీ సిద్ధమవుతోంది.

రాష్ట్రాన్ని జగన్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారు: పల్లంరాజు

సీఎం జగన్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశారని ఏపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ ఎంఎం పల్లంరాజు విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన మేనిఫెస్టో కమిటీ రెండో సమావేశంలో ఆయన మాట్లాడారు.

రూ.లక్ష కోట్ల ఆస్తి ఉన్న అతి పేదవాడు!

» రానున్న ఎన్నికలు జగన్ అహంకారానికి, ప్రజల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధం: లోకేశ్

» ఉత్తరాంధ్రలో ముగిసిన లోకేశ్ యాత్ర

మాడుగుల/నర్సీపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఉత్తరాంధ్ర ప్రాంతానికి పట్టిన దరిద్రమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడుతున్నారన్నారు. పేదలు, పెత్తందారులకు మధ్య యుద్ధమని ఆయన పదే పదే అంటున్నాడని, నిజమే.. జగన్ రూ.లక్ష కోట్లు ఆస్తి ఉన్న పేదవాడని ఎద్దేవా చేశారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం సురవరం, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గంలోని కోటవురట్లలో జరిగిన సభల్లో మాట్లాడారు. రానున్న ఎన్నికలు జగన్ అహంకారానికి, ప్రజల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధమన్నారు. పాఠశాలల విలీనం నిర్ణయంతో పేద పిల్లలను ఆయన చదువుకు దూరం చేశాడని విమర్శించారు. దేశంలో డ్రాపౌట్లు 12.6 శాతం ఉంటే, దక్షిణ భారతంలో అత్యధికంగా ఏపీలోనే 16.3 శాతం ఉందని చెప్పారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తే 117 జీవో(పాఠశాలల విలీనానికి ఉద్దేశించినది) రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు కట్ చేస్తారని వలంటీర్ల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ప్రజలెవరూ నమ్మొద్దని కోరారు. ఇంకా ఏమన్నారంటే..

బూతులకు రత్నాలు..

ఎన్నికలకు ముందు నవరత్నాలని చెప్పి, గెలిచాక బూతులకు రత్నాలిస్తున్నారు. రాష్ట్రంలో మొదటి బూతురత్నం 'సన్న బియ్యం సన్నాసి' కొడాలి నాని. జగన్‌కు బాగా ఇష్టమైనవి బూతులే. ప్రతి రోజూ అవి విన్నాకే నిద్రపోతాడు. జగన్ అరాచక పాలనకు సహకరిస్తున్న అందరి పేర్లూ రెడ్‌బుక్‌లో రాస్తున్నాను. మాది అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం. జగన్‌ది రాజారెడ్డి రాజ్యాంగం. మేం ప్రజల్లో ఉంటే, జగన్ పరదాల చాటున ఉంటాడు. టెన్త్ పరీక్ష పత్రాల దొంగతనం కేసులో ఆయన్ను హైదరాబాద్‌లో పంజాగుట్ట ఎస్‌ఐ చితకబాదారు. గడచిన నాలుగున్నరేళ్లలో 32 వేల పాఠశాలల్లో ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. టీడీపీ హయాంలో నిర్మించిన భవనాలకు రంగులు వేయించి తన ప్రభుత్వమే కట్టినట్లు జగన్ గొప్పలు చెప్పుకొంటున్నాడు. ఉత్తరాంధ్రను జగన్ భ్రష్టు పట్టిస్తున్నాడు. ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతానికి కొత్తగా ఒక్క పరిశ్రమను తీసుకురాలేదు. మా హయాంలో విశాఖ జిల్లాకు పరిశ్రమలు తీసుకువస్తే.. కోడిగుడ్డు మంత్రి దెబ్బకు అవన్నీ పారిపోతున్నాయి. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ప్రయత్నాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కర్మాగారం ప్రైవేటుపరం కాకుండా బాధ్యత తీసుకుంటాం.

> రూ.లక్ష విలువ చేసే చెప్పులు, వెయ్యి రూపాయల మంచినీటి బాటిల్ తాగే అతి పేదవాడు జగన్.. భారతీ సిమెంట్స్, సండూరు పవర్, పేపర్, చానల్, హైదరాబాద్, బెంగళూరు, తాడేపల్లిల్లో ప్యాలెస్‌లు ఉన్న పేదవాడు.
>
> చంద్రబాబును, పవన్ కల్యాణ్‌ను, నన్ను బూతులు తిట్టాలని కలెక్టర్లను, నాయకులను ఆదేశించడం సిగ్గుచేటు. మమ్మల్ని తిడితేనే ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ అని షరతు పెడుతున్నారు. - లోకేశ్

ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదేలే!...

వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై అనేక కేసులు పెట్టారు. నాపైనా 22 కేసులు పెట్టారు. అందులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, హత్యాయత్నం కేసులూ ఉన్నాయి. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదేలే. 2019కి ముందు ఏనాడూ పోలీసు స్టేషన్‌కు వెళ్లలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికి ఏడుసార్లు స్టేషన్‌కు పిలిచారు. పదిహేనేళ్ల సీఎంగా, 15 ఏళ్ల ప్రతిపక్ష నేతగా పనిచేసిన నేత చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి జైలులో నిర్బంధించారు. టీడీపీ, జనసేన మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ పేటీఎం బ్యాచ్ కుట్రలు పన్నుతోంది. రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. 'హలో ఏపీ, బైబై వైసీపీ...' నినాదానికి కట్టుబడి ఉండాలి. చంద్రబాబును ముసలోడని జగన్‌రెడ్డి అంటున్నాడు. తిరుపతి కొండను జగన్, చంద్రబాబు ఒకేసారి ఎక్కితే ఎవరు ముందు ఎక్కి దిగుతారో తేలిపోతుంది. బస్సు దిగాలన్నా జగన్‌కు స్టూల్ ఉండాలి, కొబ్బరికాయ కొట్టాలన్నా ఆ రాయిని ఇద్దరు పైకి ఎత్తితే తప్ప కొట్టలేని పరిస్థితి.



నర్సీపట్నం శంఖారావం సభలో విల్లు ఎక్కుపెట్టిన లోకేశ్

10 రోజులు.. 31 నియోజకవర్గాలు

» 'శంఖారావం'లో 1,225 కిమీ ప్రయాణం

ఉత్తరాంధ్రలో టీడీపీ యువనేత లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్ర మంగళవారంతో ముగిసింది. గత పది రోజుల్లో 31 నియోజకవర్గాలను ఆయన చుట్టేశారు. 1,225 కిలోమీటర్లు ప్రయాణం సాగించారు. ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సభలకు జనం భారీఎత్తున హాజరయ్యారు. వివిధ వర్గాల ప్రజలు ఆయన్ను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. రెండు నెలల్లో రాబోయే ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో టీడీపీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. 11న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభించిన యాత్ర.. పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల మీదుగా అనకాపల్లి జిల్లా వరకు సాగింది. సగటున రోజుకు మూడు నియోజకవర్గాలపై సమీక్షలు నిర్వహించారు. బాగా పనిచేసిన నేతలు, కార్యకర్తలను గుర్తించి సర్టిఫికెట్లు అందించారు.

చిన్నారులపై ప్రయోగాలకు అనుమతించలేం

» ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను ఎలా అనుమతిస్తారు?: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనుమతించడాన్ని హైకోర్టు ప్రాథమికంగా తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందంది. చిన్నారులపై ప్రయోగాలు చేయడానికి అనుమతించబోమని తేల్చిచెప్పింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఉండగా ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను ఎలా అనుమతిస్తారని ప్రశ్నించింది. ఒక దశలో నోటిఫికేషన్‌పై స్టే విధించేందుకు సిద్ధపడింది. అడ్వకేట్ జనరల్ (ఏజీ) జోక్యం చేసుకుంటూ.. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 22న హాల్ టికెట్లు కూడా జారీ చేస్తారని చెప్పారు. వివరాలు సమర్పించేందుకు విచారణను బుధవారానికి వాయిదా వేయాలని అభ్యర్థించారు. అంగీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ నెల 12న ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టుల భర్తీకి బీఈడీ అభ్యర్థులను అనుతించడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా రెంటచింతలకు చెందిన బుక్యా గోవర్ధన్‌సాయి నాయక్, మరో నలుగురు డీఈడీ అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇదే వ్యవహారంపై ప్రకాశం జిల్లా, అద్దంకికి చెందిన బొల్లా సురేశ్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు రాగా.. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఎస్జీటీ పోస్టుల భర్తీకి బీఈడీ అభ్యర్థులను అనుమతించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యా హక్కు(ఆర్టీఈ) చట్టంలోని సెక్షన్ 23, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని అన్నారు. ఎస్జీటీ పోస్టుల భర్తీకి డీఈడీ అభ్యర్థులు మాత్రమే అర్హులని సుప్రీం స్పష్టంచేసిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సర్క్యులర్ ఇచ్చిందన్నారు. అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో మార్పులు చేశామని, 3-8వ తరగతి వరకు ప్రాథమిక విద్య పరిధిలోకి తీసుకొచ్చామని చెప్పారు. ప్రస్తుత విద్యావిధానంలో బీఈడీ, డీఈడీ అభ్యర్థులు ఇద్దరూ అవసరమన్నా రు. ధర్మాసనం స్పందిస్తూ... సుప్రీంకోర్టు నిర్దిష్టమైన ఆదేశాలిచ్చిన తర్వాత ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను ఎలా అనుమతిస్తారని ప్రశ్నించింది. టీచర్ల ఎంపిక ప్రక్రియ ముగిసిన తర్వాత వారిలో నైపుణ్యం పెంచేందుకు శిక్షణ ఇస్తామన్న ప్రభుత్వ వాదనను అంగీకరించలేమని పేర్కొంది. చిన్నారులతో ప్రయోగాలు చేయడాన్ని అనుమతించలేమంది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

అన్నీ అబద్ధాలే!

» హామీలు.. ఒక్కటీ నిజం కాదు

» ఉద్యోగులకు మంచి చేయాలనే సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదు

» 27న 'చలో విజయవాడ' ఖాయం

» ఏపీజేఏసీ చైర్మన్ బండి వ్యాఖ్యలు

» విజయవాడలో ఉద్యోగుల మహాధర్నా.. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

"ఉద్యోగుల సమస్యల పట్ల మొసలికన్నీరు కారుస్తున్న ప్రభుత్వం.. చెప్పే మాటలు, ఇస్తున్న హామీలు అన్నీ అబద్ధాలే" అని ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. ఐదేళ్లు కావస్తున్నా.. ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదంటే ప్రభుత్వం ఏ విధంగా అబద్ధాలు చెబుతోందో అర్థమవుతోందన్నారు. హామీలను వాయిదాలు వేస్తున్నారే తప్ప అమలు చేయటం లేదన్నారు. ఉద్యోగులకు ఏ కోశానా మేలు చేయాలనే సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఈ నెల 27న తలపెట్టిన 'చలో విజయవాడ' మహా ఆందోళన కార్యక్రమంతో ఈ ప్రభుత్వానికి గట్టి సమాధానం చెబుతామన్నారు. ఏపీజేఏసీ ఉద్యమ శంఖారావంలో భాగంగా మంగళవారం విజయవాడలోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ, చర్చల పేరుతో వాయిదాలు వేస్తూ, అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై నమ్మకం సడలిపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 11 సార్లు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారని, అవన్నీ చాయ్ బిస్కట్ సమావేశాలుగానే మిగిలిపోయాయన్నారు. తాము ఉద్యమానికి సిద్ధమని ప్రకటించిన ప్రతిసారీ సమావేశం అంటూ హడావుడి చేయటం మినహా ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు.



విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న బండి శ్రీనివాసరావు, జేఏసీ నేతలు

నిరసనలు-ధర్నాలు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిందేనని ఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాకుళంలోని కలెక్టరేట్ సమీపంలో ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ బకాయిలు రూ.23,500 కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. కర్నూలులో నిర్వహించిన ధర్నాలో ఏపీ జేఏసీ ప్రధాన కార్యదర్శి హృదయరాజు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయలని డిమాండ్ చేశారు. తొలుత జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. నెల్లూరులో నిర్వహించిన ధర్నాలో ఏపీజేఏసీ వైస్ చైర్మన్, రాష్ట్ర ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శోభన్ బాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందచేశారు. పార్వతీపురంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కదం తొక్కారు. జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని నినాదాలు చేశారు. ఏలూరులో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ర్యాలీ, ధర్నా చేపట్టాయి. ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన సాగిస్తామన్నారు.

జగన్‌లో ప్రజాస్వామ్య ధోరణి లేదు: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

సీఎం జగన్‌లో ప్రజాస్వామ్య ధోరణి లేదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. గుంటూరులో ఉద్యోగులు నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు పలికారు. "12 పీఆర్సీ సమయంలో ఉద్యోగ సంఘ నేతలతో చర్చిస్తే ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేది. తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తే తప్ప పరిష్కారం దొరకదు" అని కేఎస్ అన్నారు.

రాష్ట్రంలో ఐదు విద్యాసంస్థలు ప్రారంభం

» విశాఖ ఐఐఎం, తిరుపతిలో ఐఐటీ, ఐసర్, ట్రిపుల్ ఐటీ.. కర్నూలులో ఐఐఐటీడీఎం క్యాంపస్‌లు ప్రారంభించిన మోదీ

» దేశవ్యాప్తంగా 36 విద్యా సంస్థలు జాతికి అంకితం

విశాఖపట్నం, తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి), కర్నూలు (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 20: రాష్ట్రంలో ఐదు ప్రముఖ విద్యాసంస్థల క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎంవి) క్యాంపస్‌తో పాటు, తిరుపతి జిల్లాలోని ఐఐటీ, ఐసర్, శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు, కర్నూలు నగరంలో ఐఐఐటీడీఎం(డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్)ను కూడా ఆయన ప్రారంభించారు. ఇలా దేశవ్యాప్తంగా ఐఐటీ, ఐసర్, ఐఐఎం తదితర 36 జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వికసిత్ భారత్ సంకల్పంతో భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.



కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుపై ఏర్పాటు చేసిన ఐఐఐటీడీఎం

తిరుపతి జిల్లాలోనే మూడు

తిరుపతి జిల్లాలోని ఐఐటీ, ఐసర్, శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లను ప్రధాని మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. దేశవ్యాప్తంగా ఐఐటీ, ఐసర్, ఐఐఎం తదితర 36 జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలను మోదీ ప్రారంభించగా అందులో తిరుపతి జిల్లాకు చెందిన మూడు సంస్థలు ఉన్నాయి.

టీడీపీ సీనియర్ నేత మర్రెడ్డిపై హత్యాయత్నం!

» ఆర్థిక లావాదేవీలపై పిలిపించి దాడి

» తలకు తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

» దాడి చేసింది డాక్టర్ అసిస్టెంటే

» దగ్గరుండి ప్రోత్సహించిన జిమ్స్ వైద్యుడు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 20: తెలుగుదేశం రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఆయన తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో ఒంగోలులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీనివాసరెడ్డి బంధువైన డాక్టర్ మర్రెడ్డి రామచంద్రారెడ్డి ఒంగోలులోని జయరామ్ హాల్ సమీపంలో జిమ్స్ ఆస్పత్రిని 2020లో ప్రారంభించారు. అందులో శ్రీనివాసరెడ్డి సుమారు రూ.2 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఇటీవల తన పెట్టుబడి తిరిగి ఇవ్వాలని అడుగగా.. రామచంద్రారెడ్డి ఓ ఐదు లక్షలను బ్యాంకు నుంచి బదిలీ చేశారు. మిగిలిన నగదు విషయం మంగళవారం మాట్లాడుకుందామని చెప్పి ఆస్పత్రికి రమ్మన్నారు. గదిలో ఇద్దరూ మాట్లాడుకుంటున్న సమయంలో వెనుక నుంచి అకస్మాతుగా డాక్టర్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే బాలు వచ్చి శ్రీనివాసరెడ్డిపై దాడి చేశాడు. బలమైన ఆయుధంతో ఆయన తలపై కొట్టాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి కిందపడిపోయారు. కేకలు విని కారు డ్రైవర్ రమేశ్ లోపలకు వెళ్లిచూడగా శ్రీనివాసరెడ్డి రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే ఆయన్ను కిందకు తీసుకొచ్చి స్థానిక సంఘమిత్ర ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగానే ఉన్నా.. 24 గంటలు పరిశీలనలో ఉంచినట్లు వైద్యులు తెలిపారు. కాగా.. ఈ దాడికి సంబంధించి శ్రీనివాసరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాక్టర్ రామచంద్రారెడ్డి బాలును కొట్టుకొట్టు అంటూ పోత్సహించారని ఆరోపించారు. ఫిర్యాదుపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఒంగోలు వన్‌టౌన్ సీఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసరెడ్డిని పరామర్శించారు. దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.


టీడీపీలోకి వెళితే కాళ్లు విరగ్గొడతా!

» వెళ్లాలనుకుంటే పార్టీకి రాజీనామా చెయ్

» మహిళా కౌన్సిలర్‌కు రాచమల్లు బెదిరింపు

» ఎమ్మెల్యే నుంచి రక్షణ కావాలంటూ ఎస్పీని ఆశ్రయించిన కౌన్సిలర్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 20: "పార్టీకి రాజీనామా చేయకుండా టీడీపీలోకి వెళితే కాళ్లు విరగ్గొడతా.. వాడూ వీడూ కాదు నేనే వస్తా.. మీ అంతుచూస్తా" అని వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వైసీపీ మహిళా కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మిని, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ రామాంజనేయులరెడ్డిని బెదిరించారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో రాచమల్లు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో పర్యటించారు. ఆ వార్డు వైసీపీ కౌన్సిలర్ వెంకటలక్ష్మి, ఆమె భర్త రామాంజనేయులరెడ్డి ప్రచారంలో పాల్గొనలేదు. దీంతో ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దీనికి ఆమె గత పదేళ్లుగా మీవెంట ఉన్నామని, అయినా తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీంతో రాచమల్లు ఆగ్రహంతో ఊగిపోయారు. పరుష పదజాలంతో దూషించారు. ఆ సమయంలో కౌన్సిలర్ భర్త రామాంజనేయులరెడ్డి ఇంట్లో లేరు. అయినా.. ఎమ్మెల్యే ఆయనను ఉద్దేశించి.. "వాడి కి చెప్పు.. రాజీనామా చేయకుండా టీడీపీలో తిరిగితే మీ కథ చెబుతా" అని బెదిరించారు. ఈ సంఘటనను కౌన్సిలర్ కుటుంబసభ్యులు సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు. ఈ వాయిస్ రికార్డును సోషల్ మీడియాలో పెట్టారు. దీనిపై రామాంజనేయులరెడ్డి మాట్లాడుతూ.. గతంలో తమ కుమార్తెకు అమెరికాలో విద్యాభ్యాసం కోసం అబాకస్ సంస్థ నడుపుతున్న ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌ను కలిశామన్నారు. అది తెలిసి తనను ఎమ్మెల్యే పిలిపించి నిలదీసినట్టు తెలిపారు. గత మూడేళ్లుగా ఎమ్మెల్యే తమమీద అనుమానంతో దూరంపెడుతూ వచ్చారన్నారు. మూడేళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నామన్నారు. అయినా తాము వైసీపీని వీడలేదని తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు బెదిరించిన వాయిస్ రికార్డును ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాచమల్లు నుంచి రక్షణ కావాలని అన్నారు.



రామాంజనేయులరెడ్డి, వెంకటలక్ష్మి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దేవుడి సొమ్ముకు రికవరీ ఏదీ..?

● తిరిగి వసూలు చేసే సత్తా అధికారులకు లేదా..? ● అవినీతికి పాల్పడిన అధికారిణికి పెద్దపీట ● ఆరోపణలపై తూతూమంత్రపు విచారణలేనా?

వన్‌టౌన్, ఫిబ్రవరి 20: 8నెలల క్రితం గవర్నరుపేటలోని శ్రీ విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం షాపుల అద్దెల వసూలులో కిరికిరి జరిగిందని ఆరోపణలు వచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదు. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో దీనిపై ప్రత్యేక కథనాలు వచ్చాయి. అప్పట్లో ఈవోగా పనిచేసిన అధికారిణి అవినీతి, అక్రమాలపై ఆరోపణలను నిరూపిస్తూ అర్చకబృందాలు, భక్తులు, షాపు అద్దెదారులు ఏకరువు పెట్టడంతో కదలివచ్చిన దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విచారణ జరిపారు కానీ, ఫలితం మాత్రం తేల్చలేదు. ఈ దేవస్థానం భ్రమరాంబ మల్లేశ్వరాలయం (పాతశివాలయం)కు అనుబంధంగా ఉండడంతో అక్కడి ఈవోనే వ్యవహారాలన్నీ చూసేవారు. ఈ క్రమంలో అప్పట్లో ఈవోగా ఉన్న ఎస్.హేమలతాదేవిపై డిప్యూటీ కమిషనర్ విజయరాజు శాఖపరమైన విచారణ జరిపినప్పుడు షాపుల అద్దెల విషయంలో అవకతవకలు జరిగాయని నిరూపితమైంది. ఆమె సమక్షంలోనే బాహాటంగానే విచారణ జరిగింది. అలాగే పాతశివాలయంలోనూ అవకతవకలు జరిగినట్టు విమర్శలు వచ్చాయి. ప్రాథమిక విచారణ జరిపిన అధికారులు ఆమెను వేరే చోటికి బదిలీ చేశారు. కొన్నాళ్ల తరువాత పెండింగ్ విచారణ పేరుతో ఆమెకు పెద్దపీట వేసి మళ్లీ వేదాద్రి దేవస్థానానికి పోస్టింగ్ ఇచ్చారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఆమె తన అత్తగారికి, అమ్మగారికి సేవలు చేయాల్సి ఉండడంతో తనకు ఉద్యోగం ఇవ్వాలని చేసిన అభ్యర్థనను దేవదాయ కమిషనర్ పరిగణనలోకి తీసుకుని పోస్టింగ్ ఇచ్చారు. తరువాత ఆమెపై హెడ్ ఆఫీస్‌లో ఆర్‌జేసీగా పనిచేస్తున్న దర్భముళ్ల భ్రమరాంబ విచారణ జరిపారు. కానీ ఏం తేలిందన్నది గోప్యంగా ఉంచారు. ఇదిలా ఉంటే గతేడాది జూన్ నాటికే సత్యనారాయణస్వామి దేవస్థానానికి చెందిన షాపుల అద్దెలు సుమారు రూ.50లక్షలు మాజీ ఈవో వసూలు చేసి చేతివాటం ప్రదర్శించారు. ఈ విషయం స్పష్టంగా తేలినా రికవరీ విషయంలో ఇంతవరకు చర్యలు లేదు. అసలు ఆమె నుంచి రికవరీ చేసే సత్తా అధికారుల వద్ద ఉందా? లేదా అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమెకు పోస్టింగ్ ఇవ్వడంలో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. ఏడాదికి రూ.కోటి పైగా ఆదాయం ఉన్న వేదాద్రి దేవస్థానానికి అవినీతికి పాల్పడిన అధికారిణిని ఎలా నియమిస్తారని దేవదాయశాఖ ఉద్యోగులే విమర్శిస్తున్నారు. ఇటీవల రూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రకటించారు. ఈపనులు ఏ మేరకు సక్రమంగా జరుగుతాయనేది అనుమానమేనని పలువురు వ్యక్తపరుస్తున్నారు.

స్పందించని డీసీ విజయరాజు

సత్యనారాయణ స్వామి దేవస్థానం షాపుల లీజులు, అద్దెల వసూలుతో పాటు గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఏం చర్యలు తీసుకుంటున్నారన్న దానిపై దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజును సంప్రదించబోగా అందుబాటులోకి రాలేదు. ఫోన్ కాల్‌కు సమాధానం ఇవ్వలేదు.



గవర్నరుపేటలో శ్రీ విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన భవనం



నగరంలో ఇండియా వస్త్ర ప్రదర్శన ప్రారంభం

లబ్బీపేట, ఫిబ్రవరి 20: సంప్రదాయత నుంచి ఆధునిక ఫ్యాషన్ల విస్తృతశ్రేణి దుస్తుల ఇండియా ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందని జగదీశ్వర హస్తకళా ఎక్స్ ఎండీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. లబ్బీపేటలోని ఏ కన్వెన్షన్ నందు మంగళవారం ఇండియా వస్త్ర ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశామని దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మగ్గాలపై నేసిన ఎన్నో రకాల ఉత్పత్తులు ఇక్కడ లభిస్తాయని, చేనేత కార్మికులు తమ సిల్క్, కాటన్ వస్త్రాలను తగ్గింపు ధరల్లో విక్రయిస్తున్నారన్నారు. డిజైనర్ వస్త్రాలు, బ్లౌజులు, కుర్తాలతో పాటు మహారాష్ట్ర నుంచి పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక నుంచి బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్ చీరలు, గుజరాత్ నుంచి బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోల చీరలు, బీహార్ నుంచి టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్, తమిళనాడు నుంచి కంజీవరం, ఎంబ్రాయిడరీ సిల్క్, కాశ్మీర్ నుంచి జమ్మూ అండ్ తావి సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ నుంచి చందేరి అండ్ మహేశ్వరి సిల్క్ చీరలు, దుప్పట్లు, సల్వార్ సూట్ మెటీరియల్స్, కాంతావర్క్ చీరలు, లినెన్ చీరలు, ఢకాయ్ మాస్లిన్ సిల్క్, బెడ్ షీట్లు, మగవారు మక్కువపడే కాటన్, రాజస్థాన్ నుంచి వివిధ తలపాగాలు ఈ ఎగ్జిబిషన్ నందు లభిస్తాయన్నారు. ఈ నెల 20 నుంచి 23 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇగ్నో విద్యార్థులకు బంగారు పతకాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 20: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ విభాగం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో చదువుకుంటున్న ముగ్గురు విద్యార్థులకు బంగారు పతకాలు లభించాయి. న్యూఢిల్లీలోని ఇగ్నో ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన 37వ స్నాతకోత్సవంలో కర్నూలు ఉస్మానియా కళాశాల ఇగ్నో అధ్యయన కేంద్రానికి చెందిన దూదేకుల ఆరిఫా బీఏలో ప్రభుత్వ పాలనా శాస్త్ర హనర్స్ డిగ్రీని పొందారు. విజయవాడ సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాలకు చెందిన ఆరాధన గులేరియా ఇగ్నో అధ్యయన కేంద్రం ద్వారా బీఎస్సీ నర్సింగ్ కోర్సును చేశారు. తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని డాక్టర్ గాయత్రి అర్పిత ఇగ్నో అధ్యయన కేంద్రం ద్వారా జంతుసంక్షేమ కోర్స్‌లో పీజీ డిప్లొమా పొందారు. ఢిల్లీలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ వీరికి బంగారు పతకాలను బహూకరించారు. విజయవాడ ఇగ్నో ప్రాంతీయ కేంద్ర సంచాలకురాలు కే.సుమలత, ఉపసంచాలకుడు డాక్టర్ బి.ప్రసాద్‌బాబు విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.



ఉపరాష్ట్రపతి ధన్‌ఖర్ నుంచి పతకాలు అందుకుంటున్న ప్రాంతీయ ఇగ్నో విద్యార్థిని ఆరాధన గులేరియా

జర్నలిస్టులపై దాడి హేయం

అంబేడ్కర్ సాక్షిగా కొవ్వొత్తుల ప్రదర్శన

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు కృష్ణపై దాడిని ఖండిస్తూ మంగళవారం రాత్రి బందరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టు సంఘాల ఐకాసా ఆధ్వర్యంలో శాంతియుత నిరసన, కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. వృత్తి ధర్మం నిర్వర్తిస్తున్న జర్నలిస్టులపై మూకదాడి అమానుషమని, వారిని అరెస్టు చేసే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నేతలు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు పిరికిపంద చర్యలన్నారు. ఇటువంటి హేయమైన చర్యలను పార్టీ నేతలు ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రాణం పోయేలా కొట్టే తప్పులు జర్నలిస్టులు ఏం చేశారని ప్రశ్నించారు. వివిధ మాధ్యమాల్లో దాడికి పాల్పడిన వారు స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు ఎందుకు అరెస్టులు చేయడం లేదన్నారు. ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిడి రావడం వల్లే పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని జరుగుతున్న సంఘటనలు తెలియజేస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని నేతలు పేర్కొన్నారు. వివిధ పార్టీల వారికి జర్నలిస్టుల పట్ల ఏమైనా అభ్యంతరాలుంటే అడ్డు చెప్పడానికి అనేక మార్గాలున్నాయని, దాడులే మార్గమైతే బూతులు తిట్టే నేతలను ఎన్నిసార్లు కొట్టాలని ప్రశ్నించారు. నిరసనలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



ఏకాదశి పర్వదినాన సూర్యారాధన

వన్‌టౌన్, ఫిబ్రవరి 20: మాఘమాసంలో ఆదివారాలు, ఏకాదశి పర్వదినాల వంటి ప్రత్యేక తిథుల్లో సూర్యారాధన చేయడం వల్ల ప్రజలకు ఆయురారోగ్యాలు లభిస్తాయని నమ్మిక. దుర్గగుడిలో ప్రత్యేకంగా మాఘమాసంలో ఆయా ప్రత్యేక రోజుల్లో సకల జనుల సంతోషాల సౌభాగ్యాలను కోరుకుంటూ ఆరోగ్యాలను కాంక్షిస్తూ సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మాఘశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలను నిర్వహించారు. సూర్య యంత్ర స్థాపన చేసి సూర్యనమస్కారాలు, అరుణ పారాయణ, ఆదిత్యహృదయ పారాయణ నిర్వహించారు. ఆరోగ్యాన్ని ప్రసాదించడం కేవలం సూర్యుడు వల్లే సాధ్యమన్నది పురాణాల్లో ఉంది. ప్రత్యేకించి మాఘమాసం సూర్యనారాయణ స్వామికి ప్రీతికరమైన రోజులు కావడంతో ఆయన్ను పలు విధాలుగా స్తుతించారు.



ఏకాదశి పర్వదిన సందర్భంగా సూర్యారాధన చేస్తున్న అర్చకస్వాములు

దుర్గమ్మకు వెండి నివేదన పాత్ర కానుక

ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గమ్మకు కోదాడ సమీపంలోని కోతాడకు చెందిన నీల సత్యనారాయణ, అరుణదేవి మంగళవారం ఆలయానికి విచ్చేసి 2 కిలోల 903 గ్రాముల బరువుగల 5 గిన్నెల వెండి నివేదన పాత్రను కానుకగా సమర్పించారు. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు ద్వారా కానుకను అందజేశారు. వారికి అమ్మవారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనార్థం మంగళవారం ప్రముఖులు ఆలయానికి విచ్చేశారు. ఎంపీ, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబసభ్యులు, రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఛైర్మన్ జంకే వెంకటరెడ్డి ఉన్నారు. అధికారులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు వారికి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం ఇవ్వగా వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

పొగమంచుతో విమాన రాకపోకలు ఆలస్యం

● గాలిలో చక్కర్లు కొట్టి ల్యాండైన విమానాలు

గన్నవరం, ఫిబ్రవరి 20: పొగమంచు వల్ల గన్నవరం విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ఆలస్యంగా నడిచాయి. మంగళవారం తెల్లవారుఝాము నుంచి దట్టంగా మంచు పడటంతో విమానాలు దిగేందుకు అనుకూలమైన వాతావరణం లేకపోవటంతో గాలిలోనే చక్కర్లు కొట్టాయి. షార్జా నుంచి గన్నవరం విమానాశ్రయానికి 84మంది ప్రయాణికులతో ఉదయం 7.05 గంటలకు వచ్చిన విమానం ల్యాండింగ్ అయ్యేందుకు ప్రతికూల వాతావరణం ఉండటంతో 30నిమిషాల పాటు గాలిలో చక్కర్లు కొట్టి హైదరాబాద్ వెళ్లి ల్యాండ్ అయ్యింది. తిరిగి 12గంటలకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చింది. తిరిగి 178 మంది ప్రయాణికులతో షార్జా వెళ్లింది. హైదరాబాద్ నుంచి 7.35కు ఇండిగో విమానం వచ్చింది. అలాగే చెన్నై, బెంగళూరు నుంచి ఇండిగో విమానాలు రాగా గాలిలోనే చక్కర్లు కొట్టాయి. 8.32కు ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానం రన్‌వేపై ల్యాండ్ అయ్యేందుకు అవకాశం లేకపోవటంతో గాలిలోనే చక్కర్లు కొట్టి అరగంట తరువాత దిగింది. ఢిల్లీ వెళ్లేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ విమానాశ్రయానికి వచ్చారు. ఢిల్లీ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి వచ్చారు. వీరిద్దరికీ అరగంటకు పైగా ఆలస్యమైంది. విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగించటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డున పడ్డ కుటుంబాలను ఆదుకోండి

● ఆర్టీసీలో మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 20: ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తూ తీవ్ర అనారోగ్యానికి గురై మెడికల్ అన్‌ఫిట్ అయితే తమ కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులు సుగుణాకర్, బ్రహ్మయ్య, టీవీ.రావు, వీరభద్రుడు మంగళవారం ఒక ప్రకటనలో సీఎం జగన్‌ను వేడుకున్నారు. అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని 2015లో సంస్థ జీవో జారీ చేయడం జరిగిందన్నారు. సంస్థ కోసం అనేక ఏళ్లు కష్టపడ్డామని దురదృష్టవశాత్తు అనారోగ్యం బారిన పడి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికారుల తప్పిదంతో 150 కుటుంబాల రోడ్డున పడ్డాయన్నారు. 40 మంది ఇప్పటికే మృతి చెందారన్నారు. తెలంగాణలో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించారన్నారు. ఇప్పటికైనా తమ పిల్లలకు ఉద్యోగాలివ్వాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

నవ జ్యోతిర్లింగ ప్రత్యేక పర్యాటక రైలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 20: మహాశివరాత్రి సందర్భంగా భారత్ గౌరవ్ పథకం కింద ఉలా రైల్ ఆధ్వర్యంలో నవ జ్యోతిర్లింగ ప్రత్యేక పర్యాటక రైలు యాత్ర ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ట్రావెల్ టైమ్ ప్రొడక్ట్ డైరెక్టర్ ఎం.వీ.విఘ్నేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర మార్చి 6 నుంచి 18 వరకు 13 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ ప్రత్యేక రైలు కోయంబత్తూరు నుంచి బయలుదేరి విజయవాడ, వరంగల్ స్టేషన్లో ఆగుతుందన్నారు. యాత్ర విశేషాలు వివరించడం, భోజనం తదితర అన్ని సదుపాయాలను ప్రయాణికులను కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలు, టికెట్లు బుకింగ్ కోసం 78761 01010 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ ప్రత్యేక యాత్ర అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కామన్‌సైట్‌కు ప్రహారీ నిర్మాణమెప్పుడో?

ఊర్మిళానగర్ స్థలంపై కబ్జాదారుల డేగ కన్ను

భవానీపురం, ఫిబ్రవరి 20: 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో ఐరన్‌యార్డుకు సంబంధించిన రెండెకరాల కామన్‌సైట్ ప్రహారీ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. నిధులుండీ ఏమిటీ నిర్లక్ష్యమన్న చర్చ సాగుతోంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులు ప్రారంభానికి వెనుకాడటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రూ.కోట్ల విలువైన స్థలాన్ని కబ్జాచేయడానికి చాలామంది శత విధాలా ప్రయత్నాలు చేయగా ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెనక్కి తగ్గారు. కొన్ని నెలలు క్రితం నుంచి నిర్మాణ పనులకు శంకుస్థాపనకు దిమ్మ ఏర్పాటు చేశారు. పనులు చేయాలన్న చిత్తశుద్ధి ప్రజాప్రతినిధులు, అధికారులకు ఉందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా కొంతమంది పశ్చిమ ప్రజాప్రతినిధుల అనుచరులు పలుగు, పార పట్టుకుని సోమవారం రాత్రి అటువైపుగా సంచరించినట్టు స్థానికులు చెబుతున్నారు. వైసీపీ సీనియర్ నేత సూరసాని రామిరెడ్డి, స్థానికులు అక్కడకు వెళ్లడంతో వారు పలాయనం చిత్తగించినట్టు తెల్సింది. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ సెంట్రల్‌లో పోటీకి సమాయత్తమవడంతో శంకుస్థాపన ఆయన చేతులమీదుగా చేయడానికి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పనులు జాప్యంపై స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డిని వివరణ కోరగా రూ.65 లక్షలు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే కొబ్బరికాయ కొట్టించి పనులు చేయిస్తామన్నారు.



ఊర్మిళానగర్ కామన్‌సైట్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం దిమ్మ నిధులుండీ నిర్లక్ష్యం?



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న సంఘం నేతలు

కౌలు రైతుల సమస్యలను ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టండి

● ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం

ధర్నాచౌక్, ఫిబ్రవరి 20: కౌలు రైతుల రక్షణ, సంక్షేమానికి సమగ్రమైన కౌలు విధానం రూపొందించాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. దాసరిభవన్‌లో సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతుల మ్యానిఫెస్టోను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఏ.కాటమయ్య, పి.జమలయ్య మాట్లాడారు. ఎన్నికల తర్వాత రాబోయే ప్రభుత్వాలు ఎలాంటి షూరిటీ లేకుండా రూ.1.60 లక్షల వరకు పంట రుణాలు జారీ చేయాలన్నారు. గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుభూమిలో 80 శాతం, సాగుదారుల్లో 70 శాతం వరకు కౌలు రైతులే పంటలు పండిస్తున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారంపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాలన్నారు. నేతలు డేగా ప్రభాకర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎస్.లక్ష్మణరావు, పలువురు సంఘం నేతలు పాల్గొన్నారు.

వైసీపీకి ఇద్దరు మహిళా నేతల బైబై


చిట్టినగర్, ఫిబ్రవరి 20: 44, 49వ డివిజన్లకు చెందిన ఇద్దరు మహిళా నేతలు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం ప్రైజర్‌పేట ఎర్రకట్ట రోడ్డులో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేశారు. 49వ డివిజన్‌కు చెందిన సిరిగినేని అమ్మాజీ, 44వ డివిజన్‌కు చెందిన కంచి మల్లేశ్వరి వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లో వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజారాజ్యంలో చేరామని, నాటి నుంచి నేటివరకు వెలంపల్లి వెంటే ఉంటూ అంకితభావంతో పార్టీ అభ్యున్నతికి కృషి చేశామన్నారు. 2019లో వెలంపల్లి శ్రీనివాసరావు గెలుపునకు అహర్నిశలు శ్రమించి పని చేశామని, వెల్లంపల్లి మాత్రం తమ వంటి సీనియర్లను పక్కన పెట్టి 2019లో వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని అందలం వెక్కించారని ఆరోపించారు. ప్రస్తుతం పశ్చిమ ఇన్‌చార్జిగా ఉన్న షేక్ ఆసిఫ్ అదేదారిలో సీనియర్లను, పార్టీకోసం పనిచేసేవారిని పట్టించుకోకుండా భజన పరులను వెంటబెట్టుకొని తిరుగుతున్నారని, సీనియర్ నేతలను, కార్యకర్తలను గుర్తించకపోవడంతో వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి తామిరువురూ రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

వంశీ అనుచరుడి హత్యకేసులో ట్రయల్ ప్రారంభం

విజయవాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడు వడ్లమూడి మోహన్‌కృష్ణ హత్య కేసు విచారణకు సంబంధించి స్థానిక 8వ ఏసీఎంఎం కోర్టులో ట్రయల్ మొదలైంది. వంశీకి మోహన్‌కృష్ణ ప్రధాన అనుచరుడు. ఆయనను 2011 జూలై 15న నిడమానూరుకు చెందిన వల్లభనేని నాగరాజ్ కుమార్‌తో కొంత మంది హత్య చేశారు. అనంతరం దీన్ని రోడ్డుప్రమాదంగా చిత్రీకరించడానికి యత్నించారు. మోహన్‌కృష్ణ మృతదేహాన్ని నిడమానూరు జాతీయ రహదారికి పక్కన పడేసి, రోడ్డుప్రమాదంగా చిత్రీకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి వల్లభనేని నాగరాజుతో 15మందిని నిందితులుగా గుర్తించి కోర్టులో చార్జిషీటును దాఖలు చేశారు. సాక్షులుగా ఉన్న తుపాకుల అప్పారావు, యలమంచిలి శివరామ్, యలమంచిలి పూర్ణచంద్రబాబును విచారించారు. మంగళవారం యలమంచిలి హరిశ్చంద్రప్రసాద్‌ను న్యాయస్థానం విచారించింది. అనంతరం కేసును బుధవారానికి వాయిదా వేసింది. నిందితుల తరఫున న్యాయవాది కిలారు బెనర్జీ వాదనలు వినిపించారు.

పేదలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 20: పేదలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు కనెక్ట్ టూ ఆంధ్రా పేరుతో బృహత్తర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఇందుకు ఆర్‌బీఎల్ బ్యాంక్ భాగస్వామ్యం కావడం ముదావహమని రాష్ట్ర ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఎక్స్ ఆఫిషియో కార్యదర్శి గిరిజా శంకర్ చెప్పారు. నగరంలోని కనెక్ట్ టూ ఆంధ్ర కార్యాలయంలో మంగళవారం సుమిత్ బండారి ఆధ్వర్యంలోని ఆర్‌బీఎల్ బ్యాంక్ బృందం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.5లక్షల చెక్కును గిరిజా శంకర్‌కు అందజేశారు. సీఈవో కోట శివశంకరరావు, ఆర్‌బీఎల్ హెడ్ సుమిత్ బండారీ, ప్రతినిధులు అరుణ్ ఝా, రాకేష్ దాస్, కే.విజయకుమార్, బ్రాంచ్ మేనేజర్ బి.వి జయరామ్ పాల్గొన్నారు.



ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం: కేఏ పాల్

విద్యాధరపురం, ఫిబ్రవరి 20: ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచారి అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను జగన్‌రెడ్డి హరిస్తున్నాడన్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసునని, జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు భూటకపు ప్రసంగాలు మాని దమ్ముంటే చర్చకు రావాలని సవాలు విసిరారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు-5కోట్ల ఆంధ్రులకు మధ్య యుద్ధం జరుగుతుందన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి మళ్లించి తన ఎస్సీ, ఎస్టీ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం: కేఏ పాల్

విద్యాధరపురం, ఫిబ్రవరి 20: ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచారి అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను జగన్‌రెడ్డి హరిస్తున్నాడన్నారు. ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు తెలుసునని, జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు భూటకపు ప్రసంగాలు మాని దమ్ముంటే చర్చకు రావాలని సవాలు విసిరారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు-5కోట్ల ఆంధ్రులకు మధ్య యుద్ధం జరుగుతుందన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి మళ్లించి తన ఎస్సీ, ఎస్టీ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

కెనరా బ్యాంక్ రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, ఫిబ్రవరి 20: సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కెనరా బ్యాంక్ రూ.లక్ష విరాళం అందించడం అభినందనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో కెనరా బ్యాంక్ అధికారులు రూ.లక్ష విరాళాన్ని అందించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగతంగాను, సంస్థల తరఫు నుంచి సాయుధదళాల పతాక నిధికి విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాలను అండగా ఉండాలన్నారు. 2022లో రూ.41.22 లక్షల నిధిని చేకూర్చి రెండు తెలుగురాష్ట్రాల్లో జిల్లా అగ్రభాగాన ఉందన్నారు. డీజేఎం సీహెచ్ వినయ్‌కుమార్ ఆర్య, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సూపరింటిండెంట్ వై.ఈశ్వరరావు పాల్గొన్నారు.



వైసీపీ, టీడీపీ, జనసేన మోదీకి తొత్తుపార్టీలు

● ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 20: రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీకి, మోదీకి తొత్తులుగా మారారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ధ్వజమెత్తారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అదానీకి అమ్మకూడదని గత ఏడాది హైకోర్టులో వేసిన కేసును ఈ రోజు అన్‌ఫిట్ అని కొట్టివేసిందని ఇది సరైంది కాదన్నారు. తనకు జ్యూడిషియల్ నాలెడ్జ్ లేదని, స్టీల్‌ప్లాంట్ వివరాలు తెలియదని కేసు కొట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పాలిస్తుంది వైసీపీ ప్రభుత్వమా? లేక అదానీనా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. రూ.8లక్షల కోట్ల విలువైన విశాఖస్టీల్‌ను కేవలం రూ.8 వేల కోట్లకే అదానీకి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరించడం వల్ల 45వేల కుటుంబాలు, 2లక్షల మంది రోడ్డున పడతారన్నారు. విశాఖపట్నం ఎంపీగా తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలన్నారు. మోదీని ఢీకొట్టే సత్తా తనకే ఉందన్నారు.

సిద్ధార్థ వైద్య కళాశాలశాఖ ఎన్నిక ఏకగ్రీవం

విజయవాడ ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 20: సిద్ధార్థ వైద్యకళాశాలలో ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్రానికి సంబంధించిన సిద్ధార్థ వైద్య కళాశాలశాఖకు జరిగిన ఎన్నికల ఫలితాలను డాక్టర్ జగన్మోహన్‌రావు ఎండోక్రైనాలజీ విభాగాధిపతి ప్రకటించారు. సిద్ధార్థ వైద్యకళాశాల శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ కె.రవి, కార్యదర్శిగా డాక్టర్ వాసిరెడ్డి అరుణ, కోశాధికారిగా డాక్టర్ పి.రత్నబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్ కుమార్, డాక్టర్ ఆనంద్‌కుమారి, డాక్టర్ సంపత్ ప్రియ కుమార్, వైస్ ప్రెసిడెంట్స్‌గా డాక్టర్ చిత్ర, డాక్టర్ దుర్గా రాణి, డాక్టర్ మధు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ కట్టా శ్రీనివాసరావు, డాక్టర్ జ్వలిత, డాక్టర్ గురవ రెడ్డి, కొంతమంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా డాక్టర్ ఎం.జగన్మోహన్‌రావు వ్యవహరించారు.



డాక్టర్ రవి, డాక్టర్ వాసిరెడ్డి అరుణ

జగన్ ప్రేరణతోనే మీడియాపై దాడులు: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'ఘోర పరాజయం ఖాయమని తేలడంతో వైఎస్ జగన్‌రెడ్డి తన అనుచరులను రెచ్చగొడుతున్నాడు. మీడియా, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై దాడులు చేయాలంటూ ప్రేరేపిస్తున్నాడు' అని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. కర్నూలులో ఈనాడు కార్యాలయంపై అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరుల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంతగా శాంతిభద్రతలు దెబ్బతిన్నాయి అని చంద్రబాబు మంగళవారం 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. కాగా, పత్రికా ప్రతినిధులపై జరుగుతున్న వరుస దాడులు వైసీపీ కార్యకర్తలు, గూండాల నైజాన్ని తెలియజేస్తోందని టీడీపీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ అన్నారు. జగన్ అసమర్థ పాలనను, అవినీతిని వెలికితీస్తున్న మీడియాపై తరచూ జగన్‌రెడ్డి చేస్తున్న విమర్శల నేపథ్యంలోనే ఈ దాడులు జరుగుతున్నాయన్నారు.

మీడియాపై దాడులు ఆటవిక పాలనకు పరాకాష్ఠ: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటి మీడియాపై సైకో జగన్ ఫ్యాక్షన్ దాడులు రాష్ట్రంలో ఆటవిక పాలనకు పరాకాష్ఠ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. 'సైకో జగన్ కాలకేయ సైన్యం మీడియా లక్ష్యంగా దాడులకు తెగబడుతోంది. అనంతపురం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ని అంతం చేయడానికి ప్రయత్నించింది. ఇప్పుడు ఏకంగా ఈనాడు కర్నూలు కార్యాలయంపైకి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వైకాపా రౌడీ మూకల్ని వదిలాడు' అని లోకేశ్ ఆ ప్రకటనలో మండిపడ్డారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా వేరొక ప్రకటనలో మీడియాపై దాడులను ఖండించారు.

మర్రెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గం: అచ్చెన్నాయుడు

తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం బాధాకరమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. వైసీపీ పాలనలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, మర్రెడ్డిపై హత్యాయత్నం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు గుంటూరులో టీడీపీ బృందం పర్యటన

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరులో డయేరియా బాధితులను టీడీపీ బృందం బుధవారం పరామర్శించనున్నది. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మహమ్మద్ నసీర్ డయేరియా బాధితులను పరామర్శించనున్నారు.

చరిత్రను తిరగరాసేలా టీడీపీ విజయం

- కూటమి దెబ్బకు వైసీపీ తునాతునకలు: ఎంపీ రఘురామరాజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చరిత్ర గతిని తిరగరాసేలా టీడీపీ నేతృత్వంలోని కూటమి విజయాన్ని సొంతం చేసుకోనుందని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు ఖరారు అవుతుందని, కూటమి దెబ్బకు వైసీపీ తుడిచిపెట్టుకుపోతుందని ఆయన అన్నారు. మంగళవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'కూటమి చేతిలో జగన్ తుక్కుతుక్కుగా ఓడి, దారుణ పరాభవాన్ని మూటగట్టుకోవడం ఖాయం. ఐప్యాక్‌తో పాటు వైసీపీని ప్యాక్ చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని రఘురామ అన్నారు.

జగన్‌ది యుద్ధం కాదు... వంచన: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతోందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారు. ఆయన పాలన పేరుతో పేదల నడుం విరగ్గొట్టే యుద్ధం చేస్తున్నారు. పేదల జేబులు ఖాళీ చేస్తూ పెత్తందార్ల జేబులు నింపుతూ ఆయన చేస్తోంది యుద్ధం కాదు... వంచన' అని తెలుగుదేశం పార్టీ ధ్వజమెత్తింది. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి కేఎస్ జవహర్ మంగళవారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఈ రాష్ట్రంలో బలహీన వర్గాల వారికి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 120 పథకాలు, దళితుల కోసం అమలు చేసిన 27 పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారు. చివరకు పెళ్లి కానుక వంటి సదుపాయాలను కూడా రద్దు చేశారు. పైగా విపరీతంగా అదనపు భారాలు మోపారు. కరెంటు బిల్లులు, మద్యం ధరలు, ఇసుక ధరలు, ఆర్టీసీ చార్జీలు, పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెంచాడు. పేదల నోరు మూయించి, పెత్తందార్లను మరింత పెత్తందార్లుగా చేయడానికి జగన్ యుద్ధం చేస్తున్నారు. ఆయనది నరకాసుర పాలన' అని జవహర్ విమర్శించారు.

కాకినాడ కమిషనర్, టీపీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

- సీఈవోకు టీడీపీ నేత షరీఫ్ ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ మున్సిపల్ కమిషనర్, టీపీఆర్వో అధికార పార్టీకి తొత్తులుగా మారి, ప్రతిపక్షంపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం సీఈవోకు లేఖ రాశారు. 'కాకినాడలోని 83, 91 పోలింగ్ బూత్‌ల్లో 10 వేల ఓట్లలో ఎవరి ఓటు ఏ బూత్‌లో ఉందో అర్థం కాని పరిస్థితి కల్పించారు. ఒకే కుటుంబంలోని ఓట్లను ఒకే బూత్‌లో ఉంచకుండా ఎక్కడపడితే అక్కడికి మార్చారు. అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తూ, ఓట్లను జంబుల్ చేయించారు. వీరిపై తగిన చర్యలు తీసుకోవాలి' అని కోరారు. బీజేపీతో పొత్తు కోసం జగన్‌రెడ్డి చేయని ప్రయత్నం లేదని షరీఫ్ చెప్పారు. ఎన్నికల సమయంలో మైనార్టీల ఓట్ల కోసం జగన్ నాటకం ఆడుతున్నారని మండిపడ్డారు.

ప్రజా సంపదను దోచేసిన ఖిలాడీలు: ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 20: పూర్వకాలం పిండారీలు గ్రామాలపై పడి దోచుకున్నట్లు రాష్ట్రంపై పడి జగత్ ఖిలాడీలు వేల కోట్ల ప్రజా సంపదను నిలువు దోపిడీ చేశారని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా పొన్నూరులో మంగళవారం ప్రజా చార్జ్‌షీట్ పేరుతో టీడీపీ బహిరంగ సభ నిర్వహించింది. సభా వేదికగా ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రూ.2,540 కోట్లు దోచుకున్నట్లు నరేంద్ర ఆరోపిస్తూ వీడియోలు ప్రదర్శించారు.

'సిద్ధం' దేనికి..? జైలుకు వెళ్లడానికా: అయ్యన్న

నర్సీపట్నం, ఫిబ్రవరి 20: "జగన్‌రెడ్డి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. ఇటీవల 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రూ.800 కోట్లు పక్కదారి పట్టించారు" అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మంగళవారం నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టంలో నిర్వహించిన లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో అరాచక పాలన అందించడానికి సిద్ధమంటున్న జగన్... 'సిద్ధం' సభలకు రూ.వందల కోట్లు ఖర్చు పెడుతున్నారు. జగన్ సిద్ధం, సిద్ధం అంటున్నారు. దేనికి సిద్ధం..? జైలుకు వెళ్లడానికా..?" అని అయ్యన్న ప్రశ్నించారు.

బహ్రెయిన్‌లో అనాథలకు అంత్యక్రియలు

- కోనసీమ వాసి శివకుమార్ పెద్ద మనసు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తండ్రి మరణిస్తే కుమారులు చివరగా చేసే సంస్కారం అంత్యేష్ఠి. వేదమంత్రాల మధ్య కొడుకు తలకొరివి పెట్టే సంస్కారం మనది. మరి మృతుడి కుటుంబమే తమకు వద్దంటూ నిరాకరిస్తే ఏం చేయాలి..? అందునా జీవితంలో ఎక్కువ భాగం ప్రవాసంలో గడిపి దయనీయ పరిస్థితుల్లో మరణిస్తే వారికి దిక్కెవరు..? ఇలాంటి పరిస్థితుల్లో మరణించిన పశ్చిమ గోదావరి జిల్లా పెద్దపూడి మండలానికి చెందిన మేడపాటి శ్రీనుకు బహ్రెయిన్‌లోనే ప్రముఖ సామాజిక సేవకుడు డీవీ శివకుమార్ చొరవతో అంత్యక్రియలు నిర్వహించారు. 16 ఏళ్లుగా ఇంటికి వెళ్లకుండా గల్ఫ్‌లోనే ఉన్న శ్రీను ఈ ఏడాది జనవరి 6న తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీను కొంత కాలం క్రితం తాను పనిచేసే కంపెనీ నుంచి పారిపోయాడు. అతని వీసా గడువు కూడా ముగియడంతో సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో శివకుమార్ మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి వారితో మాట్లాడగా.. మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించుకొనే ఆర్థిక స్థోమత తమకు లేదని వారు చేతులెత్తేశారు. భారతీయ ఎంబసీ ఖర్చుతో పంపిస్తామని నచ్చచెప్పినా ఆ మృతదేహం తమకు అక్కర్లేదని, బహ్రెయిన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో శివకుమార్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీనుకు బహ్రెయిన్‌లోని హిందూ శ్మశానవాటికలో సంప్రదాయరీతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. శివకుమార్ ఇప్పటి వరకు 12 మందికిపైగా తెలుగు ప్రవాసీయులకు హిందూ సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా మిద్దెల హరి

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తికి చెందిన మిద్దెల హరిని ఏపీఎస్ఆర్టీసీ పాలకమండలి వైస్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ పదవిలో కొనసాగిన విజయానంద రెడ్డిని ఇటీవల చిత్తూరు వైసీపీ ఇంఛార్జిగా నియమించడంతో ప్రభుత్వం ఆయన స్థానంలో హరిని ఎంపిక చేసింది. ఈ మేరకు రవాణశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న ఉత్తర్వులు జారీ చేశారు.

మిలాన్.. మిలమిల..!

- అబ్బురపరిచిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్
- మిలాన్-2024లో భాగంగా తీరంలో కవాతు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిలాన్-2024లో భాగంగా మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్కే బీచ్ రోడ్డులో నిర్వహించిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ (అంతర్జాతీయ నగర కవాతు) రిహార్సల్ అబ్బురపరిచింది. భారత నౌకాదళం శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పింది. మిలాన్‌కు హాజరైన 50 దేశాల ప్రతినిధులు వారి జాతీయ పతకాలను చేతపట్టుకొని బృందాలవారీగా బీచ్ రోడ్డులో నిర్వహించిన కవాతు కళ్లు తిప్పుకోనివ్వలేదు. పలు దేశాలు వారి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే నృత్యాలు చేసి ఆకట్టుకున్నాయి. అంతకుముందు భారత వైమానిక దళం ప్రదర్శించిన సాహస విన్యాసాలు చూపరులను కట్టిపడేశాయి. సీ హాక్‌లు, సీకింగ్‌లు, తేజస్, డార్నియర్లు, జెట్ యుద్ధ విమానాలు గగనతలంలో గగుర్పొడిచే ప్రదర్శనలు చేశాయి. మెరైన్ కమెండోలు ఆకాశంలో ఎనిమిది వేల అడుగుల ఎత్తు నుంచి పారాచూట్ల సాయంతో సురక్షితంగా వేదిక వద్ద దిగి ముఖ్యఅతిథికి జ్ఞాపికను అందించిన దృశ్యం ఆకట్టుకుంది. 'ఫ్లై పాస్ట్' పేరుతో అరగంట సేపు ఆకాశంలో 60 యుద్ధ విమానాల ప్రదర్శన ఆశ్చర్యం కలిగించింది. విమాన వాహక నౌకలు విరాట్, విక్రాంత్‌లు ఠీవిగా సముద్రంలో నిల్చొని ఎటువంటి దాడినైనా తిప్పికొడతామనే భరోసా కల్పించాయి.





పౌల్ట్రీపై బర్డ్‌ఫ్లూ పడగ

నెల్లూరులో భారీగా కోళ్లు మృతి

- మూతపడుతున్న చికెన్ దుకాణాలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- వివిధ శాఖలతో 721 రాపిడ్ రెస్పాన్స్ టీంలు
- వ్యాధి వ్యాప్తిపై ఆందోళనలో జన సామాన్యం



అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌల్ట్రీ పరిశ్రమను బర్డ్ ఫ్లూ భయం వెంటాడుతోంది. ఇప్పటికే వ్యాధి బారినపడ్డ నెల్లూరు జిల్లా పౌల్ట్రీ నిర్వాహకులు, చికెన్ వినియోగదారులు వణికిపోతున్నారు. గత వారం నెల్లూరు జిల్లాలోని పలు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడ్డాయి. చనిపోయిన కోళ్ల నుంచి రక్త నమూనాలను సేకరించి భోపాల్‌లోని జాతీయ పశు వ్యాధుల నిర్ధారణ సంస్థకు పంపారు. వారు పరీక్షించి బర్డ్‌ఫ్లూగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన వెంటనే ఆయా గ్రామాలను వ్యాధి సంక్రమిత జోన్‌గా, అక్కడి నుంచి 10 కిలోమీటర్ల పరిధిని సర్వేలెన్స్ ప్రాంతంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్, రెవిన్యూ, అటవీ, పశు సంవర్ధక, ఇతర శాఖలతో 721 రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. పౌల్ట్రీలు అధికంగా ఉన్న కృష్ణా, గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పౌల్ట్రీ నిర్వాహకులను అధికారులు అప్రమత్తం చేశారు. ముఖ్యంగా విదేశీ వలస పక్షులు వచ్చే ఉభయగోదావరి, నెల్లూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాలతో పాటు ఇతర జలాశయాలున్న ప్రాంతాల్లోనూ రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. కోళ్లు, విదేశీ పక్షుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. పౌల్ట్రీ యజమానులు నిబ్బరంగా ఉండడానికి ఈ చర్యలేవీ ఉపయోగపడడం లేదు. వ్యాధి వ్యాప్తి విస్తృతమైతే సామూహికంగా కోళ్లు మృత్యువాత పడతాయన్న ఆందోళన వారిని వేధిస్తోంది. మరోవైపు పక్షి జాతితో పాటు మనుషులకు కూడా ఈ వైరస్ వల్ల ప్రమాదం ఉంటుందేమోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమౌతోంది. సాధారణంగా విదేశీ వలస పక్షుల ద్వారా బర్డ్‌ఫ్లూ పక్షి జాతులకు సంక్రమిస్తుంది. ఏటా సెప్టెంబరు నుంచి ఏప్రిల్ వరకు విదేశీ వలస పక్షులు ఏపీలోని కొల్లేరు, పులికాట్ సరస్సులతో పాటు పలు జలాశయాల వద్దకు వస్తుంటాయి. వాటి ద్వారా స్థానిక పక్షి జాతులకు బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం ఉందని పశువైద్యులు గతంలోనే వెల్లడించారు. అయితే పక్షుల నుంచి పశువులకు, మనుషులకు సోకే అవకాశం తక్కువ అని చెప్తున్నారు. కాగా, 2021లో రాజస్థాన్, హరియాణ, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ దెబ్బకి భారీ సంఖ్యలో కోళ్లు, కాకులు, పక్షులు చనిపోయాయి. నాటి నష్టాలు నేటికీ పౌల్ట్రీ నిర్వాహకులను వెంటాడుతూనే ఉన్నాయి. అందుకే బర్డ్‌ఫ్లూ పేరు చెప్తేనే పౌల్ట్రీ రంగం బెంబేలెత్తుతోంది.

ట్రక్కులు, ప్రైవేట్ బస్సులకు హైదరాబాద్‌లోకి నో ఎంట్రీ!

- రాత్రి 10 నుంచి ఉదయం 8 వరకే అనుమతి
- అతి భారీ వాహనాలకు అస్సలు అనుమతుల్లేవు
- సర్క్యులర్ జారీ చేసిన హైదరాబాద్ సీపీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజధాని నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేలా హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ట్రక్కులు, ప్రైవేటు బస్సులు, నిర్మాణ రంగం ఉపయోగించే భారీ వాహనాలను ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలోకి ప్రవేశించకుండా నిషేధించారు. ఆ తరహా వాహనాలను రాత్రి 10 నుంచి ఉదయం 8 గంటల వరకే అనుమతిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. వాహనాలను క్యాటగిరీలుగా విభజించి.. వేర్వేరు సమయాల్లో నిషేధాజ్ఞలు విధించారు.

- ఎస్-3/టీ-4 క్యాటగిరీకి చెందిన 10/12 టన్నుల పైన బరువు కలిగిన నాన్-లోకల్ భారీ వాహనాలు.. ట్రక్కులు, లారీలు, టస్కర్‌లు, ట్రైలర్‌లకు అనుమతి ఉండదు.
- ఎస్-3/టీ-4 క్యాటగిరీ 10/12 టన్నుల సామర్థ్యముండే లోకల్ లారీలు, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించిన లారీలు, ట్రక్కులు, టస్కర్‌లు, ట్రైలర్స్‌ను ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నగరంలోకి అనుమతించరు. రాత్రి 11 తర్వాతే 64 రూట్లలో అనుమతి.
- 3.5-12 టన్నుల మధ్య బరువుండే ఎస్-2 క్యాటగిరీ, 12 టన్నుల్లోపు లోడ్ సామర్థ్యమున్న టీ-4 క్యాటగిరీ వాహనాల(డీసీఎం, టెంపో వంటివి)కు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు.. తిరిగి రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు మాత్రమే నగరంలో అనుమతి ఉంటుంది. ఇతర సమయాల్లో వాటిపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయి.
- ఎం-3 క్యాటగిరీ ప్రైవేట్ బస్సులకు రాత్రి 10 నుంచి ఉదయం 8 వరకే సిటీలోకి అనుమతి ఉంటుంది.

గతంలోనూ..

2007-08 కాలంలోనూ ఈ తరహా నిషేధాజ్ఞలు నగరంలో కొనసాగాయి. ప్రైవేటు బస్సులు, భారీ లారీలు/ట్రక్కులకు రాత్రి 10 నుంచి ఉదయం 8 వరకు అనుమతి ఉండడంతో.. ఆ సమయంలో ప్రమాదాల సంఖ్య పెరిగాయి.

కోడికత్తి కేసు ఏప్రిల్ 19కి వాయిదా

విశాఖపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసు విచారణ ఏప్రిల్ 19వ తేదీకి వాయిదా పడింది. ఈ కేసులో ఐదేళ్లు జైలులో మగ్గిన నిందితుడు జనిపల్లి శ్రీనివాస్‌కు ఇటీవలే బెయిల్ లభించిన సంగతి తెలిసిందే. కేసు వాయిదా ఉండడంతో శ్రీనివాస్ విశాఖపట్నంలోని ఎన్ఐఏ కోర్టులో మంగళవారం హాజరయ్యాడు. నిందితుడు ఎక్కడ ఉంటున్నాడు? ఎక్కడి నుంచి వచ్చాడు? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నుంచి వచ్చినట్టు శ్రీనివాస్ తెలపగా, అంత దూరం నుంచి వస్తున్నారా?...అంటూ విచారణను ఏప్రిల్ 19వ తేదీకి వాయిదా వేశారు. నిందితుడి తరఫున న్యాయవాదులు అబ్దుల్ సలీం, పిచ్చుకల శ్రీనివాసరావులు హాజరయ్యారు. కోర్టు బయట న్యాయవాదులు, విదసం కన్వీనర్ బూసి వెంకటరావు విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కూడా కోడికత్తి కేసును అడ్డం పెట్టుకొని లబ్ధి పొందాలని జగన్ కుట్ర చేశారని, శ్రీనివాస్‌కు బెయిల్ లభించడంతో అది బెడిసి కొట్టిందన్నారు. జగన్‌కు ప్రత్యేక దర్యాప్తు సంస్థపై నమ్మకం లేదని, ఎన్ఐఏ దర్యాప్తును కోరుకున్నారని, ఇక్కడ కూడా కేసులో కుట్రకోణం లేదని తేలినందున దర్యాప్తు కొనసాగించడంలో అర్థం లేదని పేర్కొన్నారు. వెంటనే ఎన్ఐఏ దర్యాప్తు నుంచి విరమించుకుంటే మంచిదని బూసి వెంకటరావు సూచించారు.

బీజేపీతో జత కట్టే పార్టీలన్నీ మాకు శత్రువులే

- వైసీపీ, టీడీపీ, జనసేనలకు వ్యతిరేకంగా పోరాడతాం
- సీపీఐ-సీపీఎం ఉమ్మడి రాజకీయ సదస్సులో నారాయణ



విజయవాడలో వివిధ పార్టీల నేతల సంఘీభావం

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ (గవర్నర్‌పేట), ఫిబ్రవరి 20: "ఆంధ్రప్రదేశ్‌కు శత్రువు ఎవరైనా ఉన్నారంటే.. అది ప్రధాని మోదీ తప్ప ఇంకెవరూ కాదు. ఏపీకి అన్ని విషయాల్లోనూ తీరని అన్యాయం చేస్తున్న బీజేపీతో పొత్తు పెట్టుకునే పార్టీలు కూడా మాకు శత్రువులే. మాకు మోదీ ఎంతో.. వీళ్లూ అంతే" అని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలనుద్దేశించి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో ఆ నాలుగు పార్టీలను వ్యతిరేకిస్తూ.. విశాల ప్రాతిపదికన కలిసి వచ్చేవారందరినీ కలుపుకొని పోరాటం సాగించాలని రాష్ట్రంలోని వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో సీపీఐ-సీపీఎం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో రాష్ట్రస్థాయి ఉమ్మడి రాజకీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో నారాయణ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత బలమైన ప్రాంతీయ పార్టీగా ఉన్న వైసీపీ అధ్యక్షుడు జగన్.. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న మోదీ, అమిత్‌షాల కాళ్ల మీద పడుతున్నారని విమర్శించారు. రూ. 45 వేల కోట్ల అవినీతికి పాల్పడిన జగన్‌పై 11 కేసులున్నా బయట తిరుగుతున్నారంటే.. అమిత్‌షా కాళ్ల దగ్గర పడి ఉండటమే కారణమన్నారు. మోదీ ప్రపంచ దేశాలు తిరుగుతూ 400 సీట్లు గెలుస్తామని చెబుతున్నారని, విదేశీయులు దేశంలో ఓట్లు వేయరని, ఇక్కడి వాళ్లే వేస్తారని గుర్తించాలని నారాయణ అన్నారు. మోదీ కనుసన్నల్లోనే కేంద్ర ఎన్నికల సంఘం పనిచేస్తోందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాలను, పార్టీలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని ఆరోపించారు. జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వివి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశానికి మూడో ప్రత్యామ్నాయం చాలా అవసరమన్నారు. సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్లు రద్దు చేయడం స్వాగతిస్తున్నామన్నారు. రైతు సంఘం నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు కేవలం భయంతోనే బీజేపీతో జతకడుతున్నారని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడిని ఖండిస్తున్నామన్నారు. మీడియాకు అండగా వామపక్షాలు ఉద్యమిస్తాయన్నారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర ప్రత్యేక హోదా సాధన సమితి నాయకుడు చలసాని శ్రీనివాస్, తమిళనాడులోని వీసీకే పార్టీ నేత బాలసింగం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్పీఐ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్-విజయవాడ ఆరు వరుసలు

- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి పచ్చజెండా
- భూసేకరణ, విధానపరమైన ప్రక్రియలు వేగవంతం
- నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించడానికి అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో.. చౌటుప్పల్-అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డిని కలుపుతూ.. 182 కి.మీ మేర పనుల్లో వేగం పుంజుకోనుంది. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా ప్రకటించింది. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎం వెంట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రహదారుల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ఆర్ అంశాన్ని గడ్కరీ దృష్టికి తీసుకువచ్చారు. దానికి గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ.. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు ప్రతిపాదనలను పంపాలని జాతీయ రహదారుల సాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల విస్తరణకు అనుమతులతోపాటు.. పలు కీలకమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రాష్ట్ర రహదారుల జాబితాను గడ్కరీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం (చౌటుప్పల్-భువనగిరి-తూప్రాన్-సంగారెడ్డి-కంది) పరిధిలో యుటిలిటీస్ తొలగింపు వ్యయానికి సంబంధించి, దీనిపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చ జరిగింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరువరుసలకు పెంచడం, హైదరాబాద్-కల్వకుర్తి రోడ్డును నాలుగు వరుసల రహదారిగా విస్తరించడంపై రేవంత్ చేసిన విజ్ఞప్తులకు గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

మహిళపై వైసీపీ మూక దాడి

- రెండు కళ్లూ కోల్పోయిన వితంతువు



వైసీపీ శ్రేణుల దాడిలో కళ్లు దెబ్బతిన్నాక హంసవేణి

చిత్తూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లో ప్రత్యర్థులపై వైసీపీ శ్రేణుల దాడులు పెరిగాయి. ఓ మహిళపై వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలకు చెందిన మహిళలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఆమె రెండు కళ్లను కోల్పోయారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని టేకుమంద గ్రామానికి చెందిన హంసవేణి(35) భర్త రఘుపతి మరణంతో దివ్యాంగుడైన కుమారుడు సుమన్(16)తో కలిసి నివసిస్తోంది. గ్రామంలో నెల కిందట టీడీపీ పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్.. 'బాబు ష్యూరిటీ' కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె తమకు నీటి సమస్య ఉందని వివరించారు. దీంతో వైసీపీ సానుభూతిపరులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమెను వేధించడం ప్రారంభించారు. ఈ నెల 10న సాయంత్రం వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలకు చెందిన మహిళలు హరియమ్మ, వెంకటమ్మ, కళమ్మ, తులసమ్మ, గీత, వెంకటమ్మ, చిట్టెమ్మ, మణెమ్మలు మూకుమ్మడిగా హంసవేణిపై దాడికి దిగారు. ఇష్టానుసారం మొఖం మీద రాళ్లతో చితకబాదారు. గాయపడిన హంసవేణి రెండు కళ్లూ కోల్పోయారు. కాగా, ఈ దాడి ఘటనపై బంగారుపాళ్యం సీఐ నాగరాజురావు కేసు నమోదు చేశారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఉపాధి హామీ, తాగునీటి సరఫరాపై పంచాయతీరాజ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... కరువు ప్రభావిత ప్రాంతాలతో సహా, అన్ని జిల్లాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. కాగా, కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ కార్యదర్శి ఎస్‌సీఎల్ దాస్.. సీఎస్‌తో భేటీ అయ్యారు. ఎంఎస్ఎంఈ రంగంలో అమలు చేస్తున్న ప్రాజెక్టులపై చర్చించారు.

జనాన్ని తీసుకురండి!

- సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులకు టార్గెట్లు
- నేడు విశాఖ శారదా పీఠానికి సీఎం జగన్
- పాయింట్‌కు 500 మంది ఉండాలని లక్ష్యం
- ఆర్‌పీలు, వలంటీర్లకు బాధ్యతలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన అంటే విశాఖలో అధికారులతో పాటు ప్రజలు కూడా బెంబేలెత్తిపోతున్నారు. ఆయన వచ్చిన ప్రతిసారీ జన సమీకరణ చేయాలని ఆదేశిస్తున్నారు. వాహనం అద్దాలు దించని చోట కూడా ప్రజలతో చేతులు ఊపించాలని శాసిస్తున్నారు. దాంతో జనాలను తరలించడానికి అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఈసారి పార్టీ నాయకులకు కాకుండా అధికారులకే అన్ని బాధ్యతలు అప్పగించారు. చినముషిడివాడలోని శారదాపీఠంలో రాజశ్యామల పూజలో పాల్గొనడానికి సీఎం బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. విజయవాడ నుంచి ఉదయం 11.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి గోపాలపట్నం, వేపగుంట, పురుషోత్తపురం మీదుగా చినముషిడివాడలోని పీఠానికి వెళతారు. అక్కడ గంట సేపు ఉండి పూజలు చేస్తారు. తిరిగి మధ్యాహ్నం 12.55 గంటలకు విమానాశ్రయానికి చేరుకొని విజయవాడకు వెళతారు. విమానాశ్రయం నుంచి పీఠానికి వెళ్లే మార్గంలో 24 పాయింట్లు గుర్తించి, అక్కడ జనాలను ఉంచాలని జీవీఎంసీ అధికారులకు పై నుంచి ఆదేశాలు వచ్చాయి. ఒక్కో పాయింట్ వద్ద 500 మందికి తక్కువ లేకుండా మొత్తం పది వేల మందికి పైగా తేవాలని ఆదేశాలు అందాయి.

ఎవరెవరికి ఏఏ బాధ్యతలంటే..

డ్వాక్రా గ్రూపు మహిళలను తరలించే బాధ్యతలను రీసోర్స్ పర్సన్లకు, పెన్షనర్లను తీసుకువచ్చే బాధ్యతను వలంటీర్లకు అప్పగించారు. వీరిని సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతం చేసే బాధ్యత పీడీలు, ఏపీడీలకు కట్టబెట్టారు. జోనల్ కమిషనర్లు పైనుంచి అన్నీ చూసుకోవాలని సూచించారు. ప్రధాన మార్గం నుంచి ఎంత దూరంలో ప్రజలను నిల్చోబెట్టాలో కూడా స్పష్టంగా అధికారులకు సూచించారు. విమానాశ్రయం నుంచి ఆగకుండా కాన్వాయ్‌లో వెళ్లిపోయేటపుడు ఈ జంక్షన్ల వద్ద జనాలు ఎందుకో అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అంత్యక్రియలకు సిద్ధం చేశాక లేచి కూర్చుంది



సత్యవేణి (ఫైల్)

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 20: 'వెంటిలేటర్ తీసేస్తే పది నిమిషాలకు మించి బతకరు. బంధువులకు కబురు పెట్టుకోండి. వైద్యం చేయడానికి కూడా ఏమీ లేదు.' అని అమలాపురంలోని పెద్ద ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు తేల్చేశారు. మలేసియాలో ఉన్న కొడుకు వరుస బిడ్డను సైతం ఆగమేఘాలపై స్వగ్రామానికి రప్పించారు. అంత్యక్రియలకు అన్నీ సిద్ధం చేశారు. తీరా వెంటిలేటర్‌ను తీసేసి ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చిన తర్వాత ఆమె మళ్లీ లేచి కూర్చొంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం జనుపల్లి మన్నా కాలనీలో ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మన్నా కాలనీకి చెందిన లంకలపల్లి శ్రీరామమూర్తి, సత్యవేణి దంపతులు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న 59 ఏళ్ల సత్యవేణికి ఈ నెల 17న బీపీ పడిపోవడంతో ఆమెను అమలాపురంలోని ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. 18వ తేదీ ఉదయానికి ఆమె పరిస్థితి విషమంగా మారింది. వెంటిలేటర్ తీసేస్తే చనిపోతుందని చెప్పేశారు. దీంతో బంధువులు మలేసియాలో ఉంటున్న కొడుకు వరుస బిడ్డ (సోదరి కుమారుడు)ను హుటాహుటిన రప్పించారు. అదే రోజున అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసి సత్యవేణిని ఆస్పత్రి నుంచి అంబులెన్సులో ఇంటికి తీసుకువచ్చారు. కొద్దిసేపటికే ఆమె లేచి కూర్చుని మీరంతా ఎందుకొచ్చారని ప్రశ్నించడంతో అందరూ అవాక్కయ్యారు. మంగళవారం ఉదయం మళ్లీ బీపీ డౌన్ కావడంతో ఆమెను మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి ఆమె ఐసీయూలో చికిత్స పొందుతోంది.

నేడు వైసీపీకి వేమిరెడ్డి రాజీనామా!

- ఆయన భార్య ప్రశాంతి కూడా..

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం వైసీపీకి అధికారికంగా రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొన్నాళ్లుగా పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్న ఆయన.. తన రాజీనామా లేఖను వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్‌కు పంపనున్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నెల్లూరు లోక్‌సభ స్థానంలో పోటీ చేసేందుకు తాను సిద్ధమైనప్పటికీ.. దాని పరిధిలో కొందరు ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చాలన్న తన సూచనలను జగన్ పట్టించుకోకుండా.. తనకు తెలియజేయకుండానే ఏకపక్షంగా ఇన్‌చార్జులను ప్రకటించడంపై వేమిరెడ్డి తీవ్ర మనస్తాపానికి గుర్యారు. ఇటీవల హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబుతో సమావేశమయ్యారు. సున్నిత మనస్కుడిగా పేరొందిన వేమిరెడ్డి.. వ్యక్తిత్వ హననం జరుగుతున్న చోట రాజీపడి ఉండడం కంటే.. అక్కడి నుంచి వైదలగడమే గౌరవంగా ఉంటుందని భావిస్తున్నారని కొందరు వైసీపీ నేతలు చెబుతున్నారు. ఆయన భార్య ప్రశాంతి కూడా వైసీపీకి గుడ్‌బై చెబుతారని అంటున్నారు.



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ), కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఆర్ఎఫ్‌టీఐ) ఉమ్మడిగా 'జాయింట్ ఎంట్రెన్స్ టెస్ట్(జెట్) 2023-24' నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. దీని ద్వారా ఫిల్మ్, టెలివిజన్ విభాగాల్లో పీజీ డిప్లొమా, యూజీ/పీజీ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ టెస్ట్‌ని ఏ, బీ, సీ గ్రూప్‌ల వారీగా ఎఫ్‌టీఐఐ నిర్వహిస్తుంది. అభ్యర్థులు ఒక్కో గ్రూప్ నుంచి ఒక కోర్సు చొప్పున గరిష్ఠంగా మూడు కోర్సులకు అప్లయ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 28 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. టెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఇంటర్వ్యూలు, మెడికల్ టెస్ట్ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. జెట్ 2023 స్కోర్ వ్యాలిడిటీ 2024 డిసెంబరు 31 వరకు ఉంటుంది.

ఫిల్మ్ అండ్ టెలివిజన్ సంస్థల్లో ప్రవేశానికి జెట్

గ్రూప్-ఏ కోర్సులు(పీజీ డిప్లొమా)

- రెండేళ్ల వ్యవధి గల ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్, మూడేళ్ల వ్యవధి గల ప్రొడక్షన్ ఫర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్, యానిమేషన్ సినిమా కోర్సులను ఎస్ఆర్ఎఫ్‌టీఐ అందిస్తోంది. మూడేళ్ల వ్యవధి గల ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్, రెండేళ్ల వ్యవధి గల స్క్రీన్ యాక్టింగ్, స్క్రీన్ రైటింగ్(ఫిల్మ్, టీవీ, వెబ్ సిరీస్) కోర్సులను ఎఫ్‌టీఐఐ అందిస్తోంది.
- మూడేళ్ల వ్యవధి గల యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్ అనే యూజీ సర్టిఫికెట్ కోర్సు కూడా ఎఫ్‌టీఐఐలో ఉంది.

గ్రూప్-బీ కోర్సులు(పీజీ డిప్లొమా)

- డైరెక్షన్ అండ్ స్క్రీన్ ప్లే రైటింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్ కోర్సులు రెండు ఇన్‌స్టిట్యూట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. వీటితో పాటు గ్రూప్-ఏ విభాగంలోని ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్, స్క్రీన్ యాక్టింగ్ కోర్సులను మాస్టర్స్ డిగ్రీకి సమానమైనవిగా ఏఐయూ గుర్తించింది.

గ్రూప్-సీ కోర్సులు



- **పీజీ డిప్లొమా:** ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్‌కు సంబంధించి డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్, రైటింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కోదాని వ్యవధి రెండేళ్లు. వీటిని ఎస్ఆర్ఎఫ్‌టీఐ అందిస్తోంది.
- **పీజీ సర్టిఫికెట్:** డైరెక్షన్, ఎలక్ట్రానిక్ సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ టెలివిజన్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కోదాని వ్యవధి ఏడాది. ఇవి ఎఫ్‌టీఐఐలో అందుబాటులో ఉన్నాయి. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత వివరాలు

పీజీ డిప్లొమా(ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్) కోర్సుకు డిగ్రీ(అప్లయిడ్ ఆర్ట్స్/ఆర్కిటెక్చర్/పెయింటింగ్/స్కల్ప్చర్/ఇంటీరియర్ డిజైన్) ఉత్తీర్ణులై ఉండాలి. యూజీ సర్టిఫికెట్(యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్) కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/ కనీసం రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. మిగిలిన కోర్సులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జెట్ 2023-24 వివరాలు

- మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్లో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 20 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు; రెండో పార్ట్‌లో 20 మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు అడుగుతారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. రెండో పేపర్ డిస్క్రిప్టివ్ టైప్‌లో ఉంటుంది. దీనికి 60 మార్కులు ప్రత్యేకించారు.
- రెండు పేపర్లలో సాధించిన మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఓరియంటేషన్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. రిటెన్ టెస్ట్ స్కోర్‌కు 20 శాతం, ఓరియంటేషన్‌కు 50 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- స్క్రీన్ యాక్టింగ్ కోర్సుకు మాత్రం రిటెన్ టెస్ట్ స్కోర్, ఆడిషన్ స్కోర్‌ల ఆధారంగా మొదటి రిజల్ట్; ఓరియంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా రెండో రిజల్ట్ రూపొందిస్తారు. రెంటికీ సమాన వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులు అన్ని ప్రక్రియల్లో తప్పనిసరిగా పాల్గొనాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఒక కోర్సుకు రూ.2,000 (రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.600); రెండు కోర్సులకు రూ.3000(రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.900); మూడు కోర్సులకు రూ.4,000(రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.1200)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 17
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **గ్రూప్-ఏ కోర్సులకు ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 6
- **గ్రూప్-బీ, గ్రూప్-సీ కోర్సులకు ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 7
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** ftii.ac.in, srfti.ac.in

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అండ్ కస్టమ్స్ రెగ్యులేషన్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇందులో 18 మాడ్యూల్స్ ఉంటాయి. వారాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒకటింబావు వరకు ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో లెక్చర్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ స్టడీ అనాలిసిస్, అసైన్‌మెంట్స్, పోర్ట్ విజిట్స్ ఉంటాయి. ఎంట్రీ లెవెల్/ మిడిల్ లెవెల్/సీనియర్ లెవెల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఆంత్రప్రెన్యూర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: కీ ఎలిమెంట్స్-గేజ్ రిస్క్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టేషన్స్, ఓషన్ ట్రాన్స్‌పోర్టేషన్, గ్రీన్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్/సస్టయినబుల్ లాజిస్టిక్స్, మెరైన్ కార్గో ఇన్సూరెన్స్, ఇంటర్నేషనల్ లాజిస్టిక్ కాంట్రాక్ట్స్-డ్రాఫ్టింగ్, ప్యాకేజింగ్-లేబులింగ్-మార్కింగ్-ఆపరేషన్స్, మారిటైమ్ ఫ్రాడ్స్-రీసెంట్ డెవలప్‌మెంట్స్, వేర్‌హౌసింగ్ అండ్ మెటీరియల్ హ్యాండిలింగ్, ట్రాన్స్‌పోర్ట్ డాక్యుమెంట్స్-ట్రేడ్ లాజిస్టిక్స్, షిప్పింగ్ అండ్ ఫ్రైటింగ్ ప్రాక్టీసెస్, కస్టమ్స్-రూల్స్/రెగ్యులేషన్స్/ప్రొసీజర్స్/ లా/ యాక్ట్/ సర్క్యులర్, ఇంపోర్ట్ ప్రొసీజర్, ఎక్స్‌పోర్ట్ ప్రొసీజర్, ఇండియాస్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ తదితరాలు

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.35,400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** iift.ac.in

ఐఐపీలో ప్యాకేజింగ్ డిప్లొమా


ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని కరస్పాండెన్స్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు(ఏడాదిన్నర). అడ్మిషన్ తీసుకొన్నవారికి ప్యాకేజింగ్ టెక్నాలజీకి సంబంధించిన కోర్సు మెటీరియల్‌తోపాటు మోడల్ ప్రశ్నల బుక్‌లెట్‌ను ఇస్తారు. హైదరాబాద్, అహ్మదాబాద్, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతాల్లో ప్రాంతీయ కేంద్రాలు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఇంట్రడక్షన్ టు ప్రిన్సిపల్ ఆఫ్ ప్యాకేజింగ్ అండ్ మెటీరియల్, రిజిడ్ ప్యాకేజింగ్ మెటీరియల్ అథెసివ్, ప్యాకేజింగ్ మెషినరీ అండ్ ప్రింటింగ్, ప్రొడక్ట్ ప్యాకేజింగ్ అనే నాలుగు పేపర్లు ఉంటాయి. వీటితోపాటు ప్రాజెక్ట్ వర్క్ కూడా ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు నిర్దేశించారు. ప్రతి పేపర్‌లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు సాధించినవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్/కామర్స్/ఆర్ట్స్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు ప్రొడక్షన్, పర్చేజ్, మార్కెటింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో కనీసం ఏడాది ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.77,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.iip-in.com



ఐఐఐటీ అలహాబాద్‌లో ఎంబీఏ

అలహాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సంస్థ నిర్వహించే మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(ఐమ్యాట్) లేదా జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా స్క్రీనింగ్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. మ్యాట్(2023 డిసెంబరు)/క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2023/జీమ్యాట్(2019 నుంచి) స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్ష సీబీటీ మోడ్‌లో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **అడ్మిషన్ టెస్ట్ సెంటర్:** ఐఐఐటీ అలహాబాద్ క్యాంపస్
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 29, 30; జూన్ 2
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 5
- **వెబ్‌సైట్:** www.iiita.ac.in



ఫ్లిప్‌కార్ట్‌తో ఎన్ఎస్‌డీసీ ఒప్పందం

యువతకు ఉపాధి కల్పించే కోర్సుల నిర్వహణ, శిక్షణ, ఉపాధి కల్పనకు సంబంధించి ఫ్లిప్‌కార్ట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్ఎస్‌డీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. ఇండియాలో ఈ కామర్స్ రంగంలో అవకాశాలను పొందేందుకు యువతకు ఉచితంగా ఆన్‌లైన్ కోర్సులు, శిక్షణను ఈ రెండు సంస్థలు కలిసి నిర్వహిస్తాయి. ఎన్ఎస్‌డీసీ అక్రెడిటెడ్ సర్టిఫైడ్ కోర్సుల కోసం ఫ్లిప్‌కార్ట్ శిక్షణ, నైపుణ్యం, అప్‌స్కిల్, ప్లేస్‌మెంట్స్ తదితర విషయాల్లో తోడ్పాటును అందిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన సప్లయ్ చైన్ ఆపరేషన్స్ అకాడమీ, ప్రాజెక్ట్ బ్రైట్ ఇనీషియేటివ్ కింద ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తుంది. ఎన్ఎస్‌డీసీ నిర్వహించే జాబ్ ఫెయిర్స్‌లో సైతం ఫ్లిప్‌కార్ట్ పాల్గొంటుంది.

గ్రేట్ స్కాలర్‌షిప్స్‌కు ఆహ్వానం

బ్రిటిష్ కౌన్సిల్ - 2024కు సంబంధించి గ్రేట్ స్కాలర్‌షిప్స్‌ను ప్రకటించింది. ఒక్కోటి పదివేల పౌండ్ల విలువైనవి కాగా ప్రత్యేకించి భారతీయ విద్యార్థులకు 26 స్కాలర్‌షిప్స్‌ను ఇస్తున్నారు. ఫైనాన్స్, మార్కెటింగ్, బిజినెస్, సైకాలజీ, డిజైన్, హ్యుమానిటీస్, డ్యాన్స్ తదితరాల్లో పీజీ కోర్సులు చేసే వారికి వీటిని ఉద్దేశించారు. బ్రిటన్‌లోని పాతిక విశ్వవిద్యాలయాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. 2024-25 విద్యాసంవత్సరంలో ఆ వర్సిటీల్లో అడ్మిషన్ సాధించిన ఇండియన్ స్టూడెంట్స్ మాత్రమే ఈ స్కాలర్‌షిప్స్ పొందేందుకు అర్హులు. వీటికి ఎంపికైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. మరిన్ని వివరాలకు ఈ వెబ్‌సైట్స్ https://www.britishcouncil.in/study-uk/scholarships/great-scholarships https://study-uk.britishcouncil.org/ చూడవచ్చు.

హైదరాబాద్‌లో ఫిజిక్స్ వాలా 3 ఆఫ్‌లైన్ విద్యాపీఠ్ కేంద్రాలు

హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో టెక్ ఎనేబుల్డ్ ఆఫ్‌లైన్ విద్యాపీఠ్ కేంద్రాలను ఆరంభించినట్టు ఎడ్యుటెక్ కంపెనీ ఫిజిక్స్ వాలా ప్రకటించింది. మాదాపూర్, హబ్సిగూడ, కూకట్‌పల్లిలో వీటిని ఆరంభించింది.

దేశంలోని 49 పట్టణాల్లో 75 కేంద్రాలు ఈ సంస్థకు చెందినవి ప్రస్తుతం పని చేస్తున్నాయి. జేఈఈ, నీట్ కోసం ఇక్కడ శిక్షణ ఇస్తారు. ఆ ప్రవేశ పరీక్షల కోసం రికార్డ్ చేసిన లెక్చర్లు, ఎన్‌సీఈఆర్‌టీ మెటీరియల్‌కు తోడు సందేహ నివృత్తి, ప్రత్యేక మాడ్యూల్స్, ప్రాక్టీస్ సమస్యల పరిష్కారం తదితరాలన్నీ ఈ ఆఫ్‌లైన్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని ఫిజిక్స్ వాలా ప్రకటించింది. యూపీలోని నోయిడా కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తున్న విషయం తెలిసిందే.

లిటిల్స్



తోడేలు తెలివి.. తిరగబడింది!

ఒక అడవిలో తోడేలు ఉండేది. దానికి తెలివి ఎక్కువ. కుందేళ్లను, జింక పిల్లలను తినేది. చూస్తుండగానే అడవిలో ఎండాకాలం వచ్చింది. జంతువులన్నీ వేరే ప్రాంతానికి వెళ్లిపోయాయి. నీళ్ల వెతుక్కుంటూ కొన్ని వెళ్లిపోయాయి. ఈ తోడేలుకు మాత్రం సులువుగా ఆహారం దొరకాలనుకునేది. వేటాడకుండా తినాలనుకునేది. దీంతో అడవిలోంచి ఓ ఊరికి వెళ్లాలనుకుంది.

తోడేలు ఎలాగైనా మేకలనో, గొర్రెలనో పొంచి తినాలనుకుంది. అయితే ఎక్కడ చూసి గొర్రెలు, మేకల మందల దగ్గర వేట కుక్కలు ఉండటంతో భయపడింది. ప్రాణాలు దక్కించుకోవటమే తరువాయి అనుకుని పారిపోయింది. అయితే ఆ ఊరిలోని బలిష్ఠమైన మేకలు, గొర్రెలు చూశాక.. ఊరు వదలి వెళ్లిపోవాలని అనిపించలేదు దానికి. దీంతో ఊరి చుట్టూ చాలా రోజులు తిరిగింది. ఎలాగైనా గొర్రెలను, మేకలను తినాలని నిర్ణయించుకుంది.

అదే ఆలోచనతో తిరిగే తోడేలుకు ఒకరోజు గొర్రె చర్మం దొరికింది. దాన్ని కప్పుకుంది. గొర్రెల గుంపు ఊరికి చేరే వేళ వాటిలో కలసిపోయింది. ఇలా



రోజూ గొర్రెల మందలో వెళ్లి వచ్చేది. ఇక రెండు రోజుల తర్వాత గొర్రెలను తినటం ప్రారంభించింది. 'ఇంత రుచికరమైన ఆహారం ఇక్కడే ఉంది. అనవసరంగా అడవిలో ఉన్నా' అనుకుంది. చూస్తుండగానే మెల్లగా గొర్రెలు మాయం అవుతున్నాయి. గొర్రెలకాపరికి ఈ విషయం అర్థమైంది.

ఒక రోజు తెల్లారుజామున గొర్రెల దగ్గరకకు వెళ్లాడు. ఓ గొర్రెను కటికకు అమ్మాలనుకున్నాడు. గొర్రెల్లో పెద్ద గొర్రెగా ఒకటి కనిపించింది. దాన్ని తీసుకెళ్లమని పురమాయించాడు. అది వాస్తవానికి తోడేలు. ఒక మనిషి ఈ గొర్రె బరువుగా ఉందని భుజాలకు ఎత్తుకున్నాడు. బతుకుజీవుడా.. అనుకుంటూ తోడేలు ఎగిరి దూకి పారిపోయింది. దాని మీద ఉండే చర్మం తోలు కిందపడిపోయింది. ఆ తర్వాత తోడేలు ఆ పక్కకే రాలేదెన్నడూ.


సరైన నీడ ఏది?



7 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 235

4		3		7		5	2	
		2	6					
	6			2	9			7
		9						4
	4						8	
8						6		
3			9	6			4	
					5	2		
	1	7		4		3		9

సుడోకు - 234 సమాధానం

3	8	4	7	9	2	5	6	1
9	7	5	6	4	1	8	2	3
6	1	2	3	5	8	9	4	7
1	4	9	5	2	3	6	7	8
8	5	7	4	6	9	3	1	2
2	6	3	1	8	7	4	5	9
5	2	8	9	1	4	7	3	6
7	9	6	2	3	5	1	8	4
4	3	1	8	7	6	2	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.